మన సమగ్ర

# ప్రజావాణి

RNI NO:TGTEL/25/A5443

తెలుగు డైలీ

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY




| రాజన్న సిరిసిల్ల | సోమవారం | 28.09.2026 | సంపుటి : 01 | సంచిక : 269 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | MONDAY | 28.09.2026 | Volume : 01 | Issue :269 | Pages : 12 | Cost : 2/- |

## పట్టాలు ఎక్కిన తొలి ఎల్ఎన్జీ రైలు

- డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా డ్యూయల్ ఫ్యూయల్ సాంకేతికత




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:** దేశంలో మొట్టమొదటి ఎల్ఎన్జీడీజిల్ డ్యూయల్ ఫ్యూయల్ డెము రైలు ఆదివారం పట్టాలెక్కింది. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) ఈ రైలును అభివృద్ధి చేసింది. గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జెండా ఊపి రైలును ప్రారంభించారు.

మిగతా2లో...

## యూపీలో భారీ వర్షాలు.. 56 మంది మృతి

- పలు జిల్లాల్లో వరద పరిస్థితి.. వెయ్యికి పైగా ఇళ్లకు నష్టం



**లక్నో, సెప్టెంబర్ 27:** ఉత్తరప్రదేశ్‌లో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలు, ఈదురుగాలులకు సంబంధించిన ఘటనల్లో శుక్రవారం నుంచి 56 మంది మృతి చెందగా, 46 మంది గాయపడ్డారు. భారీ వర్షాలతో రహదారులు, గ్రామాలు నీట మునిగాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మిగతా2లో...

## ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం: మోదీ

- సర్జికల్ స్ట్రైక్స్‌కు పదేళ్లు.. ఉగ్రవాదానికి దీటైన సమాధానం ఇస్తామని స్పష్టం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:** ఉగ్రవాదంపై భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద చర్యలకు పాల్పడితే బలమైన, నిర్ణయాత్మక సమాధానం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం

మిగతా2లో...

# ఏపీ వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు

- మిగులు పోస్టుల సర్దుబాటుతో 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కల్పన



**అమరావతి, సెప్టెంబర్ 27:** ఆంధ్రప్రదేశ్‌లో వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 244 ద్వారా వార్డు సచివాలయ సిబ్బందికి పదోన్నతి అవకాశాలను మరింత సులభతరం చేసింది. వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు కొత్తగా సృష్టించిన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో పదోన్నతులు కల్పించనున్నారు. మిగులు పోస్టులను సర్దుబాటు చేయడం ద్వారా మునిసిపల్

మిగతా2లో...




## 'సర్'ను రద్దు చేయండి

**ఎన్నికల సంఘం పనితీరుపై దర్యాప్తునకు ఆదేశించండి**

**సీజేఐకి 2 వేల మందికి పైగా పౌరుల బహిరంగ లేఖ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై విచారణ జరిపించాలని కోరుతూ 2 వేల మందికి పైగా పౌరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విద్యావేత్తలు, న్యాయవాదులు, మాజీ అధికారులు, సామాజిక కార్యకర్తలు,

మిగతా2లో...

## భూ ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేటీఆర్

- 8 వేల ఎకరాల వ్యవహారంపై ఆధారాలు బయటపెట్టాలి.. సిరిసిల్ల పర్యటనలో రాజకీయ విమర్శలకు కాకుండా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 27:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావు (కేటీఆర్) ఆయనకు బహిరంగ లేఖ రాశారు. సిరిసిల్లలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలపై ప్రభుత్వం పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికే 2,400 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న నేపథ్యంలో ఆ భూములకు సంబంధించిన మండలం, గ్రామం, సర్వే నంబర్లు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను

మిగతా2లో...



## ఆర్టీఐ పరిధి నుంచి శాంతిభద్రతల విభాగం తొలగింపు

- వివాదం నేపథ్యంలో ఉత్తర్వులు ఉపసంహరించుకున్న తమిళనాడు ప్రభుత్వం

**చెన్నై, సెప్టెంబర్ 27:** తమిళనాడులో పబ్లిక్ (శాంతిభద్రతలు) విభాగాన్ని సమాచార హక్కు చట్టం పరిధి నుంచి మినహాయిస్తూ సెప్టెంబరు 21న జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉపసంహరించుకుంది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) కింద శాంతిభద్రతల విభాగాన్ని 'ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్'గా పేర్కొంటూ మినహాయింపు ఇచ్చారు. దీనిపై పలు వర్గాల నుంచి విమర్శలు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ విభాగం మత,

మిగతా2లో...

## నవంబర్ 19న ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభం

-రూ.5 లక్షల బీమా సౌకర్యం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ మన జనప్రగతి సెప్టెంబర్ 27:** రాష్ట్ర ప్రజలకు మరింత భద్రత కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. నవంబర్ 19న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించే 'ఇందిరమ్మ భీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు నెలకు ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని

మిగతా2లో...

## 33 జిల్లాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- వచ్చే ఏడాది 2.5 లక్షల మందితో గిన్నిస్ రికార్డు లక్ష్యం




## ఈసీపై కాంగ్రెస్ ఆరోపణలను కిషన్‌రెడ్డి ఖండించారు

- రాహుల్ గాంధీ వ్యాఖ్యలు రాజ్యాంగ సంస్థలపై నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉన్నాయంటూ విమర్శ



# ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రసారమైన 138వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో 2016లో నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్‌ను ప్రస్తావిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 2016 సెప్టెంబరు 2829 తేదీల్లో భారత సైన్యం నియంత్రణ రేఖను దాటి ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించిందని మోదీ గుర్తుచేశారు. ఉరీలోని సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. సర్జికల్ స్ట్రైక్స్ భారత ఉగ్రవాద వ్యతిరేక విధానంలో కొత్త దిశను ప్రపంచానికి చూపించాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌కు పదేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో మోదీ ఈ విషయాలను ప్రస్తావించారు. గత దశాబ్దంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలియజేసిందని మోదీ అన్నారు. 2019లో బాలాకోట్ వైమానిక దాడి, 2025లో ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలను కూడా ఆయన ప్రస్తావించారు. ఉగ్రవాదులు భారత్‌పై దాడికి పాల్పడితే దీటైన ప్రతిస్పందన ఉంటుందనే సందేశాన్ని ఈ చర్యల ద్వారా ఇచ్చినట్లు మోదీ పేర్కొన్నారు. మునుపటి సంవత్సరాల్లో దేశం ఎదుర్కొన్న ఉగ్రదాడులను కూడా ప్రధాని గుర్తుచేశారు. 2008 సెప్టెంబరు 13న ఢిల్లీలో జరిగిన వరుస పేలుళ్లు, అనంతరం జరిగిన ముంబై 26/11 ఉగ్రదాడులను ప్రస్తావించారు. ఉగ్రవాదం కారణంగా దేశం చాలాకాలం తీవ్ర నష్టాన్ని చవిచూసిందని పేర్కొంటూ, ప్రస్తుత విధానం ఉగ్రవాదానికి గట్టి సమాధానం ఇవ్వడంపై దృష్టి సారించిందని తెలిపారు. **జనగణనలో ప్రజల భాగస్వామ్యం** 'మన్ కీ బాత్'లో జనగణన అంశాన్ని కూడా మోదీ ప్రస్తావించారు.

జనగణనను జాతీయ బాధ్యతగా పేర్కొన్న ఆయన.. ప్రతి పౌరుడు ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ స్వీయ గణన సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. **పర్యావరణం, యువతపై ప్రస్తావన** పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పరిశుభ్రత, పోషకాహారం, యువత, క్రీడలు, సాంస్కృతిక వారసత్వం వంటి పలు అంశాలను కూడా ప్రధాని తన ప్రసంగంలో ప్రస్తావించారు. అసోంలో పిగ్మీ హాగ్ సంరక్షణకు జరుగుతున్న ప్రయత్నాలను అభినందించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంలో యువత చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

# 'సర్'ను రద్దు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పాత్రికేయులు, మాజీ సైనిక అధికారులు తదితరులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులకు బహిరంగ లేఖ రాశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తలెత్తినట్లు వారు పేర్కొంటున్న అంశాలపై కోర్టు స్వయంగా దృష్టి సారించాలని కోరారు. ఎన్నికల సంఘంలో అంతర్గతంగా విభేదాలు ఉన్నాయన్న వార్తల నేపథ్యంలో ఎస్ఐఆర్‌కు సంబంధించిన కొన్ని నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఓటర్ల నమోదు దరఖాస్తు పత్రాల్లో మార్పులు, ఓటర్ల సమాచారానికి సంబంధించిన డిజిటల్ వ్యవస్థలపై కేంద్రీకృత నియంత్రణ వంటి అంశాలపై కూడా వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ఇవి లేఖలో సంతకం చేసిన వారి ఆరోపణలు మాత్రమేనని, వాటిపై తుది న్యాయపరమైన నిర్ధారణ జరగాల్సి ఉంది. ఎస్ఐఆర్ ప్రక్రియకు తాత్కాలికంగా నిలుపుదల విధించాలని, ఎన్నికల సంఘం పనితీరుపై స్వతంత్రంగా విచారణ జరిపించాలని వారు కోరినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఎన్నికల సమాచారానికి సంబంధించిన కీలక డేటాబేస్‌లు, రికార్డులు, లాగ్‌లను భద్రపరచాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, ఎస్ఐఆర్ వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న మీడియా కథనాలను ఆధారంగా చేసుకుని ఈ పిటిషన్ దాఖలైనట్లు సమాచారం. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ఈసీఐనెట్, ఈఆర్ఓనెట్ డేటాబేస్‌లపై సాంకేతిక, ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కూడా పిటిషన్‌లో కోరారు. ఎన్నికల జాబితాల సవరణపై రాజకీయంగా ఇప్పటికే తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో 2 వేల మందికి పైగా పౌరులు సుప్రీంకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను ఎన్నికల సంఘం, సంబంధిత అధికారుల వాదనలతో పాటు న్యాయస్థానం పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ అంశంపై న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతోంది.

# భూ ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు వెల్లడించాలని కోరారు. భూ ఆక్రమణలపై చేసిన ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కేటీఆర్ అన్నారు. ఆరోపణలకు ఆధారాలు లేకపోతే ముఖ్యమంత్రి సిరిసిల్ల ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులను ప్రజల ముందుంచాలని, భూములను గుర్తించి స్వాధీనం చేసుకున్న ప్రక్రియలో పాల్గొన్న అధికారుల వివరాలను కూడా వెల్లడించాలని కోరారు. **నేతన్నల బకాయిలపై ప్రశ్నలు** సిరిసిల్ల నేతన్నల సమస్యలపై కూడా కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేనేత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.60 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. నేతన్నలకు గతంలో అమలు చేసిన రూ.5 లక్షల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, మూతపడిన చేనేత పార్కు కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ చీరల పథకం నిలిచిపోవడం, వస్త్ర పరిశ్రమకు సంబంధించిన ఆర్డర్లు తగ్గడం వల్ల నేతన్నలకు ఉపాధి అవకాశాలు తగ్గాయని ఆయన పేర్కొన్నారు. **రైతుల సమస్యలపైనా స్పష్టత కోరిన కేటీఆర్** సిరిసిల్ల నియోజకవర్గ రైతులకు సంబంధించిన రైతుబంధు బకాయిలు, రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబీమా అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల నియోజకవర్గంలోని సుమారు 56 వేల మంది రైతులకు రూ.532 కోట్ల మేర పెట్టుబడి సాయం అందిందని ఆయన పేర్కొన్నారు.

ఎకరాకు రూ.15 వేల సాయం చేస్తామని ఇచ్చిన హామీ అమలు ఎప్పటి నుంచి జరుగుతుందో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే సిరిసిల్ల ప్రాంతానికి కొత్త పరిశ్రమలు, ఆక్వా హబ్, ఆహార శుద్ధి పరిశ్రమల మండలి వంటి ప్రతిపాదనల పురోగతిపై కూడా ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని కోరారు. మల్కపేట జలాశయం నుంచి అప్పర్ మానేరు వరకు నీటిని తరలించే అంశంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించాలని పేర్కొన్నారు. **హామీల అమలుపై తేదీలు ప్రకటించాలి** కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. మహాలక్ష్మి పథకం, పింఛన్ల పెంపు, రైతులకు సంబంధించిన హామీలు, దళితబంధు, బీసీ బంధు తదితర సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన తేదీలను ప్రకటించాలని కోరారు.

సిరిసిల్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని, గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటనలో స్థానిక సమస్యలకు సమాధానాలు ఇవ్వాలని, రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజలకు సంబంధించిన అంశాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ తన లేఖలో కోరారు. భూ ఆరోపణలకు సంబంధించిన పూర్తి ఆధారాలను ప్రభుత్వం బహిర్గతం చేస్తే, తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలను ఎదుర్కోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.

# దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం

## పెండింగ్‌లోని యూఎల్‌సీ దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు.. అర్హమైన కేసుల క్రమబద్ధీకరణకు చర్యలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 27:** దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూ సమస్యలకు పరిష్కారం చూపేం దుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెండిం గ్ దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హత ఉన్న కేసులను క్రమబద్ధీకరించేందుకు అధికా రులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ శాఖ మెమో నంబర్ 48062/ULC/A1/ 2026`1ను జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జీఓలు 455, 456, 747, 92 కింద దాఖలైన పెండింగ్ యూఎల్‌సీ దరఖాస్తులను పరిశీలించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం అర్హత ఉన్న కేసులను సంబంధిత నిబం ధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని సూచించారు. ఈ నిర్ణయంతో సంవత్సరాల తరబడి భూ హక్కులు, రిజిస్ట్రేషన్లు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దరఖాస్తుదారులకు ఉపశమనం కలిగే అవకాశం ఉంది. 2016లోనే యూఎల్‌సీ సమస్యల పరిష్కారానికి అప్పటి ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కాలేదని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. దీంతో వేలాది దరఖాస్తులు సంవత్సరాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని, ఫలితంగా భూముల హక్కులు, లావాదేవీల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు.



ప్రస్తుతం అర్హత కలిగిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. **22-ఏ సమస్యలపైనా దృష్టి** భూ సమస్యలతో పాటు రిజిస్ట్రేషన్ చట్టంలోని 22-ఏ సెక్షన్‌కు సంబంధించిన సమస్యలను కూడా వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు 22-ఏకు సంబంధించిన పలు సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటికే ఈ అంశంపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కూడా ఉత్తర్వులు జారీ చేసినట్లు పొంగులేటి చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ లేదా సంబంధిత పురపాలక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే అనుమతులు ఉన్న ఆస్తులు 22-ఏ జాబితాలో ఉన్నప్పటికీ, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. యూఎల్‌సీతో పాటు మిగిలిన 22-ఏ సమస్యలను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు. అర్హత, పత్రాల పరిశీలన, చట్టపరమైన నిబంధనల ఆధారంగానే కేసులను పరిష్కరించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# పట్టాలు ఎక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు

(మొదటి పేజీ తరువాయి)

సబర్మతిమహేసన జంక్షన్ మధ్య ఈ రైలు నడవనుంది. 62 కిలోమీటర్ల దూరాన్ని సుమారు గంటా 20 నిమిషాల్లో చేరుకోనుంది. ఎల్ఎన్‌జీ అందుబాటులో లేని పరిస్థితుల్లో డీజిల్‌కు మారేలా ఈ రైలును రూపొందించారు. మొత్తం ఎనిమిది నాన్-ఏసీ చైర్‌కార్ కోచ్‌లు ఉన్నాయి. రైలును ప్రారంభించే ముందు 2 వేల కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయి ట్రయల్స్ నిర్వహించారు. ఎల్ఎన్‌జీ వినియోగంతో డీజిల్ వినియోగం, కర్బన ఉద్గారాలు తగ్గడంతో పాటు నిర్వహణ వ్యయం కూడా తగ్గుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

# యూపీలో భారీ వర్షాలు.. 56 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

వెయ్యికి పైగా ఇళ్లు దెబ్బతినగా, పంటలకు కూడా భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు సహాయక చర్యలు చేపట్టి, చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. వర్షాల తీవ్రత కొంత తగ్గినప్పటికీ పలు జిల్లాల్లో వరద పరిస్థితి కొనసాగుతోంది. సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు.

# ఏపీ వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు

(మొదటి పేజీ తరువాయి)

అడ్మినిస్ట్రేషన్ శాఖలో 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులకు మార్గం సుగమం కానుంది. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు పదోన్నతులు కల్పించిన అనంతరం, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించే అవకాశం ఏర్పడింది. దీంతో వివిధ కేడర్లలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా ఉద్యోగోన్నతి ప్రయోజనాలు అందనున్నాయి. అదేవిధంగా 815 వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ గ్రేడ్-2 పోస్టులను గ్రేడ్-1గా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సంఖ్యలో ఉన్న వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ గ్రేడ్-2 పోస్టులను కూడా గ్రేడ్-1గా ఉన్నతీకరించింది. ఈ మార్పుల ద్వారా సిబ్బంది పదోన్నతులకు అవసరమైన కేడర్ నిర్మాణాన్ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. మిగులు పోస్టులను సర్దుబాటు చేయడం ద్వారా ఈ ప్రక్రియను చేపట్టినందున ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం లేకుండా పోస్టుల పునర్వ్యవస్థీకరణ పూర్తి చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో వార్డు సచివాలయ ఉద్యోగుల్లో పదోన్నతులపై నెలకొన్న నిరీక్షణకు తెరపడినట్లయింది.

# నవంబర్ 19న ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. రైతులకు ఎకరానికి రూ.12 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని భట్టి విక్రమార్క సూచించారు.

ఇందిరమ్మ భీమా పథకం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

# ఆర్టీఐ పరిధి నుంచి శాంతిభద్రతల విభాగం తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

కుల ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, పోలీసు కాల్పులు, కస్టడీ మరణాలు, పోలీసు వేధింపులు, నిర్బంధ కేసులు తదితర అంశాలకు సంబంధించిన వ్యవహారాలను పరిశీలిస్తుంది. తాజా ఉత్తర్వులతో ఈ విభాగం ఆర్టీఐ పరిధిలోనే కొనసాగనుంది.

# 33 జిల్లాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్ మన జనప్రగతి సెప్టెంబర్ 27:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ జాగృతి ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది అన్ని జిల్లాలతో పాటు పలు దేశాల్లోనూ బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆదివారం బతుకమ్మ వేడుకల పోస్టర్, సంప్రదాయ బతుకమ్మ, చప్పట్ల పాటలతో రూపొందించిన సీడీని ఆమె ఆవిష్కరించారు. బతుకమ్మను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామస్థాయిలో బతుకమ్మ, కోలాటం కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు కవిత వెల్లడించారు. ఇప్పటికే పలు జిల్లాలు, దేశాల్లో కమిటీలను ఏర్పాటు చేశామని, మిగిలిన ప్రాంతాల్లోనూ త్వరలో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది సుమారు 2.5 లక్షల మందితో భారీ బతుకమ్మ వేడుకలు నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడమే లక్ష్యంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు కవిత తెలిపారు. గతంలోనూ బతుకమ్మను అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యంలోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ జాగృతి కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. అయితే వచ్చే ఏడాది నిర్వహించనున్న కార్యక్రమం గిన్నిస్ రికార్డు సాధించేందుకు ప్రతిపాదించిన కార్యక్రమమేనని, రికార్డు ఇప్పటికే సాధించలేదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ సంప్రదాయ పాటలు, చప్పట్ల పాటలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన సీడీని కూడా విడుదల చేశారు. సంప్రదాయ కళలు, పాటలను పరిరక్షించడంతో పాటు మహిళల భాగస్వామ్యాన్ని పెంచేలా బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఈసీపై కాంగ్రెస్ ఆరోపణలను కిషన్‌రెడ్డి ఖండించారు

**హైదరాబాద్ సెప్టెంబర్ 27:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేయడంపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నించడం, సీఈసీ రాజీనామా చేయాలని కోరడం సరికాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎన్నికల సంఘం సక్రమంగా పనిచేస్తోందని, ఓటమి ఎదురైనప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం ఏమిటని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ఏ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి పనిచేయదని, ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను కూడా కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మృతుల పేర్లు, నకిలీ లేదా రెండుసార్లు నమోదైన పేర్లు, తప్పులున్న వివరాలను సరిచేయడం ఓటర్ల జాబితా శుద్ధీకరణలో భాగమని ఆయన అన్నారు. ఈ ప్రక్రియ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కొనసాగుతోందని పేర్కొన్నారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు మాత్రం ఓటర్ల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందంటూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పనితీరుపై కాంగ్రెస్ నేతలు ఇటీవల తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సీఈసీని తొలగించాలని డిమాండ్ చేయగా, ఎన్నికల ప్రక్రియపై పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపిం చారు. ఎన్నికల సంఘం వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు అవసరమని ఆయన కోరారు. మరోవైపు, ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలపై వస్తున్న వార్తలను కిషన్‌రెడ్డి ప్రస్తావిస్తూ.. ఎన్నికల కమిష నర్లు పరస్పరం చర్చించుకోవడం, లేఖలు రాయడం సహజమైన ప్రక్రియేనని అన్నారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సమావేశమై తమ మధ్య విభేదాలు లేవని స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రతిపక్షాలు అనవసర వివాదంగా మార్చకూడదని ఆయన అన్నారు.

ప్రజావాణి తెలుగు దైలీ
సోమవారం, సెప్టెంబర్ 28, 2026



## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం తలనీలాలు తీయు నాయి బ్రాహ్మణ వర్కర్ సొసైటీ కి ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన కొలిపాక బ్రహ్మం



**పెనుగంచిప్రోలు సెప్టెంబర్ 27 మన ప్రజావాణి** పెనుగంచిప్రోలు గ్రామంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం తలనీలాలు తీయు నాయి బ్రాహ్మణ వర్కర్ సొసైటీ కి ప్రెసిడెంట్ ని తిరిగి కొలిపాక బ్రహ్మంని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది సంఘానికి సంబంధించిన సభ్యులుగా గౌరవ ముఖ్య సలహాదారుడు గా. కొలిపాక చిన్న రంగారావు. గౌరవ అధ్యక్షుడిగా.కొలిపాక నాగేశ్వరరావు. సంఘ అధ్యక్షుడిగా.కొలిపాక బ్రహ్మం. వైస్ ప్రెసిడెంట్ గా.ఉప్పు నరసింహారావు. సెక్రటరీగా. ఏలూరి శ్రీనివాసరావు. జాయింట్ సెక్రెటరీగా. కొలిపాక రాము. కోశాధికారిగా. కొలిపాక వెంకట్రావు. మరియు నెంబర్స్ గా. కొలిపాక భాస్కరరావు. కొలిపాక కృష్ణ. ఏలూరి గోపి. ఏలూరి చిన్న నాగబాబు. నీ కార్యవర్గ సభ్యులుగా అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది

## డాక్టర్ రాజేష్‌కు ఘన సన్మానం



**డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 27 ప్రజావాణి :** కురవి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అవిరె మోహన్‌రావు కుమారుడు డాక్టర్ రాజేష్ పీజీ ఎంట్రెన్స్‌లో 20 వేల ర్యాంకు సాధించిన సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త నాళ్ల వీరన్న దంపతులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో వైద్య రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమంలో TUWJ (IJU) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్. శ్రీనివాస్, కురవి ఆలయ మాజీ ధర్మకర్త కొణతం విజయ్ తదితరులు పాల్గొని డాక్టర్ రాజేష్‌కు అభినందనలు తెలిపారు.ం

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**మేడ్చల్ మల్కాజ్గిరి సెప్టెంబర్ 27 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు, తెలంగాణ ఉద్యమ మార్గదర్శి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ వివేకానంద కమ్యూనిటీ హాల్ వద్ద ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ గారు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేశారని, పదవులను సైతం త్యజించి ప్రజా ఉద్యమాలకు అంకితభావంతో సేవలందించారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.తెలంగాణ సమాజం కోసం బాపూజీ చూపిన మార్గం, ఆయన సేవా స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కొండా లక్ష్మణ్ బాపూజీ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపేట మాదిగ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ



**దండేపల్లి: సెప్టెంబర్ 27(సమగ్ర ప్రజావాణి)** మండలంలోని తాళ్లపేట గ్రామంలో మాదిగ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు హామీ ఇచ్చారు. ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల దుర్గ ప్రసాద్ గారి ఆధ్వర్యంలో తాళ్లపేట మాదిగ సంఘం నాయకులు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో మాదిగ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ సంఘం అధ్యక్షుడు వినయ్, సంఘ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే హామీపై తాళ్లపేట మాదిగ సంఘం నాయకులు, సోదరులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫయాజ్ ఉద్దీన్, సంఘ నాయకులు మోతె పోషన్న, రాయపోషం, బాపు, పోతాలింగు, కండ్లపెల్లి శంకర్, విజయ్, రాజులు, సుధాకర్, రమేష్, రేగుంట శంకర్, అంజన్న, అరుణ్, మహేందర్, సుద్దల అంజి, కండ్లపెల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాల ల సమస్య లపై ఎం ఎల్ ఏ ను కలిసిన యాజమాన్యం ప్రతినిధులు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 27 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన యాజమాన్య ప్రతినిధులు ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రైవేట్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని సైనిక్‌పురిలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల నిర్వహణ, విద్యా రంగానికి సంబంధించిన సమస్యలు, యాజమాన్యాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర అంశాలపై చర్చించారు.ప్రైవేట్ పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత వరకు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## వరద పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పర్యటించిన ప్రాజెక్ట్ అధికారి

- వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అన్ని విధాలా సహాయం అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలి



**ప్రజావాణి ప్రతినిధి కూనవరం మండలం సెప్టెంబర్ 27** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ కూనవరం మండలంలో గోదావరి, శబరి నదుల వరద పరిస్థితులను ప్రాజెక్ట్ అధికారి, ఐటీడీఏ చింతూరు శ్రీ శుభం నోఖ్వాల్, ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కూనవరం వంతెన వద్ద గోదావరి--శబరి నదుల సంగమ ప్రాంతంలో వరద ప్రవాహ పరిస్థితిని పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నది మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 43 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారి సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
వరద ప్రభావిత ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను వేగవంతం చేయాలని, కూనవరం మండల స్థాయి బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సహాయాన్ని తక్షణమే అందించాలని ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సిబ్బందిని అప్రమత్తం చేసి, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
అనంతరం ప్రాజెక్ట్ అధికారి కన్నాయిగూడెం నుంచి చింతరేగుపల్లి బ్లాక్ పాయింట్ వరకు పర్యటించి, బ్లాక్ పాయింట్ వద్ద దేశీ పడవల లభ్యతను పరిశీలించారు. వరద పరిస్థితుల్లో రవాణాకు ఇబ్బందులు ఏర్పడే ప్రాంతాల్లో ప్రజలను సురక్షితంగా తరలించేందుకు అవసరమైన పడవలు, ఇతర సహాయక వనరులు సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.
వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందించేందుకు చర్యలు చేపట్టామని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. కంది పప్పు, పామాయిల్, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు తదితర నిత్యావసర సరుకులను ఒకటి లేదా రెండు రోజుల్లో వరద ప్రభావిత ప్రజలకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.వరద పరిస్థితుల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే గ్రామస్థాయి లేదా మండలస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.
వరద పరిస్థితులకు సంబంధించిన సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు:
డివిజనల్ కంట్రోల్ రూమ్:
9490026397, 8121729228
కూనవరం మండలం:
9652814712
వీఆర్ పురం మండలం:
8008100892
చింతూరు మండలం:
9492527695
ఎటపాక మండలం:
8332085268, 9247249818
ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేకుండా వరద నీటిలోకి వెళ్లరాదని, అధికారుల సూచనలు పాటించాలని అధికారులు సూచించారు. వరద ప్రభావిత ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు జిల్లా, డివిజన్, మండల మరియు గ్రామస్థాయి యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎటపాక యూనిట్--1 ఎస్‌డీసీ జి. బాలకృష్ణ, కూనవరం యూనిట్--2 ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు, వీఆర్ పురం యూనిట్--2 ఎస్‌డీసీ అంజనేయులు, వీఆర్ పురం తహసీల్దార్ సరస్వతి, ఎటపాక సీఐ కృష్ణ, వీఆర్ పురం ఎస్ఐ షేక్, కూనవరం ఎస్ఐ రామకృష్ణతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ చింతూరు

## నిబంధనలు ఉల్లంఘించి డీజే వినియోగం

- పోలీసు విధులకు ఆటంకం..
- పెదవీడు గ్రామంలో డీజే సీజ్ చేసిన మఠంపల్లి పోలీసులు.
- సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు.
- హుజూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమందరాజు



**హుజూర్నగర్ సెప్టెంబర్ 27 (ప్రజావాణి)** ఉత్సవాల నిర్వహణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుంది, నిభందనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు అని హుజూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమందరాజు తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా, ప్రజా ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం, పోలీస్ శాఖ అధిక శబ్దాలు చేసే డిజేలు, చాలాసంచపై పూర్తిగా నిషేధం ఉన్నదని దీనిపై ప్రజలకు డివిజన్ నిర్వహణకు అవగాహన కల్పించి డీజే ఉపయోగించరాదని తెలియజేయడం జరిగిందని అన్నారు.
గణేశ్ నిమజ్జన శోభాయాత్రల్లో డీజేలు,అధిక శబ్ద వ్యవస్థల వినియోగం మరియు బాణసంచా కాల్చడంపై నిషేధం ఉన్నప్పటికీ, మఠంపల్లి మండలం పెదవీడు గ్రామంలో నిబంధనలను ఉల్లంఘిస్తూ పెద్ద శబ్దాలతో డీజేను వినియోగిస్తూ, బాణసంచా కాల్చుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో మఠంపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డీజే వినియోగాన్ని నిలిపివేయాలని, పోలీస్ శాఖ జారీ చేసిన నిబంధనలను పాటించాలని సంబంధిత వారికి సూచించారు. అయితే అక్కడ ఉన్న కొంతమంది వ్యక్తులు పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దాలతో డీజేను వినియోగిస్తూ నిబంధనలు ఉల్లంఘనలకు పాల్పడ్డారు.
ఈ ఘటనపై నిబంధనల ఉల్లంఘన, అధిక శబ్దాలతో డీజే వినియోగం, ప్రజలకు ఇబ్బంది కలిగించడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం తదితర అంశాలపై సంబంధిత వ్యక్తులపై మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో బీఎన్ఎస్ మరియు సంబంధిత చట్ట నిబంధనల మేరకు కేసు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన డీజే పరికరాలను పోలీసులు సీజ్ చేశారు.
ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి..
గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టి ఉత్సవ కమిటీలు, ప్రజలు మరియు ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. ఉత్సవాలు అంటే అందరూ కలిసిమెలిసి, సంతోషంగా జరుపుకోవాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించకూడదు. పోలీస్ శాఖ సూచనలు, ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించి పాటించాలని ఆయన కోరారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా అధిక శబ్దాలు చేయడం, నిషేధిత డీజేలు వినియోగించడం, బాణసంచా కాల్చడం లేదా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.
పరస్పర సహకారంతో ఉత్సవాలను విజయవంతంగా, ప్రశాంతంగా మరియు సంతోషంగా నిర్వహించుకోవాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించే వాతావరణాన్ని సృష్టించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హుజూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమందరాజు విజ్ఞప్తి చేశారు.

## లక్ష్మాపూర్ గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు

- ఎంపీ మాధవనేని రఘునందన్ రావుకు కుల సంఘం సభ్యులు, గ్రామ ప్రజల కృతజ్ఞతలు



**లక్ష్మాపూర్, సెప్టెంబర్ 27** గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక వసతుల కల్పనతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, కమ్యూనిటీ హాళ్లు గ్రామ ప్రజల ఐక్యతకు, సామాజిక అభివృద్ధికి దోహదపడతాయని గ్రామస్థులు పేర్కొన్నారు. లక్ష్మాపూర్ గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ నిధులతో భవన నిర్మాణ పనులు చేపట్టి, వీలైనంత త్వరగా కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నవీన్ గౌడ్ మాట్లాడుతూ, లక్ష్మాపూర్ గ్రామంలోని ఎస్సీ మాల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు కావడం సంతోషకరమని తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజాప్రతినిధులు సహకరించడం అభినందనీయమన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే గ్రామంలోని సంఘం సభ్యులకు సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన ఎంపీ మాధవనేని రఘునందన్ రావుకు గ్రామ ప్రజలు, కుల సంఘం సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.గ్రామంలో ప్రజలకు అవసరమైన మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని గ్రామస్థులు కోరారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే గ్రామంలోని ఎస్సీ మాల సంఘం సభ్యులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా లక్ష్మాపూర్ గ్రామంలో సామాజిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడిందని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.
చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ నిధులతో భవన నిర్మాణ పనులు చేపట్టి, వీలైనంత త్వరగా కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నవీన్ గౌడ్ మాట్లాడుతూ, లక్ష్మాపూర్ గ్రామంలోని ఎస్సీ మాల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు కావడం సంతోషకరమని తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజాప్రతినిధులు సహకరించడం అభినందనీయమన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే గ్రామంలోని సంఘం సభ్యులకు సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన ఎంపీ మాధవనేని రఘునందన్ రావుకు గ్రామ ప్రజలు, కుల సంఘం సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.గ్రామంలో ప్రజలకు అవసరమైన మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని గ్రామస్థులు కోరారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే గ్రామంలోని ఎస్సీ మాల సంఘం సభ్యులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా లక్ష్మాపూర్ గ్రామంలో సామాజిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడిందని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు సమసమాజ నిర్మాణానికి స్ఫూర్తి

- ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27(ప్రజావాణి):** సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.ఆదివారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం బాపూజీ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. బలహీన వర్గాల సంక్షేమం, సామాజిక సమానత్వం కోసం బాపూజీ సాగించిన ఉద్యమం సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి విశేషమని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.అదే విధంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభి గౌడ్, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు అందరూ పాల్గొని, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి ఎన్.ఎల్. నరసింహా రావు, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట మల్లయ్య, ఇతర కుల సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి తెలుగు డైలీ



# 90 ఏళ్ల క్రితం కులం గురించి భగత్‌సింగ్ ఏం చెప్పారు?

- సెప్టెంబర్ 27 వస్తున్నది.(భగత్సింగ్ జయంతి. సందర్భంగా)
- CPM మండల నాయకులు కొర్ర శివ నాయక

**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 27** అడవిదేవులపల్లి మండలం "పెంపుడు కుక్కను ఒళ్లో కూర్చోబెట్టుకుంటాం.. కానీ సాటిమనిషిని ముట్టుకుంటే మైలపడిపోతాం. ఎంత సిగ్గుచేటు?" ఈ మాటలు 'షహీద్' భగత్‌సింగ్ రాసిన 'అఛూత్ కా సవాల్' (అంటరానితనం సమస్య) అనే వ్యాసంలోనివి.పంజాబ్ నుంచి వెలువడే 'కిర్తీ' అనే పత్రికలో 'విద్రోహి' (తిరుగుబాటుదారు) అనే కలం పేరుతో భగత్ సింగ్ వ్యాసం రాశారు.

"మన దేశంలో ఉన్నంత దుర్భర పరిస్థితులు మరే దేశంలోనూ లేవు" అంటూ ఆయన వ్యాసం మొదలవుతుంది."ఇక్కడ చిత్రవిచిత్రమైన సమస్యలున్నాయి. వీటిలో ముఖ్యమైంది అంటరానితనం. సమస్యేంటంటే, 30 కోట్ల జనాభా ఉన్న దేశంలో 6 కోట్ల మందిని అస్పృశ్యులుగా పరిగణిస్తున్నారు. వారిని ముట్టుకుంటే చాలు అధర్మం జరిగిపోతుందని చెబుతారు. వాళ్లు గుడిలో అడుగుపెడితే దేవుళ్లకు కోపం వస్తుందంటారు. వారు బావి నుంచి నీటిని తోడితే బావి అపవిత్రమై పోతుందంటారు. ఇరవై శతాబ్దంలో కూడా ఈ సమస్య ఇలా కొనసాగుతోందంటే వినడానికే సిగ్గుగా ఉంది" అన్నవి భగత్‌సింగ్ వ్యాసంలో ప్రారంభ వాక్యాలు.1928 జూన్‌లో, అంటే అంటరానితనాన్ని నిషేధిస్తూ నాటి నేషనల్ అసెంబ్లీలో చట్టం చేయడానికి సరిగ్గా 22 ఏళ్ల కిందట, ఈ వ్యాసం అచ్చయ్యే నాటికి భగత్‌సింగ్ వయసు కేవలం 20 ఏళ్లే.1927లో భగత్ సింగ్‌ను అరెస్టు చేసినపుడు జైల్లో తీసిన చిత్రం చిరుప్రాయంలోనే..భారతదేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల యువప్రాయంలోనే ఉరికంబం ఎక్కిన భగత్‌సింగ్ నేటికీ ఎందరికో ఆదర్శంగా నిలుస్తాడనే విషయంలో సందేహం లేదు.చరిత్రకారులు ఆయనను సోక్రటీస్, జోన్ ఆఫ్ ఆర్క్, చేగువేరా వంటి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన విప్లవకారుల సరసన లెక్కిస్తారు.భగత్‌సింగ్ ఒక విప్లవకారుడే కాదు, మంచి చదువరి, వక్త, రచయిత కూడా.ఆయన లాహోర్ జైలులో ఉన్న కాలంలో రాసిన 404 పేజీల డైరీని చూసినా, తనకు ఫలానా పుస్తకాలు పంపించాలని కోరుతూ బయట ఉన్న తన సహచరులకూ, బంధుమిత్రులకు రాసిన లేఖలను పరిశీలించినా ఆయన విశ్వ సాహిత్యాన్ని చదవడం కోసం ఎంత పరితపించాడో తెలుస్తుంది.చిన్న వయసులోనే ఆయన తన అధ్యయనానికీ, రచనా వ్యాసంగానికి ఎంచుకున్న విస్తృతిని గమనిస్తే మనకు ఆశ్చర్యం వేస్తుంది.భగత్‌సింగ్ ప్రధానంగా భారత స్వాతంత్ర్యోద్యమం, ప్రపంచ రాజకీయాలు, సోషలిజం-విప్లవం, కార్మికోద్యమాలు, మతం, నాస్తికత్వం వంటి అంశాలపై రచనలు చేశారన్నది తెలిసిందే.అయితే నేడు దళిత సమస్యగా వ్యవహరిస్తున్న అంటరానితనం గురించి ఆయన భావాలేమిటో కేవలం పైన పేర్కొన్న ఒక్క వ్యాసం ద్వారానే లభ్యమవుతున్నప్పటికీ ఆయన లేవనెత్తిన విషయాలలో గాఢత, లోతు ఉన్నాయి.

సమకాలీన ఘటనల ప్రభావం భగత్‌సింగ్ 1928లో ఈ వ్యాసం రాయడానికి కాస్త ముందుగా కొన్ని ముఖ్య ఘటనలు జరిగాయని చరిత్రకారుడు అశోక్ యాదవ్ గుర్తు చేస్తారు.1927 డిసెంబర్ 25న బీఆర్ అంబేడ్కర్, ఆయన అనుచరులు కలిసి 'మనుస్మృతి'ని దగ్ధం చేశారు.అదే సంవత్సరం మార్చి 20న వారు 'మహద్ సత్యాగ్రహం' చేపట్టి మహద్ అనే ప్రాంతంలో చెరువులో నీటిని తాగారు.అప్పటి వరకు అంటరానివారికి చెరువులలో, బావులలో నీటిని కూడా ముట్టుకునే హక్కు లేదు.1926లో సింధ్ ప్రాంతానికి చెందిన నూర్ మహ్మద్ అనే శాసనసభ్యుడు బాంబే కౌన్సిల్‌లో ప్రసంగిస్తూ, "సాటి మనిషికి తాగడానికి నీళ్లు కూడా మీరు ఇవ్వనపుడు, వాళ్లను స్కూళ్లలో చదువుకోవడానికే అనుమతించనపుడు, మీకు మరిన్ని అధికారాలు కావాలని పరాయి పాలకులను అడగడంలో అర్థం ఏముంది? సాటి మనిషికే సమాన హక్కులు ఇవ్వడానికి మీరు సిద్ధంగా లేనపుడు మరిన్ని రాజకీయ హక్కులు కావాలని అడగడంలో ఔచిత్యం ఏముంది?" అని అన్నారు.పై మాటలను భగత్‌సింగ్ తన వ్యాసంలో ఉల్లేఖించడమే కాదు, "ముస్లిం కాబట్టి అంటరానివారిని తమ మతంలో చేర్చుకోవడం కోసమే ఇలా మాట్లాడాడంటూ ఆయనపై నిందలు వేయకండి" అని కూడా అందులో రాశారు.కేథరీన్ మేయో అనే అమెరికన్ పరిశోధకురాలు రాసిన 'మదర్ ఇండియా' పుస్తకం కూడా దాదాపు అదే సమయంలో విడుదల కావడం మరొక ముఖ్య పరిణామం.భారతదేశంలో, ముఖ్యంగా హిందూ సమాజంలో ఉన్న చెడులను ఆమె తన పుస్తకంలో కళ్లకు గట్టినట్టుగా రాశారు.అయితే గాంధీజీ ఈ పుస్తకాన్ని 'మురికికాల్వల ఇన్‌స్పెక్టర్ నివేదిక' అంటూ మండిపడ్డారు.కానీ భగత్‌సింగ్ మాత్రం మేయో రాసిన "స్వాతంత్ర్యాన్ని కోరుకునే వారు తమపై తాము కూడా పోరాడాలి" అన్న మాటను తన వ్యాసంలో ప్రముఖంగా ఉల్లేఖించారు.ఇలా ఈ మూడు ఘటనలు - మహద్ సత్యాగ్రహం, మనుస్మృతి దహనం, మదర్ ఇండియా పుస్తకం - సామాజిక సమస్యల అంశాన్ని జాతీయోద్యమంలో బలంగా ముందుకు తెచ్చిన నేపథ్యంలోనే భగత్‌సింగ్ పై వ్యాసాన్ని రాశాడని అశోక్ యాదవ్ అంటారు.

మనుషుల్లా చూడకపోతే మతం మారరా?

మతమార్పిడుల గురించి ఇటీవలి దశాబ్దాలలో చాలానే చర్చ జరుగుతోంది.అయితే అంటరానివారు (దళితులు) తాము ఎదుర్కొంటున్న అవమానాల నుంచి తప్పించుకోవడానికి ఇతర మతాల్లో చేరాలని భావిస్తుంటే అందులో తప్పేంటని భగత్‌సింగ్ తన వ్యాసంలో ఆనాడే ప్రశ్నించారు."మీరిలా సాటి మనుషులనే పశువులకన్నా హీనంగా చూస్తుంటే వాళ్లు ఇతర మతాల్లోకి వెళ్లాలని భావించడంలో తప్పేముంది? తమకు ఎక్కువ హక్కులు లభిస్తాయని, తమతో సాటిమనుషుల్లా ప్రవర్తిస్తారని నమ్మకం ఉన్న ఇతర మతాల్లోకి వెళ్లిపోతారు. అప్పుడు మీరు ..క్రైస్తవులు, ముస్లింలు కలిసి హిందూ మతానికి నష్టం చేకూరుస్తున్నారని వాపోతే అందులో అర్థమేముంది?" అని భగత్‌సింగ్ తన వ్యాసంలో రాశారు.తిరగబడకుండా అడ్డుకోవడం కోసమే పునర్జన్మ సిద్ధాంతం! మనుషులందరూ సమానమేననీ, పుట్టుక వల్ల గానీ పని విభజన వల్ల గానీ ఎవరూ ఎక్కువ లేదా తక్కువ కారని భగత్‌సింగ్ అభిప్రాయపడ్డారు.అంటరానివారి పట్ల అనుసరిస్తున్న అన్యాయమైన,అమానవీయమైన పద్ధతులతో వారెక్కడ తిరుగుబాటుకు పూనుకుంటారోనన్న భయంతోనే పునర్జన్మ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారని ఆయన తీవ్రంగా విమర్శించారు."ఇదంతా నువ్వు పూర్వ జన్మలో చేసుకున్న పాపాల ఫలితం. ఇప్పుడు చేసేదేముంది? నోరుమూసుకొని ఇదంతా అనుభవించు అంటూ వారికి ఓపిక పట్టాలనే ఉపదేశాలు చేసి చేసి చాలా కాలం పాటు వారిని నోరెత్తకుండా చేశారు. కానీ ఇదే అతి పెద్ద పాపం. మీరు మనిషిలో మానవత్వాన్నే లేకుండా చేశారు. ఆత్మవిశ్వాసం,స్వావలంబన వంటి భావనలను అంతమొందించారు. అంటరాని వారిపై చాలా దమనకాండకూ, అన్యాయానికి పాల్పడ్డారు. ఇప్పుడు వాటన్నింటికి గాను ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది" అని భగత్‌సింగ్ రాశారు.సమాజానికి అవసరమైన పనుల పట్ల ఏవగింపా?

మలాన్ని శుభ్రం చేసినంత మాత్రాన మనుషులు అంటరాని వాళ్లెట్లా అవుతారని భగత్‌సింగ్ తన వ్యాసంలో ప్రశ్నిస్తారు." తల్లులు తమ పిల్లల మలాన్ని శుభ్రం చేయడానికీ, పాకీపని చేసే ఓ వ్యక్తి మలాన్ని శుభ్రం చేయడానికి తేడా ఏముంది" అని ఆయన తన వ్యాసంలో వాదిస్తారు.ఇలా మనుషులను అంటరానివారిగా చేసే దురాచారం వల్ల సమాజానికి అవసరమైన పనుల పట్ల మనుషుల్లో ఏవగింపు మొదలైందని, దాంతో సమాజ పురోగమనానికి అడ్డంకి ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు."మనం బట్టలు నేసేవాళ్లను చీదరించుకున్నాం. ఈరోజు నేతపని చేసే వాళ్లను కూడా చాలా చోట్ల అంటరానివారిగా చూస్తున్నారు. యూపీ వైపు డోలీలను మోసేవారిని కూడా అంటరానివారిగానే చూస్తారు. దీంతో సమాజంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. సమాజం ముందుకు సాగకుండా అడ్డంకులు ఏర్పడ్డాయి" అని ఆయన రాశారు.మెల్లమెల్లగా జరిగే సంస్కరణలతో ఒరిగేదేం లేదు! అంటరానివారికి తమ సొంత ప్రజాప్రతినిధులు ఉండటం అవసరమని భగత్‌సింగ్ తన వ్యాసంలో పేర్కొన్నారు.మరోవైపు అప్పటికే అంబేద్కర్, ఆయన సహచరులు అంటరానివారి కోసం ప్రత్యేక ఎలొక్టరేట్లు కావాలని బ్రిటిష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు."వాళ్లు తమ హక్కుల కోసం గొంతెత్తాలి. అంటరానివారిగా పిలవబడుతున్న ప్రజాసేవకులారా, సోదరులారా లేవండి" అంటూ భగత్‌సింగ్ అంటరానివారికి పిలుపునిచ్చారు.గురు గోవింద్‌సింగ్ సైన్యంలో అసలైన బలం అంటరానివారిదేననీ, ఛత్రపతి శివాజీ కూడా వారి బలంతోనే విజయాలు సాధించాడనీ భగత్‌సింగ్ పేర్కొన్నారు."అసలైన కార్మికవర్గం మీరే. సంఘటితం కండి. మీరు కోల్పోయేదేం లేదు. తెగిపోయేవి మీ బానిస సంకెళ్లే. ప్రస్తుత వ్యవస్థపై తిరుగుబాటు చెయ్యండి. మెల్లమెల్లగా జరిగే సంస్కరణలతో ఒరిగేదేం లేదు. సామాజిక ఉద్యమం ద్వారా విప్లవం మొదలు పెట్టండి.రాజకీయ, ఆర్థిక విప్లవాలకు నడుం బిగించండి. మీరే దేశానికి ప్రధాన ఆధారం. మీదే నిజమైన శక్తి. నిద్రబోతున్న పులులారా! లేవండి! తిరుగుబాటు చెయ్యండి" అంటూ భగత్‌సింగ్ తన వ్యాసాన్ని ముగిస్తారు. కొర్రా. శివనాయక్

## ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా



**పెద్ద శంకరంపేట (ప్రజావాణి):-** ఆదివారం పెద్ద శంకరంపేట లో నిర్మించిన శంకరమ్మ గడికోట నందు సమావేశం జరిగింది ఈ గడి కోట గత నాలుగు వందల సంవత్సరాల క్రితం రాణి శంకరమ్మ శత్రు దుర్భేద్యంగా దీనిని నిర్మించడం జరిగింది చాలా చారిత్రాత్మికమైన చరిత్రను కలిగిఉంది రాణి గారు ఈ కోట నుండి తన సామ్రాజ్యాన్ని పరిపాలించడం జరిగిందని పూర్వీకులు తెలిపారు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ కోటను ముందు ముందు తరాలకు దీని చరిత్రను తెలియజేయుటకు మరమ్మతులు చేయవలసిందిగా చర్చించడం జరిగింది . ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ గారు మరియు ఉప సర్పంచ్ పాలకవర్గం ఎంపీటీసీలు ఎంపీపీ గారు ఎంపీడీవో గారు ఎమ్మార్వో గారు ఐకెపి ఎపిఎం గారు వైద్యాధికారులు వివిధ మండల అధికారులు మరియు కుల సంఘ నాయకులు మరియు స్కూల్ టీచర్స్ మరియు విద్యార్థులు యువకులు ఈ కార్యక్రమంలో హాజరు కావడం జరిగింది.

## జాలపల్లి చెక్ డ్యామ్ వద్ద గంగమ్మా తల్లికి వైనం(పసుపు,కుంకుమ పూలు) సమర్పణ

- జాలపల్లి గ్రామ సర్పంచ్ సర్పంచుల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్



**మద్దూరు సెప్టెంబర్ 27, ప్రజా వాణి,** రైతు సంక్షేమమే-కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం నాడైన నేడైన రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందని సర్పంచుల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్ నీనో ప్రభావంతో కరువు సంభవిస్తున్న తరుణంలో ప్రకృతి సహకరించి మోయతుమ్మెద వాగుపైన 12 చెక్ డ్యామ్ లు నిండుకుండలా మారాయని సంతోషం వ్యక్తం చేశారు.స్వర్గీయ మాజీ ప్రదాని గా"శ్రీ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రిజర్వాయర్లు-అధునిక దేవాలయాలు అని అభివర్ణించి ముందుచూపుతో నాగార్జున సాగర్ రిజర్వాయర్,శ్రీశైలం రిజర్వాయర్,శ్రీరామ సాగర్ రిజర్వాయర్,జూరాల ప్రయాదర్శిని ఇల రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా అనేక రిజర్వాయర్లు నిర్మించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పరుశరాం గౌడ్,వార్డ్ సభ్యులు గ్రామ శాఖ అధ్యకులు సాగర్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి ప్రమాదం: ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు





**అశ్వారావుపేట, సెప్టెంబర్ 27 (మన సమగ్ర ప్రజావాణి):** అశ్వారావుపేట మండల పరిధిలోని అశ్వారావుపేట భద్రాచలం ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.అతివేగం,మద్యం మత్తు కారణంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన వివరాల్లోకి వెళితే అదివారం తెల్లవారు జామున ఇద్దరు యువకులు మద్యం మత్తులో స్కూటీపై అశ్వారావుపేట - భద్రాచలం మార్గంలో ప్రయాణిస్తున్నారు వాహనం వేగంగా వెళ్తుండగా, ఒక్కసారిగా నిగ్రహం కోల్పోయి రోడ్డుపై అదుపుతప్పి కిందపడిపోయారు.ఈ ప్రమాదంలో ఇద్దరి తలలు,కాళ్లు,చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.రక్తగాయాలతో ఉన్న యువకులు వెంటనే అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రులు ఆసుపత్రికి వచ్చిన విషయాన్ని గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి కేసు నమోదు చేసుకున్నారు.ఆసుపత్రిలోని వైద్యులు గాయపడిన యువకులకు అత్యవసర ప్రథమ చికిత్స అందించారు. అయితే వారిలో గాయ తీవ్రత ఎక్కువగా ఉండటంతో, మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం వైద్యుల సలహా మేరకు వారిని కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఇలాంటి ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు హెచ్చరించారు.

# గిరిజన మహిళలకు స్వయం ఉపాధి కల్పనకు కృషి చేస్తా: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 27 (మన సమగ్ర ప్రజావాణి):** ఆదివాసీ గిరిజన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని, స్వయం ఉపాధి రంగంలో రాణించేందుకు ప్రభుత్వం తరపున పూర్తిస్థాయి సహకారం అందిస్తామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పునరుద్ఘాటించారు. ఆదివారం గండుగులపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎంఎస్‌ఎంఈ (మీవీజు), ఐటీడీఏ (ఋణాా) సంస్థల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణ పొందిన పలువురు గిరిజన మహిళా సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేను నేరుగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.



సమస్యలను వివరించిన మహిళలు

ఈ సందర్భంగా మహిళా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. "ప్రభుత్వ రంగ సంస్థలైన మీవీజు, ఋణాా ల సహకారంతో ఉపాధి అవకాశాలు పెంచుకునేందుకు అవసరమైన పలు రకాల నైపుణ్య శిక్షణలను మేము విజయవంతంగా పూర్తి చేశాం. శిక్షణ పొందిన అనంతరం సొంతంగా ఉత్పత్తులు తయారు చేస్తున్నప్పటికీ, ఆ ఉత్పత్తులను విక్రయించడానికి సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రాజెక్టుల నిర్వహణకు కావలసిన సాంకేతిక సహాయం, నిధులు మరియు ఉత్పత్తుల అమ్మకాలకు ప్రత్యేక విపణి (మార్కెట్) కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలి" అని కోరారు. ప్రభుత్వం నుండి అవసరమైన ప్రోత్సాహం లభిస్తే తామ స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, స్థానికంగా ఉన్న మరికొంతమంది మహిళలకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతామని మహిళలు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే హామీ మహిళల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళా సంఘాల వినతిని వెంటనే సంబంధిత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, మీవీజు ప్రతినిధులు మరియు ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శిక్షణ పొందిన మహిళలకు తగిన మార్కెటింగ్ అవకాశాలు దక్కేలా చూసి, గిరిజన ప్రాంతాల్లో స్థానిక ఉపాధి అవకాశాలు మరింతగా పెరిగేలా శ్రద్ధ తీసుకుంటానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, గిరిజన సంఘాల మహిళలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యూ ఈద్గా కమాన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 27 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** కాప్రా లో నూతనంగా నిర్మించిన న్యూ ఈద్గా కమాన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై నూతన ఈద్గా కమాన్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ హోంమంత్రి జనాబ్ మహమూద్ అలీ సాహెబ్, కెనడా ఎన్ఆర్ఐ అఫ్సర్ సయ్యద్, ఈద్గా కమిటీ చైర్మన్ మొహమ్మద్ ఖాజా బద్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా కమాన్ నిర్మాణానికి కృషి చేసిన కమిటీ సభ్యులు, సలహాదారులను అభినందించారు.కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్ మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, మొహమ్మద్ తాహిర్, మొహమ్మద్ తాజుద్దీన్, మొహమ్మద్ మహబూబ్ ఖాన్, మొహమ్మద్ మక్బూల్ సాహెబ్, రహీమ్, సయ్యద్ సబీర్ అలీ, మొహమ్మద్ రఫీక్, మొహమ్మద్ సలీం, అబ్దుల్ హకీమ్, ఇమ్రాన్ బాయ్, మొయిస్ పాషా, ఎస్.ఎం. జీలానీ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకల బీమా పథకం చారిత్రాత్మకం

- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం
- ఎమ్మెల్యే విజయరమణారావు చొరవతోనే పథకం అమలు: యాదవ సంఘాల నేతలు

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 27** గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బీమా పథకం చారిత్రాత్మక నిర్ణయమని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పథకాన్ని స్వాగతిస్తూ ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద గొర్రెలు, మేకల పెంపకందారులు, యాదవ సంఘాల నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మారం తిరుపతి యాదవ్, జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంధనవేణి రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలు వ్యాధులు, ప్రమాదాలు, విషాహారం, కుక్కల దాడులు తదితర కారణాలతో మృతి చెందితే వాటిపై ఆధారపడిన పెంపకందారులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు.శనివారం కరీంనగర్‌లో లాంఛనంగా ప్రారంభమైన ఈ పథకం కింద ఒక్కో గొర్రె లేదా మేకకు రూ.3 వేల వరకు బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. ఒక్కో జీవానికి సంబంధించిన బీమా ప్రీమియం రూ.88 కాగా, అందులో పెంపకందారుడు కేవలం రూ.13 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన రూ.75ను ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. దీంతో నిరుపేద గొర్రెలు, మేకల పెంపకందారులపై ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు.





ఎమ్మెల్యే విజయరమణారావు చొరవ అభినందనీయం

గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక చొరవ చూపారని నాయకులు తెలిపారు. ఈ విషయాన్ని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బీమా పథకం అమలుకు కృషి చేశారని కొనియాడారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే విజయరమణారావు చేసిన కృషిని యాదవ, కురుమ వర్గాలు ఎప్పటికీ గుర్తుంచుకుంటాయని నాయకులు అన్నారు. పథకం అమలుకు కృషి చేసిన ఫెడరేషన్ చైర్మన్ సరిత, ఎండీ సుబ్బారాయుడులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అర్హులందరికీ పథకం అందేలా చర్యలు తీసుకోవాలి

బీమా పథకం ప్రయోజనాలు ప్రతి గ్రామంలోని అర్హులైన గొర్రెలు, మేకల పెంపకందారులందరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించి పథకం విధివిధానాలు, అర్హతలు, బీమా ప్రయోజనాలపై పెంపకందారులకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు పర్స బక్కయ్య, పెగడ రమేష్, తాత రాజు, సామ తిరుపతి, ఉప్పరి శ్రీనివాస్, ఉడుత పర్వతాలు, అట్ల సాగర్, నాగరాజు, సర్పంచులు గోగు రాజయ్య, మాధరవేణి మల్లేష్, ధారవేణి పోషన్న, దాడి చంద్రమౌళి, దాడి రవి, తాత సదానందం, అసరీ రాయమల్లు, నర్రా కుమార్, గట్టయ్య, బొడ్డు చంద్రయ్య, వినోద్, శ్రీనివాస్, రాజేశం, పొలవేని కుమార్, మేకల కుమార్, దాడి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ లేక మురుగు నీటితో అవస్థలు

- పారిగాం 5వ వార్డులో డ్రైనేజీ సమస్య
- సీసీ రోడ్డుపై నిలుస్తున్న మురుగు నీరు
- పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు
- పలుమార్లు విన్నవించినా అధికారుల స్పందన కరువు
- సమస్య పరిష్కరించకుంటే ఆందోళనకు సిద్ధమంటున్న స్థానికులు



**కొమురంభీమ్ జిల్లా/సిర్పూర్ టి, సెప్టెంబర్ 27, (ప్రజావాణి):** మండలంలోని పారిగాం గ్రామం 5వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డుపై మురుగు, వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇదే మార్గంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం అవస్థలు పడుతున్నారు. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మించకపోతే పెద్ద ఎత్తున నిరసన చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# గోపన్నగూడెంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు: ప్రమాదకర వెదురు తొలగింపు





**అశ్వారావుపేట, సెప్టెంబర్ 27 (మన సమగ్ర ప్రజావాణి):** కన్నాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజారోగ్య రక్షణకు, పరిసరాల పరిశుభ్రతకు పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పంచాయతీ పరిధిలోని గోపన్నగూడెం గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్య సమస్యల నివారణ నిమిత్తం పంచాయతీ సిబ్బందితో విస్తృతంగా శానిటేషన్, బ్లీచింగ్ చల్లే పనులు నిర్వహించారు. వాహనదారుల భద్రతకు చర్యలు కన్నాయిగూడెం – కొత్తకావడిగుండ్ల ప్రధాన ఆర్అండ్‌బీ (R&B) రహదారి వెంట ప్రయాణికులకు, వాహనదారులకు అవరోధంగా మారిన వెదురు బొంగులను తొలగించారు. రోడ్డు పక్కన ఉన్న పెద్ద వెదురు పొదలు రహదారిపైకి వాలిపోవడంతో రాకపోకలకు తీవ్ర విఘాతం కలగడమే కాకుండా, ముఖ్యంగా రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఏర్పడింది. విషయాన్ని గుర్తించిన పంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించి, మార్గానికి అడ్డుగా ఉన్న వెదురు కర్రలను నరికివేసి రహదారిని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుజ్జా సంకురావు మాట్లాడుతూ.. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజల, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రహదారిపైకి ఒరిగి ప్రమాదకరంగా ఉన్న వెదురును తొలగించడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోయాయని, భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు కండె శ్రావ్య విజయం స్ఫూర్తిదాయకం



**దాద్‌పల్లి, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** మంచాల మండలం దాద్‌పల్లి గ్రామానికి చెందిన కండె మల్లేష్ గుప్తా కుమార్తె కండె శ్రావ్య భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల లో ఎంబీబీఎస్ సీటు సాధించడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రావ్యను హనుమాన్ దేవాలయం వద్ద స్వీట్లు తినిపించి, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పాలకుర్ల శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి, ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని అన్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా పట్టుదలతో చదివితే ఉన్నత విద్యలో రాణించవచ్చని పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని అన్నారు. అలాంటి విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సహించి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తే వారు ఉన్నత స్థాయికి ఎదిగి కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురాగలరని తెలిపారుకండె శ్రావ్య ఎంబీబీఎస్ సీటు సాధించడం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకమని, ఆమెను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. శ్రావ్య భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మామిడిపల్లి శ్రీనివాస్, నేనావత్ రాజు నాయక్, శ్రావ్య కుట?

# నామకరణ వేడుకలో ఎమ్మెల్సీ దండే విఠల్ సందడి

- కాగజ్‌నగర్‌లో ఘనంగా నామకరణ మహోత్సవం
- కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ దండే విఠల్
- చిన్నారుడిని ఆశీర్వదించిన ఎమ్మెల్సీ
- కుటుంబ సభ్యులకు అభినందనలు



**కొమురంభీమ్/కాగజ్ నగర్, సెప్టెంబర్ 27, (ప్రజావాణి):** పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావు మనుమడి నామకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరై చిన్నారుడిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను అభినందించారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లుతూ ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులు పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.

# నారాయణపురంలో రూ. 85,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ (CMRF) చెక్కుల పంపిణీ




**అశ్వారావుపేట, సెప్టెంబర్ 27 (మన సమగ్ర ప్రజావాణి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం పంచాయతీలో ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు లబ్ధిదారులకు ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ప్రభుత్వం నుంచి సాయం కోరిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన మొత్తం రూ.85,500 విలువైన చెక్కులను నారాయణపురం ఉపసర్పంచ్ ఆకుల శ్రీను చేతుల మీదుగా అందించారు. లబ్ధిదారుల్లో చేడే తిలక్ భరత్‌కు రూ.60,000, కూతాడి భాస్కరరావుకు రూ.25,500 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఆపత్కాలంలో తమకు సహాయం అందేలా చొరవ చూపిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు, కాంగ్రెస్ నాయకులకు మరియు ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చిన్నంశెట్టి నాగేంద్ర కుమార్, డీసీసీ జనరల్ సెక్రటరీ పెద్దపూడి సత్యవతి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పరిటాల సందీప్ కుమార్, సీనియర్ నాయకులు పసుపులేటి నరేష్, జక్కుల చిన్ని, వార్డు సభ్యులు యడ్లపల్లి రమేష్, మడకం వీర్రాజు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

- ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలి:
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు




**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి సెప్టెంబర్ 27**ఎలిగేడు, రైతుల సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, సూపర్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఎలిగేడు మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్ హాల్‌లో ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సమా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 137వ సర్వసభ్య సమావేశానికి విజయరమణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా ఈ ఏడాది వర్షపాతంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల అవసరాలకు అనుగుణంగా రెండు తడులకు ఎస్సారెస్పీ నీటిని అందించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని కోరారు.

**ధరణిపై బీఆర్ఎస్‌పై విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో భూ వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయని విజయరమణారావు ఆరోపించారు. ధరణి వల్ల పేదల భూములు గల్లంతయ్యాయని, అప్పటి పాలనలో కొందరికే ప్రయోజనం చేకూరిందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు ఎలా సమకూరాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

22ఏ భూముల విషయంలో బీఆర్ఎస్ నేతలు గతంలో పెద్ద ఎత్తున ఆందోళన చేశారని, ప్రస్తుతం వారి ఆస్తుల వివరాలు వెలుగులోకి వస్తున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బినామీ పేర్లతో కేసీఆర్ కుటుంబానికి ఇంకా ఎన్ని ఆస్తులు ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని అన్నారు.

22ఏ పరిధిలో రాష్ట్రంలో 3.76 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నాయని, కోటి ఎకరాల భూమి ఉందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

**కాళేశ్వరం నీటిపై సవాల్**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కాళేశ్వరం ప్రాజెక్టు నీరు చుక్క కూడా రాలేదని విజయరమణారావు పేర్కొన్నారు. కాళేశ్వరం నీరు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వచ్చిందని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు.

**టీకే రమేష్ మృతికి సంతాపం**

సమావేశం ప్రారంభానికి ముందు టీవీ9, సిటీ కేబుల్ పాత్రికేయుడు టీకే రమేష్ మృతికి విజయరమణారావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

**కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులు**

అనంతరం ఎలిగేడు మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విజయరమణారావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాపూజీ ప్రజాసేవలను, తెలంగాణ కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 27 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** తెలంగాణ ఉద్యమ ప్రాతఃస్మరణీయులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, పద్మ విభూషణ్ ఆచార్య కొండా లక్ష్మణ్ బాబూజీ జయంతి వేడుకలను పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఘనంగా నివాళులర్పించారు.

?ఈ సందర్భంగా రామంతాపూర్ మినీ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాబూజీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.



ఈ కార్యక్రమంలో ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ గారు మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం పరితపించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాబూజీ అని కొనియాడారు. మంత్రి పదవిని సైతం లెక్కచేయకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసమే తన పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన గొప్ప త్యాగశీలి అని గుర్తుచేశారు. బహుజన వర్గాల అభ్యున్నతికి, చేనేత కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.?బాబూజీ చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

?ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబూజీ విగ్రహానికి నివాళులర్పించారు.

# చాప కింద నీరులా ముంచుకొస్తున్న ముప్పు

**రాయికల్, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారిని కళ్లతో చూడలేము. కానీ కళ్ల ముందే కనిపిస్తూ, రోజూ మన ఇంట్లోకి చొరబడుతూ మన భూమిని, ఆరోగ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తున్న మరో మహమ్మారి ప్లాస్టిక్. ఉదయం పాల కవర్ నుంచి టీ తాగే గ్లాసు, టిఫిన్ పార్సిల్ కవర్, కూరగాయల సంచి, మంచినీటి బాటిల్, షాంపూ డబ్బా, బిస్కెట్ ప్యాకెట్ వరకు మన జీవితం ప్లాస్టిక్ తో ముడిపడిపోయింది. 1950 వరకు పెద్దగా లేని ఈ ప్లాస్టిక్, ఇప్పుడు మనిషి నరనరాల్లోకి ఎక్కేసింది. మనం వాడి పడేసిన ఒక్క ప్లాస్టిక్ కవర్ భూమిలో కలిసిపోవడానికి 500 నుంచి 1000 ఏళ్లు పడుతుంది. అంటే మన తాతలు పడేసిన కవర్ కూడా ఇప్పటికీ భూమిలో చెక్కుచెదరకుండా ఉందన్నమాట. రోజూ కోట్లాది కవర్లు, బాటిళ్లు భూమిలో పేరుకుపోతుండటంతో భూమి ఊపిరాడకుండా పోతోంది. వర్షం నీరు భూమిలోకి ఇంకకుండా ప్లాస్టిక్ అడ్డుగోడగా మారి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి, బోర్లు ఫెయిల్ అవుతున్నాయి. మురుగు కాలువలు, డ్రైనేజీలు ప్లాస్టిక్ తో మూసుకుపోయి చిన్న వర్షానికే రోడ్లన్నీ చెరువులై ఇళ్లలోకి నీరు వస్తున్న పరిస్థితి. ప్లాస్టిక్ ను తగలబెడితే అంతకంటే ప్రమాదం. దాని నుంచి వచ్చే డయాక్సిన్, ఫ్యూరాన్ వంటి విష వాయువులు గాలిలో కలిసి ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆస్తమా, చర్మ వ్యాధులకు కారణమవుతున్నాయి. ఎండకు, వేడికి ప్లాస్టిక్ కరిగి మైక్రో ప్లాస్టిక్ గా మారుతోంది. ఈ రేణువులు ఇప్పుడు మనం తాగే నీటిలో, తినే



ఉప్పులో, చేపల కడుపులో, చివరికి తల్లిపాలలో కూడా ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. వేడి వేడి టీ, సాంబార్, కూరలను ప్లాస్టిక్ కవర్లో, గిన్నెలో వేసుకుని తింటే ఆ రసాయనాలు నేరుగా రక్తంలో కలిసి హార్మోన్ల వ్యవస్థను దెబ్బతీసి సంతానలేమి, గుండె, కిడ్నీ, లివర్ సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. మూగజీవాలకు జరుగుతున్న అన్యాయం వర్ణనాతీతం. రోడ్లపై తిరిగే ఆవులు, మేకలు, కుక్కలు కవర్లతో సహా చెత్తను తినేస్తున్నాయి. వాటి కడుపులో 20 నుంచి 30 కిలోల వరకు ప్లాస్టిక్ పేరుకుపోయి జీర్ణం కాక నరకయాతన పడి చనిపోతున్నాయి. పొలాల్లో పడేసిన ప్లాస్టిక్ వల్ల పంట దిగుబడి కూడా తగ్గిపోతోంది. ప్రభుత్వం 120 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్లను నిషేధించినా క్షేత్రస్థాయిలో తనిఖీలు లేకపోవడంతో 10 రూపాయల కవర్ల బండిల్ యథేచ్ఛగా అమ్ముడవుతోంది. అధికారులు అప్పుడప్పుడు దాడులు చేసి జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఈ మహమ్మారి నుంచి బయటపడాలంటే ప్రతి ఇల్లు ఒక ఉద్యమం కావాలి. తాతల కాలంనాటి గుడ్డ సంచి, జ్యూట్ బ్యాగ్ ను మళ్లీ భుజాన వేసుకోవాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు స్టీల్ బాటిల్, క్యారేజీ పట్టుకెళ్లాలి. పిల్లలకు ప్లాస్టిక్ బొమ్మలకు బదులు మట్టి బొమ్మలు ఇవ్వాలి. స్కూళ్లలో, గ్రామసభల్లో ప్లాస్టిక్ నష్టంపై అవగాహన కల్పించాలి. పంచాయతీలు, మున్సిపాలిటీలు చెత్త నుంచి సంపద కేంద్రాలను బలోపేతం చేసి రీసైకిల్ చేయాలి. ప్లాస్టిక్ ను ఈ రోజు మనం తిరస్కరిస్తేనే రేపటి తరం ఆరోగ్యంగా ఊపిరి పీల్చగలుగుతుంది. లేకుంటే మన సమాధులపై కూడా ప్లాస్టిక్ కవర్లే ఎగురుతూ ఉంటాయని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు.

# శ్రీధర్ బాబు పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

- పుట్ట మధు ఫామ్‌హౌ స్ ను ముట్టడిస్తాం
- దళితుల భూములను తిరిగి పంచే బాధ్యత కాంగ్రెస్‌దే.. కాంగ్రెస్ నేతలు

**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 27, ప్రజావాణి:** మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై చేస్తున్న వ్యాఖ్యలను సహించబోమని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. వెంకటాపూర్‌లోని పుట్ట మధు ఫామ్‌హౌస్‌ను త్వరలో ముట్టడిస్తామని ప్రకటించారు. ఆయన ఆక్రమించుకున్నారని ఆరోపిస్తున్న భూములను దళితులకు పంచే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కాటారం మాజీ జడ్పీటీసీ పుట్ట మధు ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గత పదేళ్లలో పుట్ట మధు దళితుల భూములను తక్కువ ధరకు తీసుకున్నారని, రచ్చపల్లి గ్రామానికి చెందిన నిర్వాసితులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా వచ్చిన డబ్బులతో వెంకటాపూర్‌లో కొనుగోలు చేసిన భూములను బెదిరింపులతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై పుట్ట మధు స్పందనను ప్రస్తావించలేదు. మంత్రి శ్రీధర్‌బాబు భూములపై పుట్ట మధు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శ్రీధర్‌బాబు ప్రజా



సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, భూకబ్జాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. మరోసారి మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ సమ్మె సమయంలో కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు సొంత ఖర్చులతో పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, స్టడీ మెటీరియల్‌తో పాటు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారని



తెలిపారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం ఎంతమందికి భూములు పంపిణీ చేసిందో వెల్లడించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేస్తోందని, వారి జయంతులు, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తూ నివాళులర్పిస్తోందని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి ప్రజల ముందుకు వెళ్తుందని తెలిపారు. సమావేశంలో విద్యుత్ బోర్డు సభ్యుడు శశిభూషణ్ కాచే, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ పెండ్రు రమ, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, మాజీ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్‌తో పాటు సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్యాగానికి మారుపేరు కొండా లక్ష్మణ్ బాపూజీ

**రాయికల్, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** తెలంగాణ సాధన కోసం మంత్రి పదవినే తృణప్రాయంగా వదిలేసిన త్యాగధనుడు, పద్మశాలి ముద్దుబిడ్డ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఆదివారం రాయికల్ పట్టణంలో ఘనంగా జరిగాయి. పద్మశాలి సేవా సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన వేడుకల్లో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్ హాజరై మాట్లాడుతూ దేశ చరిత్రలో మహాత్మా గాంధీ తర్వాత బాపూజీ అని గౌరవంగా పిలవబడ్డ ఏకైక వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ మాత్రమేనని అన్నారు. ఆయన జీవితం తెరిచిన పుస్తకం



లాంటిదని, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడని గుర్తు చేశారు. 1969లో తెలంగాణ తొలిదశ ఉద్యమంలో భాగంగా మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమానికి ఊపిరి పోశారని, మలిదశ ఉద్యమంలోనూ ఉద్యమకారులకు అండగా నిలిచారని కొనియాడారు. చేనేత రంగ అభివృద్ధికి, పద్మశాలి వర్గ ఆత్మగౌరవం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని, అధికారం, పదవులు శాశ్వతం కాదని, ప్రజల గుండెల్లో నిలిచిపోవడమే నిజమైన నాయకుడి లక్షణమని బాపూజీ నిరూపించారని అన్నారు. నేటి యువత ఆయన నిజాయితీ, త్యాగనిరతిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బోగ రాజేశం, యువజన సంఘం అధ్యక్షుడు సామల్ల సతీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, అష్టవాడ పెద్దలు, సంఘ సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : పిండ్రాతి.హనుమంతరావు





**చిలుకూరు సెప్టెంబర్ 27(ప్రజావాణి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చిలుకూరు మండలం చెన్నారిగూడెం గ్రామానికి చెందిన చిలుకూరు మండల పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిండాత్రి హనుమంతరావు అన్నారు. ఆదివారం చెన్నారిగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ కార్డులను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లబ్ధిదారుల పూర్తి వివరాలతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డును ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. స్మార్ట్ కార్డులు పొందిన లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్డుల పంపిణీతో అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నారిగూడెం గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పుట్టపాక వెంకయ్య,కొవ్వూరు ఓబయ్య మాజీ సర్పంచ్, కొవ్వూరు వెంకటేశ్వర్లు,కాంపాటి సాయమ్మ,కమతం కొండలు,మండల పార్టీ యూత్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మీనారాయణ,కమతం నాగరాజు,కొవ్వూరి వెంగయ్య,సూరేపల్లి నాగరాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యువతను సమీకరించి యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

- జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో నాయకుల పిలుపు

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 27** యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంస్థాగతంగా పటిష్టం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కార్యాలయంలో ఆదివారం యువజన కాంగ్రెస్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి యువజన కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి అమీర్ అబ్దుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో యువజన కాంగ్రెస్ సంస్థాగత కార్యక్రమాలు, మండలాల వారీగా పార్టీ కార్యకలాపాలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, రానున్న కార్యక్రమాలపై నాయకులు సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో యువతను సంఘటితం చేసి యువజన కాంగ్రెస్ కార్యకలాపాలను విస్తృతం చేయాలని నిర్ణయించారు. యువతను పెద్ద సంఖ్యలో



పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంతో పాటు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చురుకైన పాత్ర పోషించాలని నాయకులు సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ యువతకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మండలాలు, గ్రామాల స్థాయిలో పార్టీ కమిటీలను మరింత క్రియాశీలం చేసి, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా



తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్, పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు ముత్యాల నరేష్ ముదిరాజ్, జిల్లా, అసెంబ్లీ స్థాయి నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

- ఎంఎంసీ కమిషనర్‌ను కోరిన పరమేశ్వర్‌రెడ్డి

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 27 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. మల్లాపూర్ డివిజన్‌లో కొన్ని అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, పలు కాలనీవాసులతో కలిసి శనివారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఇదే పనులపై జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి శ్రీధర్‌బాబు ఆమోదించిన పనుల వివరాలను సైతం అందచేశారు. నిధులు మంజూరు చేసి పనులను చేపట్టాలని కోరారు.



పనులు చేపట్టాల్సిన కాలనీలు

నాగలక్ష్మి నగర్ కాలనీ రేషన్ షాపు లైన్ జజ రోడ్ల సమగ్ర అభివృద్ధి

ఓల్డ్ మీర్పేట్ లో జజ రోడ్ల సమగ్ర అభివృద్ధి

న్యూ నర్సింహ నగర్ కాలనీ జజ రోడ్ల సమగ్ర అభివృద్ధి

లక్ష్మి నగర్ జఱూ బిల్డింగ్ లైన్ , సీసీ (CC) రోడ్ల సమగ్ర అభివృద్ధి.

పిట్టల బస్తీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం,

ఓల్డ్ మీర్పేట్ స్టోర్మ్ వాటర్ (SW) డ్రైన్ నిర్మాణం.

ఈ కార్యక్రమం లో మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు జెమిల బేగం మాజీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆగం రెడ్డి, రఫిక్, కొంపల్లి బాల్ రాజ్, నవీన్

# స్నేహమా.. ఎంత కాలమైంది నిన్ను చూసి!

- పాతికేళ్ల తర్వాత 'అక్షర గూటికి' చేరిన పక్షులు.. ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్లో భావోద్వేగాల 'టెన్త్' బ్యాచ్ సమ్మేళనం!
- ముడతలు పడిన చేతులు.. తలపాగా కట్టిన స్నేహాలు.. ఒకరినొకరు హత్తుకుని ఆనందబాష్పాలు!
- 'నువ్వు గుర్తున్నావురా.. నీ జ్ఞాపకం పదిలంగా ఉందిరా..' అంటూ కన్నీటి పలకరింపులు!

**కేసముద్రం సెప్టెంబర్ 27,ప్రజావాణి.**

కాలం చాలా వేగంగా పరిగెత్తింది. నెరిసిన జుట్టు, ముఖంపై ముడతలు, భుజాలపై సంసార బాధ్యతలు.. అవును, కాల చక్రం పాతికేళ్లు తిరిగింది. కానీ, ఆ బాల్య స్నేహం ముందు కాలం మోకరిల్లింది. ఎక్కడెక్కడో బతుకుదెరువు కోసం చెదిరిపోయిన ఆ అక్షర పక్షులన్నీ, ఆదివారం నాడు తాము పుట్టిన, పెరిగిన, చదువుకున్న ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణానికి చేరుకున్నాయి. 2001-02 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కేవలం ఒక వేడుకలా జరగలేదు.. అది కన్నీళ్లు, కౌగిలింతలు, గుండె నిండా నిండిన భావోద్వేగాల మహా సంగమమైంది.

**ఒకే బెంచీ.. ఒకే ఆట.. మళ్లీ కళ్లముందే!**

పాఠశాల గేటు దాటి లోపలికి వస్తుంటే, ప్రతి ఒక్కరి కళ్లల్లో నాటి జ్ఞాపకాలు కదలాడాయి. ఒకప్పుడు చిరిగిన నిక్కర్లతో, పుస్తకాల సంచులతో పరిగెత్తిన కారిడార్లలో.. ఇప్పుడు పెరిగి పెద్దయిన




రూపాలు నడుస్తుంటే కాలం స్తంభించిపోయింది. ఒకరినొకరు చూసుకోగానే మాటలు రాలేదు.. కేవలం కళ్లల్లోంచి కన్నీటి ధారలు ప్రవహించాయి. గట్టిగా హత్తుకుని, ఒకరి వెన్ను తట్టి, ఎలా ఉన్నావురా.. ఎంత కాలమైందిరా నిన్ను చూసి అని అడుగుతుంటే అక్కడ చేరిన ప్రతి ఒక్కరి గుండె బరువెక్కింది.

**కన్నీరు పెట్టించిన జీవిత గాథలు!**

వేదికపైకి వచ్చి ఒక్కొక్కరుగా తమ జీవిత విశేషాలను పంచుకుంటుంటే సభలో నిశ్శబ్దం ఆవరించింది. అప్పట్లో క్లాస్ రూమ్‌లో కూర్చుని భవిష్యత్తు గురించి కలలు కనేవాళ్లం.. ఈ రోజు ఆ కలల ప్రయాణంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ఇక్కడ నిలబడ్డాం అని కొందరు చెప్తుంటే, నాటి మిత్రుల కళ్లు చెమర్చాయి. మనం తిన్న లంచ్ బాక్సుల రుచి, ఆ చెట్టు కింద ఆడిన ఆటలు, ఆ పలకరింపులు.. ప్రపంచంలో ఎంత సంపాదించినా దొరకలేదురా అంటూ ఒక మిత్రుడు భావోద్వేగానికి లోనవడంతో, అక్కడ కూర్చున్న ప్రతి ఒక్కరి కళ్ల నుండి నీరు కారింది.

**దేవుళ్లలా కనిపించిన నాటి గురువులు.. పాదాభివందనాలతో పులకరింత!**

తమను మట్టి ముద్దల నుంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన నాటి గురువులు వేదికపైకి రాగానే, విద్యార్థులంతా ఒక్కసారిగా లేచి నిలబడి చేతులు జోడించారు. కళ్లల్లో భక్తిభావం, గుండెల్లో కృతజ్ఞత ఉప్పొంగగా.. నాటి హెచ్ఎం వంగా దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు చీకటి వెంకట్రామనర్సయ్య, తిరునహరి నమ్మాళ్వార్, ఉస్మాన్ అలీ, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, శ్రీనివాస్, పీఈటీ అరుణ, యాస హేమన్ రెడ్డి, కీర్తి నాగయ్య, మరియు ప్రస్తుత హెచ్ఎం చంద్రశేఖర్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. వృద్ధాప్యంలో ఉన్న గురువుల పాదాలకు నమస్కరిస్తూ, మీరు కొట్టిన దెబ్బలు, చెప్పిన బుద్ధులే ఈ రోజు మమ్మల్ని సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టాయి సార్ అని విద్యార్థులు కన్నీళ్లతో చెబుతుంటే, ఆ గురువుల కళ్లు కూడా ఆనందబాష్పాలతో నిండిపోయాయి.

**ఎప్పటికీ విడిపోని బంధం!**

ఒకరి కష్టసుఖాలను, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుంటూ.. ఇకపై ఏ ఒక్కరు కష్టంలో ఉన్నా అందరం అండగా నిలబడదాం అని స్నేహ సాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్నా.. ఆ స్నేహ వెలుగులు మాత్రం విద్యార్థుల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయాయి. ఈ అపురూప సమ్మేళన,పూర్వ విద్యార్థులు గంధం సంతోష్ కుమార్, గంధం వెంకటేశ్వర్లు, బుర్ర సుధాకర్, బుర్ర సంపత్, గంధసిరి శ్రీనివాస్, కంచ వీరస్వామి, లింగాల రాజన్న, గోవింద్ భద్రయ్య, మోడం వెంకన్న,ఏటురోజు రాజకుమార్, బండారు రాజ్ కుమార్, పొదిలా వెంకన్న, ఏసల్ల యాకస్వామి, ఏసల్ల సారంగపాణి, శివ లాల్, విజయ్, కోలా ఇంద్ర, అరుణ, రాధిక, జ్యోతి, ప్రతిభ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవంగర మండల పద్మశాలి సంఘ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు

- చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన డాక్టర్ కూరపాటి రమేష్. రాధిక



**పెద్దవంగర సెప్టెంబర్ 27 ప్రజావాణి.** మండల కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఇంటిలెక్సువల్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ కూరపాటి రమేష్. ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ ఇంటిలేక్స్వల్ ఫోరమ్ కోఆర్డినేటర్ డాక్టర్ కూరపాటి రాధిక. మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కి ఘన నివాలులు అర్పించి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొని యాడినారు స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమకారుడు గా నీలిచి బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలంతా సంఘటితమై బీసీల హక్కులను వినియోగించుకోవాలని బీసీ ఒక్కతాటి పైకి రావాలని బీసీల ఐక్యత వర్ధిల్లాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమం లో మహబూబాబాద్ జిల్లా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కోఆర్డినేటర్ ఎదునూరి శ్రీనివాస్. మండల పద్మశాలి సంఘ అధ్యక్షులు రాపోలు శ్రీనివాస్. గౌరవ అధ్యక్షులు గుల్లపల్లి సదానందం. పద్మశాలి సంఘం నాయకులు వేముల రాజు. గుడ్ల రమేష్. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుమ్మరి రామ్మూర్తి.వెంకట్ నారాయణ యాదవ్.రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగ వీరస్వామి. తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ

- తెలంగాణ ఉద్యమ సింబల్ ,బహుజన పక్షపాతి
- పార్లమెంట్,ఎమ్మెల్సీ వంటేరు
- యాదవ రెడ్డి మరియు చందన.
- రవీందర్ చైర్ పర్సన్ - గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ.

**సిద్దిపేట సెప్టెంబరు 27 .(ప్రజావాణి)**సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా లోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ప్రభుత్వ లాంచనాలతో అంగరంగ వైభవంగా జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్సీ యాదవ రెడ్డి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ చందన, రవీందర్ మాట్లాడుతూ "కొండా లక్ష్మణ్ బాపూజీ "ఒక గొప్ప మహనీయుడని నిస్వార్థ నాయకుడని స్వాతంత్ర సమరయోధుడని తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త అని కొనియాడినారు. తెలంగాణ ఉద్యమ సింబల్, బహుజన పక్షపాతి అని కొనియాడినారు. బాపూజీ చూపిన మార్గం , సత్యం, అంకితభావం, నిస్వార్థ సేవ, అనే మార్గంలో నడవడమే మనం ఆయనకు ఇచ్చిన గొప్ప నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ



రెడ్డి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పద్మ, బూరుగుపల్లి ప్రతాప్ రెడ్డి , యువ నాయకులు సర్దార్ ఖాన్, నర్సింగ్ రావు కౌన్సిలర్లు కామిని మురళి, నాలుగో వార్డ్ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ మరియు వివిధ పార్టీల రాజకీయ నాయకులు, కౌన్సిలర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు బొల్లి బత్తుల దేవదాసు, చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం, మార్కండేయ దేవాలయం అధ్యక్షులు గడ్డమీద ఆంజనేయులు, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు గాడిపల్లి శ్రీనివాస్, తలకొక్కుల దుర్గాప్రసాద్, దేవులపల్లి రాజారాశీ, ప్రముఖ అడ్వకేట్ తలకొక్కుల రాజు, కాశీ ప్రసాద్, పద్మశాలి కుల పెద్దలు ఆడెపు బాలచంద్రం, గాడి పల్లి విజయ్, చేనేత సహకార సంస్థ దొంతుల ప్రసాద్, సిద్దిపేట జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు, సంయుక్త కార్యదర్శి పాషికంటి శ్రీనివాస్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు నేత, ఉపాధ్యక్షులు షేర్ల నర్సింలు, రాచకొండ శ్రీనివాస్, సూర లింగం, స్వర్గం రాములు, చంద్రమౌళి, మంగళపల్లి సత్యనారాయణ,సబ్బని నరేష్ , తుమ్మ ఉపేందర్, రాచకొండ మహేష్, కుడికాలు రమేష్ చక్రధర్, బత్తిని నరేష్, దేవసాని పోశెట్టి, నల్ల శివకుమార్, పద్మశాలి కుల కులస్తులు మరియు వివిధ రాజకీయ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

# గుడికోట త్రికూటాలయాన్ని పరిరక్షించండి

**రాయికల్, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** రాయికల్ పట్టణంలోని చారిత్రక, ఆధ్యాత్మిక సంపద అయిన గుడికోట త్రికూటాలయాన్ని పరిరక్షించి అభివృద్ధి చేయాలని కోరుతూ ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి ఆదివారం గుడికోటలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్ కు వినతిపత్రం అందజేశారు. ఒకే ప్రాంగణంలో పంచముఖ లింగేశ్వర స్వామి, శ్రీ కేశవనాథ స్వామి, సూర్యనారాయణ స్వామి కొలువైన ఈ ఆలయం అరుదైన శిల్పకళకు, చారిత్రక ప్రాధాన్యతకు నిలయమని, భక్తులు దీనిని దక్షిణ కాశీగా భావిస్తారని ఆయన తెలిపారు. అంతటి విశిష్టత ఉన్న ఆలయంలోని పురాతన కట్టడాలు, శిల్పాలు శిథిలావస్థకు చేరాయని, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిధులు కేటాయించి మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. వర్షాకాలంలో ఆలయ పరిసరాల్లో నీరు నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ఆలయ స్థలం ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ ప్రహరీ గోడ, రక్షణ కంచె నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని, ఒక్క పూజారి మాత్రమే ఉండటంతో ఇబ్బందులు ఉన్నందున మరో పూజారిని నియమించాలని, జగిత్యాల, కోరుట్ల, ఇటిక్యాల, రామాజీపేట ప్రధాన రహదారులపై కళాతోరణాలు నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.





# మహానుభావుడి సేవలు చిరస్మరణీయం

● పూజారిగా.. గ్రామ పెద్దగా.. యువతకు మార్గదర్శిగా విశిష్ట సేవలు.

● భౌతికంగా దూరమైనా.. జ్ఞాపకాల్లో సజీవమే.



**రామగిరి,మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 27**రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన శివాలయ పూజారి రుద్రబట్ల పురుషోత్తం శర్మ సేవలను గ్రామస్థులు స్మరించుకుంటున్నారు. పూజారిగా ఆధ్యాత్మిక సేవలు అందించడంతో పాటు గ్రామ పెద్దగా ప్రజల సమస్యల్లో పాలుపంచుకుంటూ, యువతకు మార్గనిర్దేశం చేస్తూ ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని గ్రామస్థులు పేర్కొంటున్నారు. శివాలయంలో నిత్య పూజలు,ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ ఆలయానికి వచ్చే భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంలో పురుషోత్తం శర్మ కీలక పాత్ర పోషించారని వారు గుర్తుచేసుకుంటున్నారు. గ్రామంలో ఏ సమస్య ఎదురైనా పెద్దమనిషిగా స్పందించి,అందరినీ కలుపుకొని ముందుకు సాగేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ప్రత్యేక గుర్తింపు పొందాయి.

యువతకు స్ఫూర్తిగా...యువతతో సన్నిహితంగా మెలుగుతూ వారికి మంచి మార్గాన్ని చూపించడం, సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని సూచించడం ఆయన ప్రత్యేకతగా గ్రామస్థులు చెబుతున్నారు. యువతలో సత్ప్రవర్తన, సేవాభావం పెంపొందించేలా ఆయన అందించిన సూచనలు తమకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పలువురు పేర్కొంటున్నారు.మహానుభావుడు లేని లోటు సుస్పష్టం. పూజారిగా,గ్రామ పెద్దగా, యువతకు మార్గదర్శిగా,స్నేహంగా ఆయన అందించిన సేవలను ఎప్పటికీ మరువలేం.భౌతికంగా మా మధ్య లేకున్నా,ఆయన జ్ఞాపకాలు మాత్రం ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటాయని గ్రామస్థులు భావోద్వేగం వ్యక్తం చేస్తున్నారు.పురుషోత్తం శర్మ సేవలను స్మరించుకుంటూ ఆయన చూపిన సేవా మార్గంలో నడవడమే నిజమైన నివాళి అని పలువురు పేర్కొన్నారు.

# ఈసీ తీరుపై కాంగ్రెస్ సమరశంఖం.. 28న భారీ నిరసన

● 28న జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ నిరసనలు

● ఆసిఫాబాద్ కలెక్టరేట్ వద్ద ఉదయం 11.30 గంటలకు కార్యక్రమం

● ఏఐసీసీ పిలుపుతో ఆందోళన

● పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్సీ దండే విఠల్ పిలుపు



**కొమురంభీమ్ జిల్లా/సెప్టెంబర్ 27,(ప్రజావాణి):** కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష ధోరణి, ఎన్నికల్లో చోటుచేసుకున్న అక్రమాలను నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ కలెక్టరేట్ వద్ద ఉదయం 11.30 గంటలకు పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దండే విఠల్ కోరారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య విలువలు, పారదర్శకతను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు

# అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు ఎమ్మెల్యే రేవూరి పరామర్శ

● కాంగ్రెస్ కుటుంబాలకు అండగా ఉంటా.. కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా





**ఆత్మకూరు ప్రజావాణి సెప్టెంబర్ 27:** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో అనారోగ్యంతో మృతి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కుటుంబాలను పరకాల శాసనసభ్యులు గౌరవ శ్రీ రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు. నాగయ్యపల్లె గ్రామానికి చెందిన మాదాసి సూరయ్య, పెద్దాపురం గ్రామానికి చెందిన నామిని కళావతి, కొమ్ముల జయ, చాపర్తి సమ్మయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.మృతుల కుటుంబాలకు ధైర్యం ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ పాలుపంచుకుంటానని, ఏ ఆపద వచ్చినా వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, సమన్వయ కమిటీ సభ్యులు, సర్పంచులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనంలో విషాదం:ఇద్దరు యువకుల మృతి

● మృతుల కుటుంబాలకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రగాఢ సానుభూతి



**ప్రజావాణి దుబ్బాక నియోజకవర్గం** దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్ పేట భూశీపల్లి మండలంలోని రుద్రారం గ్రామం లో నిన్న వినాయక నిమజ్జన కార్యక్రమంలో జరిగిన విషాదకర ఘటనతో ఊరు మొత్తం శోకసంద్రంలో మునిగిపోయిందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువులో మునిగి పార రమేష్,కళాల నవీన్ మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు.ఈ పెను విషాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబ సభ్యులు,బంధువులు,స్నేహితులకు తీరని లోటు అని పేర్కొన్నారు. వారి పార్థివ దేహాలకు నివాళులు అర్పించారు.ఈ విషాద సమయంలో మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, వారి కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, నీటి వనరుల వద్ద నిమజ్జనం సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుండా శంకర్, సిద్దిపేట్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఏలూరు కమలాకర్,తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ అమర్ రెడ్డి, దుబ్బాక నియోజకవర్గ కో ఆర్డినేటర్ సోలిపేట ప్రసాద్ రెడ్డి, నాయకులు మండల నర్సింలు యాదవ రెడ్డి కుమార్ ఒఎ సెల్ మండల అధ్యక్షుడు మండల కుమార్ మాజీ ఎంపీటీసీ నర్సింలు, యాదవరెడ్డి,బొప్పాపూర్ దుబ్బా రాజం,పోతారం రాజు,స్వామి తదితరులు పాల్గొన్నారు.

# భూమి కోసం యువకుడి ఆత్మహత్యాయత్నం!

● అగ్రికల్చర్ కాలేజీ కోసం భూమి కోల్పోయా..
మిగులు భూమి కేటాయించాలని వినతి





**తంగళ్లపల్లి, సెప్టెంబర్ 27, ప్రజావాణి** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులో భూమి కేటాయించాలని కోరుతూ వినోద్ అనే యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న గ్రామస్తులు వెంటనే స్పందించి అతని చేతిలోని పెట్రోల్ డబ్బాను లాక్కొని అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. జిల్లెల్ల గ్రామంలో అగ్రికల్చర్ కళాశాల నిర్మాణం కోసం గతంలో తమకున్న భూమిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు న్యాయం చేయాలని, మిగులు భూమిలో రెండెకరాలు కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించాడు.తమ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయాడు. అంతేకాకుండా, జిల్లెల్ల గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములను సర్వే చేయకుండా ఓ బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాజకీయ నాయకుడు అధికారులను అడ్డుకుంటున్నాడని వినోద్ ఆరోపించాడు. ప్రభుత్వ భూములను ఆక్రమించి, ఎలాంటి అనుమతులు లేకుండా స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్నారని ఆరోపణలు చేశాడు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరపాల్సి ఉంది.వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములను సమగ్రంగా సర్వే చేసి, అర్హతను పరిశీలించి తనకు రెండెకరాల భూమిని కేటాయించాలని వినోద్ కోరాడు. భూమి సమస్యను పరిష్కరించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

# 45 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

● ఆడి.. పాడి.. పాత జ్ఞాపకాలను
నెమరువేసుకున్న 1981--82 బ్యాచ్



**ఆర్మూర్ టౌన్, సెప్టెంబర్ 27(మన సమగ్ర ప్రజావాణి):**45 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకుంటూ, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఆర్మూర్ పట్టణంలోని నటరాజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 1981--82 బ్యాచ్ పూర్వ విద్యార్థుల స్నేహ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. ఆర్మూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1981--82 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఏ, బీ, సీ, డీ, ఈ సెక్షన్లలో 245 మంది విద్యార్థులు కలిసి చదువుకున్నారు. చదువు పూర్తయిన అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్న వీరంతా 45 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, తమ కుటుంబ, ఉద్యోగ, వ్యాపార విషయాలను పంచుకున్నారు. అనంతరం అందరూ కలిసి గ్రూప్ ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఆడి, పాడి ఉల్లాసంగా గడిపారు. సామూహిక భోజనం చేసి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల సేవలను పూర్వ విద్యార్థులు స్మరించుకున్నారు. గురువులు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించడంతోనే పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా, మరికొందరు వ్యాపార రంగంలో స్థిరపడ్డారని తెలిపారు. తల్లిదండ్రులు, గురువుల ఆశీస్సులతోనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నామని పేర్కొన్నారు.తమతో కలిసి చదువుకున్న కొందరు స్నేహితులు మృతి చెందడాన్ని గుర్తుచేసుకుని వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. 45 ఏళ్ల నాటి విద్యాభ్యాసం, ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుని పలువురు భావోద్వేగానికి గురయ్యారు.ఈ కార్యక్రమంలో జై కిషన్, జి. నారాయణ, అల్లాపూర్ చంద్రప్రకాష్, దొండి మహేష్ చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దొంద రాములు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.కార్యక్రమంలో జి. నారాయణ, ఎం. ప్రదీప్ గుప్తా, బాలకృష్ణ ప్రసాద్, జగదీశ్వర్ వర్మ, చరణ్, చిన్నయ్య, కర్తన్, విజయ్ పాల్, రూపాలి మురళీ, చేపూర్ నాగేందర్, దొండి మహేశ్వర్, సాత్‌పుతే శ్రీనివాస్, జనార్దన్, చంద్రశేఖర్, అల్లాపూర్ రమేష్, చంద్రయ్య, ఎం.జే. కుమార్, గణేష్, అల్లాపూర్ చంద్రప్రకాశ్, పడాల్ విజయ్, దొండి గణేష్, బాస ప్రసాద్, కమ్ముల గంగాధర్, వైద్య రవీందర్, డీజే గంగా మోహన్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# మెదక్ పర్యాటక వైభవానికి ప్రపంచ ఖ్యాతి తీసుకురావాలి

■ 4 వేల మందితో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ ర్యాలీ

■ మెదక్ పర్యాటక కేంద్రాలను ప్రపంచానికి పరిచయం చేయాలి

■ ప్రపంచానికి అన్నం పెట్టిన చరిత్ర మెతుకు సీమది

■ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు







**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబర్ 27** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను ప్రతిబింబించేలా ఆదివారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. సుమారు 4 వేల మంది పాల్గొన్న ఈ ర్యాలీ మెదక్ ఖిల్లా నుంచి వెస్లీ కళాశాల వరకు ఉత్సాహభరితంగా సాగింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27న నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. మెదక్ ఖిల్లా వద్ద జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మెదక్ ఖిల్లా సందర్శకుల కోసం టికెట్ కౌంటర్‌ను ప్రారంభించారు.

16 కళారూపాలతో కనువిందు

డప్పు, డోలు, తంబుర, చిందు, భాగవతం, బోనాలు, బతుకమ్మ, లంబాడీ, గీత కార్మికులు, కరాటే, ఎన్‌సీసీ విద్యార్థులు, ఒగ్గు కళాకారులు తదితరులు సంప్రదాయ వేషధారణలో ర్యాలీలో పాల్గొని మెదక్ సంస్కృతి వైభవాన్ని చాటారు.

వెస్లీ కళాశాలలో పర్యాటక రంగంపై రూపొందించిన దృశ్య ప్రదర్శనను వీక్షించారు. శాంతికి ప్రతీకగా ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు తెల్ల పావురాలను ఎగురవేశారు. అనంతరం మెదక్ పర్యాటక శాఖ అధికారిక అంతర్జాల వేదికను ఆవిష్కరించారు.

మెదక్‌ది ఘన చరిత్ర

ఈ సందర్భంగా ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రపంచానికి అన్నం పెట్టిన చరిత్ర మెతుకు సీమ మెదక్‌కు ఉందన్నారు. మెదక్‌లోని చారిత్రక, ప్రకృతి, సాంస్కృతిక పర్యాటక ప్రాంతాలను దేశ, విదేశాల ప్రజలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక రంగంలో జిల్లా సాధిస్తున్న పురోగతిని ప్రస్తావిస్తూ కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను అభినందించారు. పర్యాటక ప్రాంతాల్లో రద్దీ పెరిగే రోజుల్లో రాకపోకల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రకృతిని కాపాడుకోవాలి

మెదక్ జిల్లాలోని ప్రకృతి అందాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీ అన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్లాస్టిక్‌కు బదులుగా పునర్వినియోగ వస్తువులను ఉపయోగించాలని కోరారు.

పోచారం అభయారణ్యం, నర్సాపూర్ అర్బన్ పార్క్, ఏడుపాయల వనదుర్గ, మెదక్ చర్చి తదితర పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. మెదక్ జిల్లాను ప్రత్యేక పర్యాటక వలయంగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించారు.

పర్యాటక రంగం అభివృద్ధి చెందితే హోటళ్లు, పర్యాటక మార్గదర్శకులు, స్థానిక ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. నర్సాపూర్ అడవుల అందాలను చిత్ర పరిశ్రమ కూడా గుర్తించిందన్నారు.

"మన ఊరు.. మన ప్రాంతం.. మనమే రక్షించుకోవాలి" అని ఎంపీ పిలుపునిచ్చారు. మెదక్ పర్యాటక ప్రాంతాలను దేశవ్యాప్తంగా పరిచయం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు.

14 పర్యాటక ప్రాంతాల గుర్తింపు

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో అపారమైన చారిత్రక వారసత్వం, సాంస్కృతిక సంపద ఉందన్నారు. భావితరాలకు ఈ సంపదను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.జిల్లాను పర్యాటక వలయంగా అభివృద్ధి చేసేందుకు 14 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. మెదక్ పర్యాటక ప్రాంతాలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.

అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలోని చారిత్రక ప్రదేశాలు, వారసత్వ సంపదను భావితరాల కోసం కాపాడుకోవాలని అన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలోని అపారమైన వారసత్వ సంపద జిల్లా ప్రజల అదృష్టమన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో మెదక్‌ను సందర్శించేలా అందరూ సహకరించాలని కోరారు.

ఈ సందర్భంగా పర్యాటక రంగంపై చదివిన కవిత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలను అందజేశారు.

ఈ.కార్యక్రమంలో డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా పర్యాటక అధికారి ఎల్లయ్య, మెదక్ ఆర్డీవో రమాదేవి, డీపీఆర్వో రామచంద్రరాజు, క్రీడల అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ నవీన్, మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాకారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వయం శక్తి మహిళలకు ఉల్లాస్ పరీక్ష విజయవంతం

● ఏపీఎం ఎస్. యాదగిరి





**రాయపోల్.సెప్టెంబర్27. (ప్రజావాణి)**మహిళా సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలకు అక్షరజ్ఞానం కల్పించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని రాయపోల్ ఏపీఎం ఎస్. యాదగిరి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమ్మకు అక్షరమాల పేరుతో మహిళలకు విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. రాయపోల్ మండలంలోని మహిళా సంఘాల్లో 693 మంది నిరక్షరాస్య మహిళలను గుర్తించి, వారికి అక్షరజ్ఞానం అందించే విధంగా వాలంటరీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ కూడా అందించినట్లు తెలిపారు.అక్షరాలు నేర్చుకున్న మహిళలకు నిర్వహించిన ఉల్లాస్ పరీక్ష ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్ష ద్వారా మహిళల్లో అక్షరజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు, వారు రోజువారీ జీవితంలో చదవడం, రాయడం వంటి విషయాల్లో స్వయం ఆధారితంగా మారేందుకు అమ్మకు అక్షరమాల కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.పరీక్ష నిర్వహణను సెర్ప్ సిబ్బంది పర్యవేక్షించగా, వివిధ గ్రామాల వీవీఏలు వాలంటీర్లుగా విధులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీసీలు నాగరాజు, కుమారస్వామి, అంజమ్మ, నితుషా, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు కవిత, కార్యదర్శి సౌందర్య, గ్రామ సంఘం అధ్యక్షురాలు ప్రసన్న, వీవీఏలు యు. నర్సింహులు, సుభద్ర, వినోద, మల్లేశం, లక్ష్మి, ఉదయభాను, సుమలత, నరేందర్ రెడ్డి, నరేష్, శోభ, కల్పన, రేణుక, విజయ, లావణ్య, మమత, కృష్ణ, తదితరులతో పాటు వివిధ గ్రామాల వీవీఏలు, మహిళలు పాల్గొన్నారు.

# పర్యాటక వసతుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభ...!

● డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** పర్యాటక వసతుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభ తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉపాధి, ఆర్థిక అవకాశాలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌లతో కలిసి డిప్యూటీ సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. చింతకాని మండల కేంద్రంలోని చెరువు వద్ద రూ.7 కోట్ల 90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పర్యాటక వసతుల కల్పన పనులకు, పందిళ్లపల్లి నుండి అనంతసాగర్ మీదుగా చింతకాని జడ్పీ రోడ్డు వరకు రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జగన్నాథపురంలో ఖమ్మం--బోనకల్ ఆర్అండ్‌బీ రోడ్డు నుండి న్యూ మార్కెట్ మీదుగా మత్కేపల్లి--పందిళ్లపల్లి వరకు రూ. 4 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పంచాయతీరాజ్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, చింతకాని పరిధిలోని నరసింహాపురం ఎస్సీ కాలనీలో రూ.18 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, నాగులవంచ గ్రామంలో నాగులవంచ నుండి రైల్వే కాలనీ ఆర్ అండ్ బీ రోడ్డు అండర్‌పాస్ వరకు రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా గత 34 నెలలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తయ్యేలా ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గతంలో ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ. 5 లక్షలు జమ చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలోనే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండవ విడతలో మరో రెండున్నర లక్షల ఇండ్ల మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీ లేని రుణాలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మహిళలకు రూ. 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి బస్సులు, సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, సిపిఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కల్మలచెరువు పశువైద్యశాలకు శాశ్వత డాక్టర్‌ను నియమించాలి

● కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన తెలంగాణ గిరిజన శక్తి నాయకుడు అంజి నాయక్



**గరిడేపల్లి, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామంలోని ప్రభుత్వ పశువైద్యశాలకు శాశ్వత పశువైద్యాధికారిని నియమించి, అవసరమైన మందులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలంగాణ గిరిజన శక్తి హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు గుగులోతు అంజి నాయక్ కోరారు. ఈ మేరకు ఆదివారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కల్మలచెరువు ప్రభుత్వ పశు వైద్యశాలలో చాలాకాలంగా డాక్టర్ లేకపోవడంతో రైతులు, పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్‌కు వివరించారు. పశువులకు అనారోగ్యం కలిగినప్పుడు సకాలంలో వైద్యం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే శాశ్వత పశువైద్యాధికారిని నియమించడంతో పాటు ఆసుపత్రిలో అవసరమైన మందులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిశీలించి, వీలైనంత త్వరగా డాక్టర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అంజి నాయక్ తెలిపారు.

# వేల్పుగొండకు పర్యాటక కళ... ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం





**టేక్మాల్ సెప్టెంబర్ 27: (మన ప్రజావాణి)** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టేక్మాల్ మండల ఎంపీడీవో ఆధ్వర్యంలో ఆదివారం నాడు వేల్పుగొండలో ని శ్రీ తుంబురేశ్వర ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మహిళలు మండల వెలుగు సంఘం సభ్యులు మరియు అంగన్వాడి సిబ్బంది చే బతుకమ్మ, బోనాలను శ్రీ తుంబురేశ్వర స్వామి ఆలయం వరకు డప్పు చప్పులతో డీజే పాటలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ..ఆలయ విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు పర్యాటకంగా ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా,ఆహ్లాదకరంగా ఉంచాలని నిర్వాహకులు సూచించారు. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించవచ్చని పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన భక్తులు,పర్యాటకులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ తుంబురేశ్వర ఆలయాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేసేందుకు త్వరలో మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ గ్రామ సర్పంచ్ నిరుడి దాసు ఉపసర్పంచ్ ఎంపీ సుధాకర్,ఎంపీ ఓ రియాజుద్దీన్,ఐసిడిఎస్ అల్లాదుర్గ్ ప్రాజెక్టు సూపర్వైజర్ పద్మలత, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్,అంగన్వాడి సిబ్బంది వెలుగు సభ్యులు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు గ్రామ పెద్దలు యువజన సంఘాల నాయకులు భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చాకిరేవు గుట్ట మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

● గుట్ట, వాగు, తాటివనం పరిరక్షణకు గ్రామస్తుల పోరాటం

● మైనింగ్‌తో ప్రకృతి వనరులం, రైతుల జీవనాధారాలకు ముప్పు : టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జలుగురి రమేష్.... దండు సుధాకర్





**ప్రజావాణి హనుమకొండ నవీన్ బ్యూరో నడికూడ సెప్టెంబర్ 27:** నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలోని చాకిరేవు గుట్టకు మైనింగ్ కోసం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని పరకాల నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ నాయకుడు జలుగురి రమేష్ దండు సుధాకర్ డిమాండ్ చేశారు. మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ ఆయన ఆధ్వర్యంలో గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు చాకిరేవు గుట్టను పరిశీలించి, మైనింగ్ రద్దు కోసం గ్రామస్తులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు.

ఐదు గ్రామాల రైతులకు వాగు జీవనాధారం

ఈ సందర్భంగా జలుగురి రమేష్ దండు సుధాకర్ మాట్లాడుతూ.. చాకిరేవు గుట్ట కంఠాత్మకూర్ గ్రామానికి రక్షణగా ఉండటంతో పాటు స్థానిక ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గుట్ట పక్కన ఉన్న వాగు చుట్టుపక్కల ఐదు గ్రామాల రైతులకు వ్యవసాయానికి జీవనాధారంగా ఉందని తెలిపారు. వాగు పరిసరాల్లోని తాటివనం గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తోందని, వాగు స్థానిక ముదిరాజ్ కుటుంబాలకు కూడా జీవనోపాధి అవకాశాలను అందిస్తోందని పేర్కొన్నారు.

మైనింగ్‌తో ప్రకృతి వనరులకు ముప్పు

చాకిరేవు గుట్టపై మైనింగ్ కార్యకలాపాలు కొనసాగితే గుట్టతో పాటు వాగు, తాటివనం, వ్యవసాయ భూములు, రైతుల జీవనాధారం, స్థానిక ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని దండు సుధాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల జీవనాధారాలను దృష్టిలో ఉంచుకుని మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని, చాకిరేవు గుట్టను మరియు వాగును పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంఠాత్మకూర్ సర్పంచ్ కొంగంటి తిరుపతి, ఉప సర్పంచ్ కె. కుమారస్వామి, టీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడు వీర భిక్షపతి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బైరపాక భద్రయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుడికందుల శివ, వార్డు సభ్యురాలు బస్సు భాగ్య, జేఏసీ నాయకులు కుమ్మరి నరేష్, జీవన్‌రెడ్డి, పల్లబోయిన రాజు, మంద సంతోష్, గూడూరు మొగిలి, , బండారి సుమన్, మనుపాటి రమేష్, మంజుల, నిశాంత్, యువజన నాయకులు పోగుల సుతేజ్, చుక్క ప్రభాస్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శాయంపేట మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



**ప్రజావాణి శాయంపేట** మండలంలోని పద్మశాలి సంఘ నాయకులులక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా అలంకరించారు తెలంగాణ ప్రాంత పద్మశాలి మండల అధ్యక్షుడు వంగర సాంబయ్య మాట్లాడుతూ కొమరం బిం జిల్లా వాంకిడి గ్రామంలో 191 5 సెప్టెంబర్ 27న జన్మించినడని అన్నారు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దిడ్డి రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు పద్మశాలి ముద్దుబిడ్డ తొలిమాలి దశ తెలంగాణ పోరాట యోధుడు సామాజికవేత్త న్యాయవాది భారతదేశంలో సహకార సంఘాల స్థాపిినకుడు నిరంకుశ నిజాం రజాకర్ భూస్వామి ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజాసంఘాలను నిర్మాణం చేసి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని కూడా త్రునాప్రనాయంగా వదిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయ నేతని అన్నారు జీవితంలో బీసీల హక్కులు అభివృద్ధి రాజకీయ అధికారం కోసం పోరాడిన మహానీయుడని ధైర్య సాహసాల దిట్టని తన జీవితాంతం ప్రజల కోసం పోరాడిన గొప్ప నాయకుడని ఆయనను ఆదర్శంగా తీసుకొని మనమంతా ముందుకు పోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్ మండల యువసేన అధ్యక్షుడు బాసని సాయి వడ్డేపల్లి శ్రీను దిడ్డి ప్రభాకర్ బాసని నవీన్ బూర లక్ష్మీనారాయణ కుసుమ రాజేంద్రప్రసాద్ వెంకటపతి గొట్టేముక్కల రమేష్‌యువసేన అధ్యక్షుడు వనం దేవరాజ్ శ్రీధర్ జనార్ధన్ దాసరి రాజ్ కుమార్ బాసాని శ్రీను తదితరులు పాల్గొన్నారు

# మతోన్మాద, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి

● సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు

● ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం






**ప్రజావాణి, సెప్టెంబర్ 27, హన్మకొండ హనుమకొండ/సుబేదారి :** భారతదేశ స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాద, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అసమానతలు లేని సమాజ నిర్మాణానికి యువత ముందుకు సాగుతూ ఉద్యమించాలని, రక్తదానం ప్రాణదానంతో సమానమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సుబేదారిలోని రెడ్ క్రాస్ సొసైటీలో భగత్ సింగ్ 119వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేస్తూ బ్రిటిషర్ల ఉరికంబాన్ని ముద్దాడి అమరత్వం పొందిన విప్లవ దృవతార షహిద్ భగత్ సింగ్ అని కొనియాడారు. వారి పోరాట స్ఫూర్తితో నేటి సమాజంలో అసమానతలపై, అందరికీ సమాన హక్కులకై, మతోన్మాదంపై, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా,దోపిడి, పీడన, అణిచివేత, కులమత లేని సమ సమాజ స్థాపనకై పోరాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ముందుకు సాగుతూ యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రక్తదానం చేయడానికి యువత ఎలాంటి వెనుకడుగువేయకుండా నిర్భయంగా ముందుకు రావచ్చన్నారు. ప్రస్తుత సమాజంలో రక్తదానం చేయడం గొప్ప వరమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి నాలుగు నెలల ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. దేశంలో ఎంతో మంది మహళలు రక్తహీనతతో ఉన్నారని, రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం సంతోషమన్నారు. రక్తదానం చేయడం బాధ్యత గల పౌరుని ఉత్తమ లక్షణమని కొనియాడారు. డోనెట్ బ్లడ్ సేవ్ లైఫ్ పేరుతో ఎఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి శ్రీనివాసరావు సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, నాయకులు ఎన్ ఎ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, గుంటి రాజేందర్, పొనుగోటి రాముగోపాల్ చారి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, జిల్లా ఆఫీస్ బేరర్స్ తాటికంటి మమత, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు, నాయకులు జెట్టి కృష్ణ, ఈర్ల లావణ్య, మోతె సతీష్, ఐదుపురం ప్రదీప్, మేకల రంజిత్, ఒరుగంటి విజయ్, మాచర్ల సతీష్, దుగ్యాల సందీప్, మురళి కృష్ణ, నిమ్మల వెన్నెల, వల్లం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్

● మహాత్మాగాంధీ శాంతి సేన ఆధ్వర్యంలో ఆందోళన



**మధిర: మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 27**భారత ప్రజాస్వామ్యానికి శాపంగా మారిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని,మహాత్మా గాంధీ శాంతి సేన నాయకులు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు ఈరోజు జరిగిన కార్యక్రమం డిమాండ్ ఈ మధిర పట్టణంలో వైఎస్ఆర్ సర్కిల్లో జరిగిన రాష్ట్ర రోకో లో వ్యక్తులు ప్రసంగించారు జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు ఆందోళన చేస్తామని ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని జైలుకు సహితం వెళ్తామని నాయకులు అన్నారు భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందని వీటిని కాపాడుకునేందుకు పౌర సమాజం కదలాలనే వారు కోరారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్ నాగేశ్వరరావు మహాత్మాగాంధీ శాంతి సేన కన్వీనర్ మొగిలి శ్రీను విజయ్ బొడ్డు సురేష్ ప్రదీ ప్ వాసు అనిల్ వేణు పుష్ప ఉపేంద్ర మరియు సీనియర్ నాయకులు పాల్గొన్నారు...

# రాజకీయమే ప్రజాసేవగా.. ఆపదలో అండగా నిలుస్తున్న భూక్య జంపన్న



**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27, 2026 ( ప్రజావాణి):**ఎటూరునాగారం మండలం దొడ్ల కొత్తూరు గ్రామానికి చెందిన రాధ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న వెంటనే స్పందించారు.క్షణం కూడా ఆలస్యం చేయకుండా హనుమకొండలోని ప్రముఖ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహాయ సహకారాలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.ప్రజలకు కష్టం వచ్చినప్పుడు పరామర్శలకే పరిమితం కాకుండా, అవసరమైన సమయంలో చేతనైన సహాయం అందిస్తూ అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని భూక్య జంపన్న గారు తన సేవా కార్యక్రమాల ద్వారా చాటిచెబుతున్నారు.ప్రజల సమస్యలను తెలుసుకోవడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, అవసరమైన సమయంలో స్పందించడం, సాధ్యమైనంత మేరకు పరిష్కారానికి కృషి చేయడమే తన రాజకీయ ప్రయాణానికి ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# యువ టూరిజం పోటీల విజేతలకు కలెక్టర్ కోయ శ్రీహర్ష బహుమతులు



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 26:** ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026 వేడుకల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ టూరిజం క్లబ్ జిల్లా స్థాయి పోటీలు శనివారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. పర్యాటక రంగంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు మన ప్రాంతంలోని చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రదేశాలపై ఆసక్తి కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానాన్ని తెలంగాణ గురుకుల పాఠశాల, గర్రెపల్లి, ద్వితీయ స్థానాన్ని జడ్పీహెచ్ఎస్, కమాన్‌పూర్, తృతీయ స్థానాన్ని జడ్పీహెచ్ఎస్, జూలపల్లి విద్యార్థులు సాధించారు. కళాశాలల విభాగంలో ప్రథమ స్థానం జీజేసీ గర్ల్స్, గోదావరిఖని, ద్వితీయ స్థానం తెలంగాణ గురుకుల పాఠశాల, గర్రెపల్లి, తృతీయ స్థానం జీజేసీ, కమాన్‌పూర్ విద్యార్థులు సాధించారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అధికారులు అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంపొందించేలా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కల్పన, జిల్లా ఉపాధి అధికారి, జిల్లా పర్యాటక నోడల్ అధికారి ఎం. రాజశేఖర్, జిల్లా యువజన క్రీడల అధికారి ఏ. సురేష్, విద్యాశాఖ అధికారి శారద, వి. అంజయ్య, కుమారస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగుదిలీప్






**జమ్మికుంట సెప్టెంబర్ 27 (ప్రజావాణి)** స్వాతంత్ర్య సమరయోధుడిగా తెలంగాణ ఉద్యమకారుడిగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు తెలంగాణ సాధన కోసం పదవులను సైతం త్యాగం చేసిన మహనీయుడు మలిదశ తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శిగా నిలిచిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన సేవలు పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ దివ్య స్మృతికి ఘన నివాళులు అని తెలుపుతూ ఈరోజు ఎక్కడైతే మనము కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకున్నామో, అక్కడ కార్యక్రమం చేసుకునే అవకాశం ఉండే కానీ ఈరోజు పద్మశాలి కుల సంఘం అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి గనుక,ఈ కార్యక్రమాన్ని గాంధీ చౌరస్తాలో చేసుకోవడం జరిగింది వారి ఆశయాలనుకొనసాగిస్తూఈరోజు వారిని మనం గుర్తు చేసుకుంటూ మా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దిడ్డి రాము చెప్పినట్టు దాన్ని కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గ్‌గా కూడా ప్రకటించుకోవాలని ఉండే కానీ ఈరోజు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో దాన్ని ఆ కార్యక్రమం కాస్త ఆలస్యమైంది మళ్లీ వచ్చే జయంతి వర్ధంతి లోపే ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని,దానికి ఒక కార్యక్రమం పెట్టుకొని,మళ్లీ వచ్చే జయంతి రోజు అక్కడ అన్ని కార్యక్రమాలు చేసుకుంటామని తెలియజేస్తూ,అలాగే పద్మశాలి కుటుంబ సభ్యులందరూ కూడా ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలి వారి ఆశయ సాధనకు అందరం కూడా ముందుండాలని చెప్పి తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చుంచు రమాదేవి దిడ్డి రాముమాజీ జడ్పీటీసీ అరుకల వీరేశలింగం బొద్దుల రవీందర్,ఉడుత రమేష్ పద్మశాలి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఉమ్మడి మండలాల్లో ఉత్సాహంగా అమ్మకు అక్షరమాల కార్యక్రమం

- కోటగిరి మండలంలో 714 మంది మహిళలకు పరీక్ష.
- పోతంగల్ మండలంలో 740 మంది మహిళలకు పరీక్ష.
- మహిళలు ఆర్థిక అక్షర సాధించడం కోసం ఈ కార్యక్రమం.
- ఏపీఎం భాస్కర్.





**కోటగిరి/ప్రజావాణి:** డ్వాక్రా మహిళామణులకు సమాజంలో నిత్యం జరిగే ఆర్థిక అంశాలపై అక్షరాస్యత సాధించడం కోసం అమ్మకు అక్షరమాల కార్యక్రమం నిర్వహించినట్లు ఉమ్మడి కోటగిరి మండల ఏపీఎం భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి,పోతంగల్ మండలాల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళల కోసం ప్రత్యేక అక్షరాస్యత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో డ్వాక్రా మహిళలు ఎంతో ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో పాల్గొని పరీక్ష రాశారు. ఈ సందర్భంగా ఏపిఎం భాస్కర్ మాట్లాడు తూ. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు (సెర్ప్‌సీవో) ఆదేశాల మేరకు ప్రతి డ్వాక్రా మహిళలకు చదువుపై ఆసక్తిని పెంపొందించేలా సమాజంలో జరుగుతున్న ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండడానికై ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పం చ్లు,వివో అధ్యక్షురాళ్ళు,సీసీలు,ఎంఎస్‌ఏ, వీఓఏలు,ఐకెపి సిబ్బంది,మహిళలు పాల్గొన్నారు.

# పర్యాటక దినోత్సవ పోటీల్లో రిషిత ప్రతిభ



**రాయికల్, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రాయికల్ మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నూకల రిషిత సత్తా చాటింది. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో వ్యాసరచన విభాగంలో ప్రథమ స్థానం, చిత్రలేఖన విభాగంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుని పాఠశాలకు, మండలానికి పేరు తెచ్చింది. ఆదివారం పట్టణంలోని గుడికోట త్రికూటాలయంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో జిల్లా అడిషనల్ కలెక్టర్ బి. రాజాగౌడ్, జిల్లా విద్యాధికారి కె. రాము చేతుల మీదుగా రిషిత ప్రశంసా పత్రం, మెడల్, నగదు బహుమతిని అందుకుంది. అనంతరం రిషితను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బొల్లె చిన్నయ్య, నాయకులు గుర్రం మహేందర్ గౌడ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక కొండా లక్ష్మణ్ బాపూజీ

- నంగునూరులో పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు



**నంగునూరు, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** నంగునూరు మండల కేంద్రంలో పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, దాసరి రామలింగం, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ...కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని దేశ సేవ చేసిన ఆయన, తెలంగాణ ప్రాంత అభివృద్ధి, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారని తెలిపారు. ఆయన జీవితం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం, ప్రజా సమస్యలపై ఆయన చూపిన నిబద్ధతను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పద్మశాలి సమాజం అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని, యువత విద్య, ఉపాధి రంగాల్లో రాణిస్తూ సమాజ అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. బాపూజీ ఆశయాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడంతో పాటు సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించుకోవాలని నాయకులు సూచించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాదుల చంద్రశేఖర్,దాసరి రవి, కారపురి శ్రీనివాస్,బింగి రవీందర్, బొజ్జ మహేష్,ఆనందాస్ విష్ణుమూర్తి, దాసరి మల్లేశం, కారంపూరి రామచంద్రం ఆరగొండ శశి, పోతన వినోద్, దికొండ భాను, దాసరి వినయ్, దాసరి శేఖర్, వేముల ప్రశాంత్,గాజర్ల సిద్ధు, దాసరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# జాగో యువ జాగో భారత్'లో నమోదు చేయండి

- సెప్టెంబర్ 30లోపు ఉచిత నమోదుకు అవకాశం
- తొమ్మిది నుంచి 12వ తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీలు
- పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను భాగస్వాములను చేయాలి
- రాదారి నాగరాజు, డీఆర్‌పీ



**నంగునూరు, సెప్టెంబర్ 27:** విద్యార్థుల్లో భారతీయ నాగరికత, సాంస్కృతిక వారసత్వం, రాజ్యాంగపరమైన బాధ్యతలు, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, జాతి నిర్మాణంలో భాగస్వామ్యం వంటి వాటిపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సీసీఆర్‌టీ), న్యూఢిల్లీ, రామకృష్ణ మఠం--బేలూరు శాఖకు చెందిన అద్వైత ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో 'జాగో యువ--జాగో భారత్' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లాకు చెందిన డీఆర్‌పీ రాదారి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. తొమ్మిదవ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, నాగరికత, రాజ్యాంగ బాధ్యతలు, సాంస్కృతిక వారసత్వం, నైతిక నాయకత్వం, దేశ నిర్మాణంలో యువత పాత్ర వంటి అంశాలపై అవగాహన పెంపొందించేందుకు వివిధ పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. నమోదు చేసుకున్న పాఠశాలలు, కళాశాలలకు 'స్వామి వివేకానంద -- జాతికి అతని పిలుపు', 'స్వామి వివేకానంద సంక్షిప్త జీవిత చరిత్ర' అనే రెండు పుస్తకాలను పీడీఎఫ్ రూపంలో అందజేస్తారని తెలిపారు. వాటిని అధ్యయనం చేసిన విద్యార్థులకు రీల్స్ లేదా లఘు వీడియోలు, చిత్ర లేఖనం, వ్యాస రచన, వక్తృత్వం, నాటక ప్రదర్శన తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తమ విద్యా సంస్థలను అధికారిక పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. సాధ్యమైనంత ఎక్కువ మంది విద్యార్థులను పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో డిజిటల్ సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. విద్యార్థుల వ్యక్తిగత ఈమెయిల్ చిరునామాలకు లేదా సంబంధిత విద్యాసంస్థల ఈమెయిల్‌కు సర్టిఫికెట్లు పంపనున్నట్లు వివరించారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సెప్టెంబర్ 30వ తేదీలోపు ఉచితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అధికారిక వెబ్‌సైట్: https://www.jyjb.in లో నమోదు చేసుకోవాలని తెలిపారు. నేరుగా నమోదు చేసుకునే లింక్:ఫ్ttps://www.jyjb.in/register ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పాఠశాల స్థాయి పోటీలను నవంబర్ 15 వ తేదీ లోపు, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలను డిసెంబర్ 2026లోపు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో విజేతలకు 2027 జనవరి 12వ తేదీన జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా బహుమతులు, సర్టిఫికెట్లు అందిస్తారని తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి, సంస్కృతి, విలువలు, బాధ్యతాయుత పౌరసత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఈ కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను జాతీయ స్థాయిలో చాటుకోవాలని పిలుపునిచ్చారు.

# రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలి

- నంగునూరులో 'మాల విద్యార్థి గర్జన' పోస్టర్ ఆవిష్కరణ
- విద్య, ఉద్యోగాల్లో అర్హులైన మాల విద్యార్థులకు న్యాయం చేయాలి





**నంగునూరు, సెప్టెంబర్ 27:** విద్య, ఉద్యోగ నియామకాల్లో అమలవుతున్న రోస్టర్ విధానాన్ని సమగ్రంగా పునః సమీక్షించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో 'మాల విద్యార్థి గర్జన' మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ వద్ద రోస్టర్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ నియామకాల్లో అమలవుతున్న ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమానంగా అందేలా నియామక ప్రక్రియలోని రోస్టర్ విధానాన్ని ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 'మాల విద్యార్థి గర్జన' మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో తమకు జరుగుతున్న అన్యాయాలను మహాసభ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మాల విద్యార్థులు, నిరుద్యోగ యువత తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని నాయకులు కోరారు. రోస్టర్ విధానంపై సమగ్ర చర్చ జరిపి, సామాజిక న్యాయం, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నియామక విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రోస్టర్ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, నంగునూరు గ్రామ సర్పంచ్ సనాదుల బాల పోచయ్య, మాలమహానాడు నాయకులు శ్రవణ్, అల్లిబిల్లి నరసింహారావు, బడే రాజయ్య, రాగుల కనకయ్య, పులి రవి, రాగుల కృష్ణ, దాసరి రమేశ్, జెల్ల మహేందర్, దండు ఆనంద్, సాయి శ్యామ్, బడే అజయ్, రాకేశ్, ఈశ్వర చందు, కార్యదర్శి రాజు ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ నాస్తిక్, ఎంఎస్ఎస్ జిల్లా సభ్యులు శేఖర్, బుట్టి సాయి, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మండల స్థాయి బాధ్యులు, యువకులు హాజరయ్యారు. 'మాల విద్యార్థి గర్జన' మహాసభకు విద్యార్థులు, నిరుద్యోగ యువత, సామాజిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ప్రజా పాలనలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చరితాత్మకం కాంగ్రెస్ పార్టీ తో సాధ్యం

- పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్న బియ్యం పథకం సంతృప్తినిచ్చింది
- గత 10 ఏండ్లలో టిఆర్ ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదు
- స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి




**ప్రజావాణి, సూర్యాపేట బ్యూరో సెప్టెంబర్27.** పేదలకు కడుపునిండా అన్నం పెట్టే ఆరు కేజీల సన్న బియ్యం పథకం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర భారీ నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం నేరేడుచర్ల పట్టణంలోని ఎస్కేఎస్ ఫంక్షన్ హాల్ లో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండలాల చెందిన అర్హులైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం తమ ప్రభుత్వమని అన్నారు. దేశంలో అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పథకం లేదన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క తెల్ల రేషన్ కార్డు ఇవ్వలేదని వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక 16.32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. తెలంగాణలో మొత్తం కలిపి 1,06,28,092 రేషన్ కార్డులు ఉన్నాయని, దీంతో 3,42,57,109 మంది ఆహార భద్రత లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం కలిపి 3,72,658 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. హుజూర్నగర్ నియోజకవర్గంలో మొత్తం రేషన్ కార్డుల 1,08,011 ఉండగా ఈ రోజు కొత్తగా గరిడేపల్లి మండలంలో 20,258, పాలకీడుమండలంలో 9,095, నేరేడుచర్ల మండలంలో 14035 రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని మంత్రి అన్నారు. సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలకు కడుపునిండా భోజనం పెడుతున్నామని గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన దొడ్డుబియ్యం కోళ్ల ఫారాలు, బీర్ల తయారీ, రైస్ మిల్లర్లు అక్రమాలకు పాల్పడానికి ఉపయోగపడ్డాయని తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డు ఇచ్చి, ప్రతి ఒక్క మనిషికి 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందిస్తున్నామని రాష్ట్రంలో 85% మంది జనాభా కు కడుపునిండా అన్నం పెట్టే పథకం పెట్టడం చాలా సంతృప్తినిచ్చిందని అన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ సన్న బియ్యం పథకం హుజూర్నగర్ లో అదేవిధంగా కొత్త రేషన్ కార్డులను తిరుమలగిరి నుండి రెండు మన జిల్లా నుండి ప్రారంభించుకోవటం చాలా సంతోషకరమైన విషయమని, అర్హులై ఉండి ఎవరికైనా కార్డు రానివారికి దరఖాస్తు చేసుకున్నచో కొత్త రేషన్ కార్డులు ఇప్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో , పేరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అగ్రికల్చర్ కమిటీ సభ్యులు చెవిటి వెంకన్న,జిల్లా ఎస్పీ కె నరసింహ, హుజూర్ నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి,వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి, తహసిల్దార్ సైదులు, వాజిద్,స్రవంతి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కెరటాలు చాకలి ఐలమ్మ,కొండ లక్ష్మణ్ బాపూజీ

- బోడుప్పల్ 397వ వారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- చాకలి ఐలమ్మ, కొండ లక్ష్మ ణ్ బాపూజీ లకు ఘన నివాళులు
- అంబేద్కర్ ఆశయ సాధన స ంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య



**మేడిపల్లి సెప్టెంబర్ 27( మన ప్రజావాణి)** తెలంగాణ ఉద్యమ కెరటాలు చాకలి ఐలమ్మ,కొండ లక్ష్మణ్ బాపూజీ అని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు.ఈ మేరకు బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల అలంకరణ చేసి ఆయన చేసిన త్యాగాలను స్మరించుకునే కార్యక్రమం జరిగింది.ఈ ఆదివారం 397వ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య పాల్గొని ఘనంగా నిర్వహించారు. అనంతరం తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ, తెలంగాణ నాయకుడు కొండ లక్ష్మణ్ బాపూజీ ల జయంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం,భుక్తి కోసం, కోసం, బానిస బతుకుల విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం చేసిన వీరవనిత సాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, అదేవిధంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు మాజీమంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ తొలి దశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రము ఏర్పాటు కోసం తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేసిన మహా ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని వారి స్ఫూర్తితో,వారి ఆశయాలను ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు.అదేవిధంగా అక్టోబర్ 18 వ తేదీ ఆదివారం రోజున 400వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రణాళిక చేస్తున్నామని, త్వరలోనే సమాన్వయ సమావేశం ఏర్పాటు చేసి 400 వారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహణపై చర్చిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికల రవీందర్,భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య,బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గరుగుల యాకయ్య,చిల్ల అంజయ్య,యేసు రాజు, జడ శ్రీనివాస్,గల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నరసయ్య మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

- సిపిఎం సీనియర్ నాయకుడు వలసాని నరసయ్య గారికి సిపిఎం నాయకులు ఘన నివాళి.
- భౌతికకాయంపై ఎర్రజెండా కప్పిన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-** గోవిందరావు పేట మండలం పసర గ్రామ సిపిఎం సీనియర్ నాయకుడు వలసాని నరసయ్య మృతి సిపిఎం పార్టీకి ప్రజా ఉద్యమానికి తీరని లోటని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు.ఆదివారం పసర గ్రామంలో నరసయ్య స్వగృహంలో ఆయన భౌతికకాయంపై ఎర్రగుడ్డ కప్పి సిపిఎం కామ్రేడ్స్ ఆయనకు జోహార్ అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.అదే ఆయనకు మనం అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి సిపిఎం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొదిల్ల చిట్టిబాబు గొంది రాజేష్ మండల కమిటీ సభ్యులు గుండు రామస్వామి అంబాల మురళి ఎస్డి అంజాద్ ఏం కవిత సుడి సంజీవరెడ్డి మద్ది నారాయణరెడ్డి, లోకు రమేష్, యానాల ధర్మారెడ్డి. తీగల సమిరెడ్డి, క్యాతం సూర్యనారాయణ శ్రీరామోజు సువర్ణ, పల్లపు రాజు, మంచోజు బ్రహ్మాచారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.ద

# ప్రజలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆప్యాయ పలకరింపులు

- సామాన్యుడిలా బల్లపై కూర్చొని టీ తాగిన డిప్యూటీ సీఎం!
- ముదిగొండ టీ స్టాల్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముచ్చట్లు





**ముదిగొండ సెప్టెంబర్ 27 ప్రజావాణి ప్రతినిధి** అధికార గర్వం లేని ఆత్మీయత, ప్రజా నాయకుడికి ఉండాల్సిన నిజమైన నిరాడంబరత ముదిగొండ మండల కేంద్రంలో శనివారం ఆవిష్కృతమైంది. మధిర నియోజకవర్గ పర్యటనలో భాగంగా వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన హోదాను పక్కనబెట్టి, అత్యంత సాధారణ మానవుడిలా ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రజల మధ్యన గడిపారు.ముదిగొండ సెంటర్‌లోని 'నీల్ కమల్ టీ స్టాల్' వద్ద కాన్వాయ్‌ను ఆపిన డిప్యూటీ సీఎం, అక్కడ ఉన్న బల్లపై కూర్చొని ప్రశాంతంగా టీ తాగారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్వయంగా తమ ముందుకు వచ్చి సామాన్యుడిలా టీ తాగుతుండడం చూసి స్థానికులు, ప్రయాణికులు ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. ఆయనను చూసేందుకు, మాట్లాడేందుకు జనం పోటీ పడగా, యువత ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరిస్తూ భట్టి విక్రమార్క అందరి మనస్సులను గెలుచుకున్నారు.

ప్రజా సంక్షేమంపై ప్రత్యక్ష ఆరా

టీ స్టాల్ పరిసరాల్లో ఉన్న మహిళలను ఆప్యాయంగా పలకరించిన డిప్యూటీ సీఎం, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారి బానోతు రాంజీ, కూరగాయల వ్యాపారి నరసమ్మలను పలకరించి, ముదిగొండలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులపై అభిప్రాయం అడిగారు. "సార్, మునుపటి కంటే ఇప్పుడు రోడ్డు వెడల్పు కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది" అని నరసమ్మ సంతోషం వ్యక్తం చేశారు. కాగా, విస్తరణలో ఇండ్లు కోల్పోయామని కొందరు ఆయన దృష్టికి తేగా, "ఎవరూ ఆందోళన చెందవద్దు, ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున ఇండ్లు ఇస్తాం" అని భరోసా ఇచ్చారు.

రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకునే పల్లె నాగభూషణంను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పలకరించి కులవృత్తి, కుటుంబ పోషణ గురించి అడిగారు. దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్నానని, ఆర్థిక సహకారం అందిస్తే చిన్న డబ్బా ఏర్పాటు చేసుకుంటానని నాగభూషణం కోరగా... ఆయన కుమారుడు పల్లె సురేష్ పేరిట 'రాజీవ్ యువ వికాసం' కింద రూ. లక్ష వరకు రుణ సహాయం అందిస్తామని మాట ఇచ్చారు.వెంకటాపురం గ్రామానికి చెందిన ఎంగ్రోటి యశోద అనే నిరుపేద మహిళ ఇద్దరు ఆడపిల్లలతో అద్దె ఇంట్లో పడుతున్న కష్టాలను వివరించగా, తక్షణమే స్పందించిన డిప్యూటీ సీఎం... రాబోయే 'ఇందిరమ్మ ఇండ్ల' జాబితాలో ఆమెకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయాలని అక్కడే ఉన్న సర్పంచ్‌ను ఆదేశించారు.

అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ

అనంతరం ముదిగొండలో రూపుదిద్దుకుంటున్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్ సి) నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దానితో పాటు పట్టణంలో శరవేగంగా జరుగుతున్న రోడ్డు వెడల్పు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ఒకే రోజు నియోజకవర్గ అభివృద్ధి పనులను సమీక్షిస్తూనే, మరోవైపు సామాన్య ప్రజల కష్టాలను ఆలకించి అక్కడికక్కడే పరిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీరుపై ముదిగొండ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# చదువుకు చేయూత ప్రతిభకు ప్రోత్సాహం



**మన ప్రజావాణి చౌడేపల్లి:** విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలవాలనే లక్ష్యంతో శ్రీ రమాబాయి వివాహ పరిచయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా చౌడేపల్లిలోని ఎస్సీ బాలుర, బాలికలతో పాటు బీసీ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రిని అందజేశారు.శ్రీ రమాబాయి సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు రేగంటి దేవానంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎస్సీ వసతి గృహం వార్డెన్ సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వార్డెన్లు మాట్లాడుతూ.. సంఘం నిర్వాహకులు, సభ్యులు ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రి అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని కోరారు.ఈ సందర్భంగా రేగంటి దేవానంద్ మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుకు తమ సంఘం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా ఈ ఏడాది నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులకు పైగా సాధించే ప్రతి హాస్టల్ విద్యార్థికి తన తండ్రి, రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రేగంటి నరసింహులు జ్ఞాపకార్థం నగదు బహుమతి అందించనున్నట్లు ప్రకటించారు.కార్యక్రమంలో వసతి గృహాల వార్డెన్లు వెంకటరమణ, సురేష్, దీపారాణితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# చెదరని స్నేహం.. చెరిగిపోని జ్ఞాపకం

- 57 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..
- 70 ఏళ్ల వయసులోనూ చెరిగిపోని చిన్ననాటి జ్ఞాపకాలు



**మన ప్రజావాణి చౌడేపల్లి:** చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో 1968--69 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక శనివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. దాదాపు 57 ఏళ్ల అనంతరం ఒకరినొకరు కలుసుకున్న పూర్వ విద్యార్థులు పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు.తాము విద్యాభ్యాసం చేసిన పాఠశాల ప్రాంగణంలో 70 ఏళ్లకు పైబడిన వయసులో మళ్లీ కలుసుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని, భావోద్వేగాన్ని కలిగించిందని వారు పేర్కొన్నారు. విద్యార్థి దశలో చేసిన అల్లరి, చిలిపి చేష్టలు, ఉపాధ్యాయులను ఆటపట్టించిన సందర్భాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరితో ఒకరు ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు.పాఠశాలలో విద్యనభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడిన విషయాలను పరస్పరం పంచుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా సేవ చేయాలని, భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహకరించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. ఇంతకాలం తర్వాత ముదిమి వయసులోనూ అందరూ ఒకచోట చేరడం జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిందని తెలిపారు.అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి భోజనం చేసి, ఆత్మీయంగా వీడ్కోలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, 1968--69 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కోండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

- దేశవ్యాప్తం గా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం
- ప్రధానమం త్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం
- జిల్లా బిజెపి అధ్యక్షులు సాయిని మల్లేశం
- బిజెపి పా ర్టీ పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు
- యువ మోర్చ అధ్యక్షుడు తుర్పాటి శంకర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం





**జమ్మికుంట సెప్టెంబరు 27 (ప్రజావాణి)** జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్ లోప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని 2026 సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలునిర్వహిస్తున్నారనిదాంట్లో భాగంగా ఈరోజు జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్ లో బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు యువ మోర్చ అధ్యక్షుడు తుర్పాటి శంకర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు దీనికి కరీంనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు సాయిని మల్లేశం జిల్లా యువ మోర్చ అధ్యక్షుడు సంగ నరేష్ హాజరై మాట్లాడుతూ నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు దేశ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు సుపరిపాలన అందిస్తున్నారని నిత్యం ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారనిఆయనను స్ఫూర్తిగా తీసుకున్న యువకులు పట్టణ మండల అధ్యక్షులు కొలకాని రాజుబైరెడ్డి వెంకట రమణారెడ్డి తో పాటు 50 మంది కార్యకర్తలు అత్యవసర పరిస్థితుల్లో ఆపదలో ఉన్న వారి ప్రాణం కాపాడటానికి రక్తదానం చేశారని తెలిపారు అదేవిధంగా నరేంద్ర మోడీ తన మనసులోని మాటను దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలిసి వీక్షించారు జమ్మికుంట పట్టణ బిజెపి ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో కోండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారుదీనికి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారుఈకార్యక్రమంలో జిల్లా ఓబిసి అధ్యక్షులు ఆకుల రాజేందర్ కౌన్సిలర్ శీలం శ్రీనివాస్ జమ్మికుంట ఇల్లంతకుంట మండల అధ్యక్షులు దొంతరవేన రమేష్ యాదవ్ బైరెడ్డి వెంకట రమణారెడ్డి పుప్పాల రఘు నరసింహ రాజు సంపత్ రావు కైలాసకోటి గణేష్ రాచపల్లి ప్రశాంత్ రాజేష్ ఠాకూర్ రాకేష్ ఠాకూర్ పనికారి రమేష్ నాలుగు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# వరంగల్ ఎయిర్ పోర్టుకు దొడ్డి కొమరయ్య పేరు పెట్టాలి- ఓయూ విద్యార్థి నాయకులు





**మేడిపల్లి సెప్టెంబర్ 27( మన ప్రజావాణి)** వరంగల్ ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తికి,ఆత్మ గౌరవానికి ప్రతీక అని, ఆయన చరిత్రను భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిపే బాధ్యత ప్రభుత్వంపై ఉందని విద్యార్థి జేఏసీ పేర్కొంది. తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు,వీరయోధుడు దొడ్డి కొమురయ్య త్యాగాన్ని చిరస్మరణీయంగా నిలిపేలా ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లను,తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్సీ మల్లేశం ని మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు.తెలంగాణ రాష్ట్ర కురుమ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ ప్రతినిధులు దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ జంగిటి కమలాకర్,వైస్ చైర్మన్ డాక్టర్ కంకల ఎలేందర్,అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బర్ల మహేందర్,ఓయూ జెఏసి చైర్మన్ కోరే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న పెద్దిరెడ్డి

- రెడ్‌బుక్ పేరుతో కేసులు పెడుతున్నారని ఆరోపణ



**మన ప్రజావాణి పుంగనూరు:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని, పోలీసు వ్యవస్థ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై రెడ్‌బుక్ పేరుతో అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు.డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని పెద్దిరెడ్డి ఆరోపించారు. ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇచ్చారని, స్పోర్ట్స్ కోటాలోనూ గ్రౌండ్ పరిశీలన లేకుండానే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టారని విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై నిరసన తెలిపిన వారిపైనా కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు.రాయలసీమపై నిర్లక్ష్యం రాయలసీమలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పెద్దిరెడ్డి విమర్శించారు. అనంతపురం జిల్లాలో పంటలు, తోటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. శ్రీశైలం జలాల విషయంలో తెలంగాణకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు.గతంలో టీడీపీకి ఓటు వేసిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉందో ఆలోచించుకోవాలని సూచించారు. చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు, ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని, తిరుగుబాటు చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు.

# పారుపల్లిలో ఘనంగా ఉల్లాస్ అక్షరాస్యతా పరీక్షలు



**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 27, ప్రజావాణి:** ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో సెప్టెంబరు 27, 2026న మహిళా సంఘాల సభ్యుల కోసం నిర్వహించిన 'ఉల్లాస్' అక్షరాస్యత పరీక్షలు ఘనంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు; ఈ పరీక్షల ద్వారా గ్రామీణ మహిళల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు, ఆర్థిక ప్రణాళికలపై అవగాహన వస్తుందని అన్నారు. కార్యక్రమంలో వి ఓ ఎ ఏనుగురి పద్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు బోడ సంధ్య, కార్యదర్శి కోడం కల్పన, కోశాధికారి చీకటి రుచిత, ఉప సర్పంచ్ బోడ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరిని చదివిస్తూ వయస్సుతో సంబంధం లేకుండా అక్షరసులుగా మార్చడానికి ఇది ఒక గొప్ప అవకాశం

- పరీక్షకేంద్రాన్నిసందర్శించినమున్సిపల్ చైర్మన్ మొలుగుదిలీప్





**జమ్మికుంట సెప్టెంబర్ 27 (ప్రజావాణి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిరక్షరాశులకు నూటికి నూరు శాతం చదువు అందించాలని నిర్వహించే కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని చదివిస్తూ వారికి వయస్సుతో సంబంధం లేకుండా అక్షరసులుగా మార్చడానికి ఇది ఒక గొప్ప అవకాశం అని ఇందుకు గాను జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో 3770 మందిని గుర్తించగా అందులో ఆదివారం 2842 మందికి పరీక్ష నిర్వహించడం గొప్ప శుభ సూచికమని ఆయన అన్నారు ప్రతి ఒక్కరికి విద్యను అందించి ఇప్పుడున్న ఆధునిక సమాజంలో జీవించడానికి చదువు చాలా అవసరం అన్నారుఈ కార్యక్రమంలో దిడ్డి రాముమెప్మా సిబ్బంది జ్యోతిమంజులవిజయదేవేంద్ర పలువురు ఆర్పీలు ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు

# తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఖాయం..

- జిల్లా యూత్ నేత నవీన్ నాయక్



**ప్రజావాణి,ఇనుగుర్తి:** తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఆ పార్టీ జిల్లా యువ నేత గుగులోతు నవీన్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో మునుపెన్నడూ లేని విధంగా అన్ని రంగాలలో భారత్ అభివృద్ధి సాధిస్తుందన్నారు. అన్నిటిని మించి ప్రధాని మోదీ అవినీతి రహిత పాలన పట్ల రాష్ట్ర ప్రజలు బిజెపికి మోడీకి జై కొడుతున్నారన్నారు. జిల్లాలోని ఇనుగుర్తి మండలం లో కాంగ్రెస్ నుంచి బీ ఆర్ఎస్ లోకి,బీ ఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లోకి నాయకులు కార్యకర్తలు మారుతున్నట్లు కృత్రిమ హడావుడి సృష్టిస్తున్నారన్నారని,నిజానికి రెండు పార్టీల తీరు పట్ల ప్రజలు విసిగి పోయారని పేర్కొన్నారు. చాప కిందినీరులా బిజెపి వైపు ప్రజలు విశేష ఆసక్తి కనబరుస్తున్నారని, ఎప్పుడు ఎలక్షన్లు వచ్చినా ఈసారి బిజెపిని గెలిపించాలని ప్రజలు బలంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా పార్టీ అగ్రనాయకత్వం చర్యలు తీసుకుంటోందని,ఈ క్రమంలోనే పార్టీ జాతీయ నేత హుస్సేన్ నాయక్ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికారన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు బిజెపికి దగ్గరయి ప్రభుత్వాన్ని ఏర్పరచడం ఈసారి తప్పదన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన గణపతి నిమజ్జనాలు



**సెప్టెంబర్ 27.ప్రజావాణి న్యూస్/ పర్వతగిరి** పర్వతగిరి మండల కేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణపతి నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పర్వతగిరి పట్టణ ఎస్ఐ బి. ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను భక్తులు నిమజ్జనం కోసం పోలుకమ్మ చెరువు వద్దకు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా భక్తులు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలకు తావులేకుండా ఎస్ఐ బి. ప్రవీణ్ స్వయంగా నిమజ్జన ప్రదేశంలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించారు.పోలీసు సిబ్బంది కూడా భక్తులకు అవసరమైన సూచనలు చేస్తూ, నిమజ్జన కార్యక్రమాలు సురక్షితంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.పోలీసుల సమన్వయంతో గణపతి నిమజ్జనాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, విజయవంతంగా ముగిశాయి.

# ప్రజాసౌమ్యం'కుణి'అవుతుంది,నేడు సమాజంలోని ప్రజలకు జర్నలిస్ట్ కావాలి

- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి,



**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,సెప్టెంబర్ 27:** వికారాబాద్ జిల్లాలో జరిగిన యూనియన్ అఫ్ వర్కింగ్ (జర్నలిస్ట్)మహా సభలో,తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ తో,వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తో కలిసి,సమావేశంలో పాల్గొన్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి,సమాజంలోనీ జర్నలిస్ట్ లు ప్రజల పక్షాన,ఎల్లవేళలా వారి సమస్యల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తుంది అని మహేష్ రెడ్డి తెలిపారు.ఈ మహాసభ సందర్భంగా జర్నలిస్ట్ లను, సన్మానించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి,ప్రభుత్వ యంత్రాంగం పైన ప్రశ్నలకు వర్షం కురిపిస్తూ,పరిపాలన సజావుగా సాగేలా ప్రత్యేక చొరవ తీసుకుంటారు.ప్రజాసౌమ్యన్ని కాపాడే దిశగా,ప్రజల పక్షపాతూలుగా,మీ విధులను నిర్వహించాలని అని మహేష్ రెడ్డి,తెలిపారు.ప్రజల పక్షాన,మీ విధులను నిర్వహించలని,మేము కూడా అండగా ఉంటాం అని,మా పార్టీ కూడా జర్నలిస్ట్ కు అండగా ఉంటుంది అని,మహేష్ రెడ్డి తెలిపారు.

# పశువుల కొట్టంగా.. తాగుబోతుల అడ్డాగా సిరిసిల్ల కొత్త బస్టాండ్

- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు..
- రాత్రి వేళల్లో తాగుబోతులకు అడ్డాగా
- అధికారుల నిర్లక్ష్యంపై సీపీఎం ఆగ్రహం





**సిరిసిల్ల,ప్రజావాణి** ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాల్సిన సిరిసిల్ల కొత్త బస్టాండ్ అధ్వానంగా మారింది. బస్టాండ్ ఆవరణ మొత్తం పశువుల మలమూత్రాలతో నిండిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి వేళల్లో పశువులు బస్టాండ్లోనే సంచరిస్తూ అక్కడ పడుకుంటుండగా, మరోవైపు తాగుబోతులకు కూడా బస్టాండ్ అడ్డాగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ము.శం. రమేష్ ఆరోపించారు.

**పశువుల మలమూత్రాలతో కంపుకొడుతున్న బస్టాండ్**

ఆదివారం ఉదయం సీపీఎం జిల్లా కార్యదర్శి ము.శం. రమేష్ కొత్త బస్టాండ్ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్ పరిస్థితి పశువుల కొట్టం కంటే దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ ప్రాంతమంతా పశువుల మలమూత్రాలతో నిండిపోయి ఉండటంతో ప్రయాణికులు నిలబడేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**రాత్రివేళ తాగుబోతులకు అడ్డా?**

రాత్రి సమయంలో పశువులు బస్టాండ్లోకి వచ్చి పడుకోవడంతో పాటు, కొందరు తాగుబోతులు కూడా అక్కడే మద్యం సేవించి పడుకుంటున్నారని రమేష్ ఆరోపించారు. బహిరంగంగా మలమూత్ర విసర్జన చేయడంతో బస్టాండ్ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని అన్నారు. ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**డిపో మేనేజర్కు కనిపించడంలేదా?**

బస్టాండ్ ఇంత దారుణంగా తయారైనప్పటికీ డిపో మేనేజర్ ఎందుకు పట్టించుకోవడం లేదని రమేష్ ప్రశ్నించారు. బస్టాండ్ను పరిశుభ్రంగా ఉంచడం, ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం డిపో మేనేజర్ బాధ్యత కాదా? అని నిలదీశారు.బస్టాండ్లో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి పశువులు లోపలికి రాకుండా చూడాలని, రాత్రి వేళల్లో తాగుబోతులు అక్కడ పడుకోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రోడ్లపై పశువులు.. పట్టించుకోని మున్సిపల్ అధికారులు**

సిరిసిల్ల పట్టణంలో పశువులు రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని రమేష్ ఆరోపించారు. మార్కెట్ ప్రాంతాల్లో పశువుల కారణంగా రైతులు, వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్లపై పశువులు సంచరించడం వల్ల వాహనదారులు, ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉందన్నారు.రోడ్లపై పశువులను వదిలే యజమానులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, యజమానులు లేని అనాథ పశువులను వెంటనే పశు సంరక్షణ కేంద్రాలకు తరలించాలని డిమాండ్ చేశారు.

**చర్యలు లేకుంటే ప్రయాణికులతో ధర్నా**

కొత్త బస్టాండ్ పరిశుభ్రతపై డిపో మేనేజర్, రోడ్లపై పశువుల నియంత్రణపై మున్సిపల్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని రమేష్ డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రయాణికులను సమీకరించి బస్టాండ్ వద్ద ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

# తెలంగాణ ఉద్యమకారులకు 20 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

- సర్పంచ్ నుంచి ఎంపీ వరకు ఉద్యమకారులకు ప్రాతినిధ్యం కల్పించాలి
- ప్రాణాలు కోల్పోంఐన అవయవాలు కోల్పోయిన జైలు పాలైన ఉద్యమకారులను గుర్తించాలి
- అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక విధానం ప్రకటించాలి
- స్వాగత ఉపన్యాసంలో తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఎక్కటీ సంజీవరెడ్డి



**జమ్మికుంట సెప్టెంబర్ 27 (ప్రజావాణి)** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఎక్కటీ సంజీవరెడ్డి డిమాండ్ చేశారు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తించి, అన్ని రాజకీయ పార్టీలు వారికి 20 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేలా ప్రత్యేక విధానాన్ని ప్రకటించాలని కోరారుతెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం అనేక త్యాగాలు పోరాటాలతో సాగిందని సంజీవరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం కోసం వేలాది మంది ఉద్యమకారులు నిరసనలు ఆందోళనలు ర్యాలీలు ధర్నాల్లో పాల్గొని తమ జీవితాలను ఉద్యమానికి అంకితం చేశారని తెలిపారు. ఉద్యమ సమయంలో అనేక మంది ప్రాణాలు కోల్పోగా మరికొందరు తీవ్రంగా గాయపడి అవయవాలు కోల్పోయారని చెప్పారుపలువురు ఉద్యమకారులు కేసులు ఎదుర్కొని జైలు పాలయ్యారని గుర్తుచేశారురాష్ట్ర సాధన అనంతరం కూడా ఉద్యమకారుల త్యాగాలను విస్మరించకుండా వారికి గుర్తింపు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు ఉద్యమకారుల కుటుంబాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సామాజికంగా రాజకీయంగా వారికి అండగా నిలవాలని కోరారుసర్పంచ్ నుంచి ఎంపీ వరకుఅవకాశంకల్పించాలి ఉద్యమకారులకు గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు రాజకీయ అవకాశాలు కల్పించాలని ఎక్కటీ సంజీవరెడ్డి కోరారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్లు, వార్డు సభ్యులుగా మండల పరిషత్లలో ఎంపీటీసీలుగాజిల్లా పరిషత్లలో జెడ్పీటీసీలుగా శాసనసభలో ఎమ్మెల్యేలుగా పార్లమెంట్లో ఎంపీలుగా ఉద్యమకారులకు అవకాశం కల్పించే విధంగా అన్ని రాజకీయ పార్టీలు తమ విధానాలను రూపొందించాలని సూచించారు.కే వలం ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం మాత్రమే కాకుండా రాజకీయ పార్టీల సంస్థాగత నిర్మాణంలోనూ ఉద్యమకారులకు సముచిత స్థానం ఇవ్వాలని అన్నారు. పార్టీ పదవులు, కమిటీలు, స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉద్యమకారుల పాత్రను గుర్తించి ప్రాతినిధ్యం కల్పించాలని కోరారుత్యాగాలను గుర్తించి రాజకీయ గుర్తింపు ఇవ్వాలితెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారి త్యాగాలకు రాజకీయ గుర్తింపు లభించినప్పుడే వారి పోరాటానికి పూర్తి దక్కినట్లవుతుందని సంజీవరెడ్డి అన్నారు. ఉద్యమంలో ముందుండి పోరాడిన అనేక మంది ప్రస్తుతం రాజకీయ అవకాశాలకు దూరంగా ఉన్నారని పేర్కొన్నారుప్రాణాలు కోల్పోయి న ఉద్యమకారుల కుటుంబాలు అవయవాలు కోల్పోయిన బాధితులు, కేసులు ఎదుర్కొన్న వారు, జైలు జీవితాన్ని అనుభవించినఉద్యమకారులను గుర్తించివారిసేవలను అధికారికంగా నమోదు చేయాల్సిన అవసరంఉందన్నార ౦ఉద్యమంలో వారి పాత్రను గుర్తించి తగిన గౌరవం కల్పించాలని కోరారుఎన్నికలకే పరిమితంకాకుండాప్రాధాన్యంఉద్యమకారులను ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకోకుండా పార్టీ నిర్ణయాల్లోనూ వారికి ప్రాధాన్యం కల్పించాలని ఎక్కటీ సంజీవరెడ్డి అన్నారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో కీలకంగా పనిచేసిన వారిని గుర్తించి రాజకీయ నిర్ణయాల్లో భాగస్వాములను చేయాలని సూచించారుఅన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారుల సమస్యలపై ఒకే వేదికపై చర్చించాలని, 20 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే అంశంపై తమ పార్టీ విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం వారి త్యాగాలకు ఇచ్చే గౌరవంగా భావించాలనిఅన్నారుతెలంగాణ ఉద్యమ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించడంతో పాటు, ఆ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారిని గుర్తించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యతగా భావించాలని ఎక్కటీ సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఉద్యమకారులకు రాజకీయంగా అవకాశాలు కల్పించేందుకు అన్ని పార్టీలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు

# కష్టకాలంలో కొండంత అండ.. రాజేష్ గౌడ్ కుటుంబానికి కవితమ్మ భరోసా!

- మాతృమూర్తిని కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబానికి మానవీయ ఓదార్పు!
- అర్పనపల్లికి వెళ్లి యాదమ్మ చిత్రపటానికి మాజీ ఎంపీ ఘన నివాళి!
- అమ్మ లేని లోటు తీర్చ లేనిది.. కానీ మేమంతా నీకు తోడు ఉన్నాం అని ధైర్యం చెప్పిన కవితమ్మ!







**కేసముద్రం, సెప్టెంబర్ 27,ప్రజావాణి.** ఆపదలో ఉన్నామన్నా, కష్టమొచ్చి పడిందన్నా నేనున్నానంటూ ముందుండే మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు కవితా మాలోత్ మరోసారి తన ఉదారత్వాన్ని, మానవత్వాన్ని చాటుకున్నారు. కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్, నిరంతరం ప్రజాసేవలో ఉండే గంధసిరి రాజేష్ గౌడ్ మాతృమూర్తి గంధసిరి యాదమ్మ ఇటీవల స్వర్గస్థులైన సంగతి తెలిసిందే. తల్లిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు కవితమ్మ ఆదివారం స్వయంగా అర్పనపల్లిలోని రాజేష్ గౌడ్ నివాసానికి తరలివెళ్లారు.గ్రామానికి చేరుకున్న కవితమ్మ, ముందుగా యాదమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి చేతులు జోడించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తీవ్ర శోకసముద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యుల చెంతకు చేరి, వారిని ఓదార్చారు. అమ్మ ప్రేమా, అమ్మ నీడ అనేవి బిడ్డల జీవితాల్లో ఎవరూ భర్తీ చేయలేనివి. యాదమ్మ మరణం ఆ కుటుంబానికి తీరని లోటు అని కవితమ్మ భావోద్వేగంతో పేర్కొన్నారు. తల్లిని కోల్పోయిన బాధను ఏ శక్తీ పూర్తిగా తుడిచిపెట్టలేకపోయినా, ఈ కష్టకాలంలో తామంతా ఒక కుటుంబంగా రాజేష్ గౌడ్ వెన్నంటి ఉంటామని భరోసా ఇచ్చారు.ప్రజాసేవలో ఎప్పుడూ చురుగ్గా ఉంటూ, ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకునే రాజేష్ గౌడ్ కుటుంబానికి ఎలాంటి కష్టం వచ్చినా తోడుగా నిలుస్తామని కవితమ్మ ఇచ్చిన మాట ఆ కుటుంబంలో కొండంత ధైర్యాన్ని నింపింది. కేవలం ఒక నాయకురాలిగా కాకుండా, ఇంటి పెద్ద దిక్కులా వచ్చి తమను ఓదార్చిన కవితమ్మ ఆదరణకు, ఆమె చూపిన మానవత్వానికి రాజేష్ గౌడ్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకున్నారు. చుట్టుపక్కల ప్రజలు సైతం కవితమ్మ చూపిన ఈ చొరవను, అభిమానాన్ని ఎంతో అభినందించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కవితా మాలోత్ వెంట అర్పనపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ జాని, వార్డు సభ్యులు గంధం శ్రీనివాస్, సింగని లక్మయ్య నైతికంగా అండగా నిలిచారు. అలాగే సీనియర్ నాయకులు మోడెం రాజు, గంధసిరి సోమయ్య, మహ్మద్ సైదులు, బబ్బురు ఉప్పలయ్య, గంధసిరి యాకంబరం,కామగోని సారయ్య, సాంబయ్య, గంగపురపు వెంకన్న, విజేందర్, స్వామి, యాకన్న, యాకుబ్, సుధాకర్, కిష్టయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాదమ్మ కి శ్రద్ధాంజలి ఘటించారు.

# మూడు నోటీసులు.. వెంచర్ పనులు మాత్రం ఆగలేదు!

- మన్నాన్నపల్లి శివారులో వెంచర్‌పై స్థానికుల ఆరోపణలు
- డిపీఓ జోక్యంపై అనుమానాలు..
- సమగ్ర విచారణకు డిమాండ్
- కాలువలు, వాగులు, చెట్ల తొలగింపుపైనా అధికారుల దృష్టి సారించాలని విజ్ఞప్తి.





**కొండాపూర్, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** మండల పరిధిలోని మన్నాన్నపల్లి గ్రామ శివారులో వెంచర్ పనుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేసినప్పటికీ, పనులు పూర్తిగా నిలిచిపోకపోవడంపై వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నోటీసుల అనంతరం నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన తదుపరి చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నిస్తున్నారు.

**నోటీసులు జారీ.. పనులు కొనసాగుతున్నాయంటూ ఆరోపణలు**

మన్నాన్నపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 36, 37, 40, 41, 42, 43, 44, 47, 48, 49, 50, 51, 52, 53, 54, 55, 80, 81, 82, 83, 84, 85, 86లో వెంచర్‌కు సంబంధించిన పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, వాటిపై అధికారులు తీసుకున్న చర్యలేమిటో ప్రజలకు వెల్లడించాలని వారు కోరుతున్నారు.

**డిపీఓ జోక్యంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్**

వెంచర్ వ్యవహారంలో జిల్లా పంచాయతీ అధికారి (డిపీఓ) స్థాయిలో జోక్యం జరుగుతోందనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. చర్యలు తీసుకునే ప్రక్రియ ఆలస్యం కావడానికి కారణాలేమిటో సంబంధిత అధికారులు వివరించాలని స్థానికులు కోరుతున్నారు. వెంచర్ నిర్వాహకులకు అధికారుల నుంచి ఏమైనా సహకారం అందుతోందా? లేక పరిపాలనా, న్యాయపరమైన కారణాల వల్ల చర్యలు ఆలస్యమవుతున్నాయా? అనే అంశాలపై జిల్లా అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**కాలువలు, వాగులపై సమగ్ర పరిశీలన అవసరం**

వెంచర్ పనుల కారణంగా సహజ నీటి ప్రవాహ మార్గాలైన నాళాలు, కాలువలు, వాగులపై ప్రభావం పడుతోందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. వెంచర్‌కు సంబంధించిన అనుమతుల్లో చూపిన నీటి ప్రవాహ మార్గాలు ప్రస్తుతం యథాతథంగా ఉన్నాయా? వాటి స్వరూపంలో ఏమైనా మార్పులు జరిగాయా? అనే అంశాలను ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**వంద ఎకరాల్లో చెట్ల తొలగింపుపైనా విచారణ కోరుతున్న స్థానికులు**

వెంచర్ పరిధిలో సుమారు 100 ఎకరాల్లో చెట్ల తొలగింపు జరిగిందనే ఆరోపణలు కూడా వెలువడుతున్నాయి. ఈ ప్రాంతంలో చెట్ల తొలగింపునకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారా? నిబంధనలకు అనుగుణంగానే తొలగింపు జరిగిందా? అనే అంశాలపై అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి**

మూడు నోటీసులు జారీ అయినప్పటికీ వ్యవహారం ఇంకా కొనసాగుతుండటంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ, ఇరిగేషన్, అటవీ తదితర సంబంధిత శాఖల అధికారులతో సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి వెంచర్‌కు సంబంధించిన అనుమతులు, లేఅవుట్ నిబంధనలు, నిర్మాణ పనులు, నీటి ప్రవాహ మార్గాలు, చెట్ల తొలగింపు తదితర అంశాలపై సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆరోపణలు నిజమా.. నిబంధనల ప్రకారమేనా?**

వెంచర్‌పై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం ఎంత? ఇప్పటికే జారీ చేసిన మూడు నోటీసులపై అధికారులు తీసుకున్న చర్యలేమిటి? సంబంధిత అనుమతులు పూర్తిస్థాయిలో ఉన్నాయా? అనే అంశాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించి అనుమానాలకు తెరదించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఫుడ్ మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన పరకాల శాసనసభ్యులు





**సెప్టెంబర్ 27.ప్రజావాణి న్యూస్/ గీసుకొండ**

గీసుగొండ మండలంలోని విశ్వనాథ పురం గ్రామంలో ఫుడ్ మార్కెట్ ఏర్పాటు చేయడానికి అనుకూలమైన ప్రాంతాన్ని,వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏ. ప్రియాంక అనిల్ లతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు .రైతులు, వ్యాపారులు, స్థానిక ప్రజలకు ప్రయోజనం కలిగే విధంగా ఫుడ్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, మార్కెటింగ్ వసతులు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ఫుడ్ మార్కెట్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు అందడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడం, వ్యాపార కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభించే అవకాశం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో గీసుకొండ మండల పార్టీ అధ్యక్షులు దాడి శివ,తెలంగాణ రాష్ట్ర పిసిసి మహిళ భీమ గాని సౌజన్య,వరంగల్ జనరల్ సెక్రెటరీ తుమ్మనపల్లి శ్రీనివాస్,ఆకుల రుద్ర ప్రసాద్,కుసం రమేష్,దూల వెంకటేశ్వర్లు,హలవత్ వీరన్న,కోమ్మాల సర్పంచ్ యమున ప్రవీణ్,నంద నాయక్ తండ సర్పంచ్ భూక్య అఖిల్,విశ్వనాధపురం సర్పంచ్ జ్యోతి తిరుపతి, అనంతరం సర్పంచ్ సతీష్ అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు, బిఎల్ఎలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు



**సెప్టెంబర్ 27.ప్రజావాణి న్యూస్ /సంగెం**

తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ111వ జయంతి వేడుకలు సంగెం మండలంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి పండ్లు పంపిణీ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంగెం సర్పంచ్ పేర్ల లలిత రమేష్ మరియు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధికార ప్రతినిధి కందగట్ల నరహరి మాట్లాడుతూ1915 సెప్టెంబర్ 27న కొమరం భీం జిల్లా వాంకిడిలో జన్మించిన బాపూజీ, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో,నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1952 నుండి 1971 వరకు ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్ గా, మంత్రిగా పనిచేసి, 1969లో ప్రత్యేక తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి మంత్రి బాపూజీ అని కొనియాడారు.బాపూజీ తన జీవితాంతం బడుగు, బలహీన వర్గాల,ముఖ్యంగా చేనేత కార్మికుల సంక్షేమం కోసం పోరాడారని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ ఒడ్డున ఉన్న ఆయన నివాసం 'జలదృశ్యం' లోనే 2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందని, అక్కడి నుండే మలిదశ ఉద్యమం మొదలైందని గుర్తు చేశారు.అనంతరం ఆయన చేసిన పోరాటాలను, తెలంగాణ కోసం చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంగెం పద్మశాలి సంఘం అధ్యక్షులు బిట్ల సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి మెట్టుపల్లి మల్లయ్య,మెట్టుపల్లి రమేష్, కోడూరి సదయ్య,అప్పల కవిత,వార్డు సభ్యులు వుండ్డిల మల్లికార్జున్, గొల్ల సందీప్ ,మెట్టుపల్లి కృష్ణ,పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఇప్ప కాయల రమేష్ బాబు,ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల మనోహర్, కమిటీ సభ్యులు బిట్ల రామకృష్ణ,కందకట్ల వెంకటేశ్వర్లు, కందకట్ల సంపత్ ,ఇప్ప కాయల విజయ్ ప్రకాష్,పేరాల లక్ష్మీ నరసయ్య,అందే కృష్ణమూర్తి,బిట్ల లక్ష్మణ్, బిట్ల రామ్మూర్తి,బిట్ల వేణు,నల్ల రాజు , నల్లశంకర్,చిందం వీరస్వామి, కొంతం వేణు, వీరేశం, సుధాకర్,పులిపాటి మధు, రాజా నరేందర్,కటకం బిక్షపతి, బూర ప్రకాష్, గుల్లపల్లి చంద్రశేఖర్,ఊరుగొండ రాజు,పులిపాటి రాజు,పద్మశాలి సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదలకు కొండంత అండగా సీఎంఆర్ఎఫ్

- హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రూ.21.62 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ.
- 8 మండలాల్లోని 5,319 మంది లబ్ధిదారులకు ఆర్థిక భరోసా.
- అర్హులందరికీ ప్రభుత్వ సాయం అందిస్తాం:
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.





**హుజూర్నగర్ సెప్టెంబర్ 27 (ప్రజావాణి)** తీవ్ర అనారోగ్యం, ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ అనారోగ్య సమస్యలతో కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని 8 మండలాలకు చెందిన మొత్తం 5,319 మంది బాధితులకు దాదాపు రూ. 21.62 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అనారోగ్యం బారినపడి ఆర్థికంగా చితికిపోయిన పేద కుటుంబాలను ఆదుకోవడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయించి బాధితులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య ఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తున్నామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు 5,319 కుటుంబాలకు ఏకంగా రూ. 21.62 కోట్ల మేర ఆర్థిక సాయం అందడం నియోజకవర్గ చరిత్రలోనే ప్రత్యేకమని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా లభించిన ఈ నిధులు ఎన్నో కుటుంబాలను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించాయని చెప్పారు.

**ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం**

ప్రజారోగ్య పరిరక్షణతో పాటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. సహాయం అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో ఇంతటి భారీ మొత్తంలో ఆర్థిక సాయం అందించి ఆదుకున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పి కె. నరసింహ,రాష్ట్ర పేరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ హరి సింగ్, ఆర్డిఓ శ్రీనివాసులు, మునిసిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, ఎఎంసి రాధికా దేశ్ ముఖ్, గ్రంధాలయం చైర్మన్ బచ్చు రామారావు, తహసీల్దార్ కవిత స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్





**రాయికల్, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** సంస్కృతి, సంప్రదాయాలు తెలిసే విధంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించే విధంగా రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని రూ. 50 వేల కోట్ల అభివృద్ధి సాధించే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.జగిత్యాల జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆదివారం రాయికల్ పట్టణంలోని శ్రీ చెన్నకేశవ నాథ త్రికూటాలయంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజాగౌడ్ తో కలిసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జగిత్యాల జిల్లాలో పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ చూపిన 180 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగిందన్నారు.త్రికూటాలయంలో రాయికల్ పట్టణ ప్రజల అవసరాల నిమిత్తం నిధులు కేటాయించి మంటపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, పర్యాటక, పురావస్తు శాఖ సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో మాట్లాడి ప్రణాళికలకు అనుగుణంగా గుడికోటను అభివృద్ధి చేస్తామన్నారు. ఆలయ కమిటీ వినతి పత్రం అందజేసిందని, దానికి అనుగుణంగా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.రైజింగ్ తెలంగాణ 2047లో భాగంగా రూ. 50 వేల కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం కృషి చేస్తోందని, కొన్ని దేశాలు కేవలం పర్యాటక రంగంపైనే ఆధారపడి అభివృద్ధి సాధిస్తున్నాయని తెలిపారు. పురాతన కట్టడాలను కాపాడుతూ పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాయికల్ పెద్ద చెరువు జలకళతో ఉండడానికి గతంలో కృషి చేశామని, ముఖ్యమంత్రి సహకారంతో రూ. 1 కోటి నిధులతో పెద్ద చెరువు వద్ద సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, వైస్ చైర్మన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి, కమిషనర్ మనోహర్ గౌడ్,పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,మాజీ వైస్ చైర్మన్ రమాదేవి, డీఈవో రాము, డివైఎస్వో రవి, కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్, మౌనిక, మానస, శ్రీధర్,రాకేశ్ నాయక్, మచ్చ గంగలక్ష్మీ శేఖర్, కో–ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, మహేష్ గౌడ్, లత మురళి, సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు"చిన్న నాగారం"లో'మెగా వైద్య శిబిరం'..

- జనరల్,గ్యాస్ట్రో,కంటి పరీక్షలు మెడిసిన్ ఫ్రీ..
- సద్వినియోగం చేసుకోవాలి...
- సర్పంచి సుజాత యాకయ్య



**ప్రజావాణి,ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగరంలోఈనెల 29న,(మంగళవారం)జంగాల రాజేశ్వర్రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ద్వారా,సాయిరామ్ హాస్పిటల్స్ వారి సహకారం తో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచి చెడుపాక సుజాత యాకయ్య తెలిపారు.ఈ మేరకు ఆదివారం విలేకరులతో సర్పంచి మాట్లాడుతూ.హెల్త్ క్యాంప్ గ్రామపంచాయతీ ఆవరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో ఖమ్మం కు చెందిన గ్యాస్ట్రో,లివర్, ఉదరకోశ వ్యాధులకు సంబంధించిన సమస్యలతో పాటు కిడ్నీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, సర్జికల్ గ్యాస్ట్రో, గ్యాస్ట్రో మెడిసిన్, ఆంకాలజీ, కార్డియాలజీ, అంకాలజీ, డయాబెటిక్, సైనస్, ఆప్తమాలజీ, జనరల్ సర్జన్, డెర్మటాలజీ, తదితర విభాగాలకు చెందిన గుర్తింపు పొందిన వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఫ్రీగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరం ఉ.10-00గంటల నుంచి మధ్యాహ్నం గం.1-00 వరకు నిర్వహించబడుతుందని చెప్పారు.

**శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

ప్రజారోగ్యం ఆకాంక్షస్తూ గ్రామ సర్పంచ్ సుజాతయాకయ్య అభ్యర్థన మేరకు జంగాల రాజేశ్వర్రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ద్వారా,సాయిరామ్ హాస్పిటల్స్ వారి సహకారం తో చిన్ననాగారంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ డైరెక్టర్ గెద్దం సామ్యూల్ ప్రజలకు పిలుపునిచ్చారు.అధిక సంఖ్యలో గ్రామస్తుల తో పాటు గ్రామ పరిధిలోని తండాలకు చెందినవారు వచ్చి తమ ఆరోగ్య సమస్యలను వైద్యులతో పరీక్షలు చేయించుకుని ఉచిత మందులు పొందాల్సిందిగా కోరారు.

# కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య: అశ్వారావుపేటలో తీవ్ర విషాదం



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 27 (మన సమగ్ర ప్రజావాణి):** కుటుంబంలో తలెత్తిన చిన్నపాటి వివాదాలు, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఒక కుటుంబాన్ని నిలువునా కూల్చేసింది. దంపతుల నడుమ చోటుచేసుకున్న మనస్పర్థల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన అశ్వారావుపేట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో స్థానిక మాదిగ మోడల్ కాలనీలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.పోలీసులు మరియు మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారంఅశ్వారావుపేట మండల కేంద్రంలోని మాదిగ మోడల్ కాలనీకి చెందిన తగరం వెంకటేశ్వరరావు (35), తండ్రి సిద్దయ్య, వృత్తి రీత్యా కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య స్వర్ణలత మరియు ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలిద్దరూ మండలపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ (సోషల్ వెల్ఫేర్) బాలుర వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నారు.వెంకటేశ్వరరావు గత కొంతకాలంగా మద్యానికి బానిసకావడంతో పాటు కుటుంబ బాధ్యతలను పూర్తిగా విస్మరించడం ప్రారంభించాడు. మద్యపాన వ్యసనం కారణంగా ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండటంతో, మనస్తాపానికి గురైన భార్య స్వర్ణలత కొద్దిరోజుల క్రితమే ఆసుపాకలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది.హాస్టల్‌లో పిల్లలను చూసి వస్తుండగా మళ్లీ గొడవ ఆదివారం ఉదయం పూట వెంకటేశ్వరరావు, అతని భార్య స్వర్ణలత ఇద్దరూ కలిసి మండలపల్లి వసతి గృహంలో ఉంటున్న తమ పిల్లలను పరామర్శించేందుకు వెళ్లారు. పిల్లలను చూసుకుని తిరుగు ప్రయాణంలో తిరిగి వస్తున్న క్రమంలో, వెంకటేశ్వరరావు మార్గమధ్యంలో మళ్లీ భార్యతో గొడవకు దిగాడు. భర్త ప్రవర్తనతో తీవ్ర విసుగు చెందిన స్వర్ణలత, అతనితో కలిసి ఇంటికి వెళ్లకుండా నేరుగా ఆసుపాకలోని తన తల్లిదండ్రుల వద్దకే వెళ్లిపోయింది.భార్య తనతో రాకుండా మళ్లీ పుట్టింటికే వెళ్లిపోవడంతో వెంకటేశ్వరరావు తీవ్ర నిరాశ, మనస్థాపానికి గురయ్యాడు. తీవ్ర క్షణికావేశంలో మాదిగ మోడల్ కాలనీలోని తన ఇంటికి చేరుకున్న అతడు, లోపలి నుంచి తలుపులకు గడియ పెట్టుకున్నాడు. అనంతరం ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ప్రాణాలు విడిచాడు.కొంతసేపటి తర్వాత గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి తగరం సిద్దయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) యాయాతి రాజు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తదుపరి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. నాన్న మరణించడం, తల్లి పుట్టింట్లో ఉండటంతో హాస్టల్లో చదువుకుంటున్న ఆ ఇద్దరు చిన్నారులు దిక్కులేని వారయ్యారని స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.

# నేడు కొత్తపల్లి పీఏసీఎస్ మహాజన సమావేశం



**కోటగిరి/ప్రజావాణి:**–కోటగిరి మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సమావేశం సోమవారం నిర్వహించనున్నారు. సంఘం అధ్యక్షులు డా. వెనిగళ్ళ సునీల్ కుమార్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనున్నట్లు పీఏసీఎస్ సీఈవో కమలేష్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశానికి సహకార సంఘం పరిధిలోని రైతులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు. సంఘం అభివృద్ధి కార్యక్రమాలు, వార్షిక నివేదికలు, భవిష్యత్ ప్రణాళికలు, సభ్యులకు అందే సేవలపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించనున్నట్లు సమాచారం.

# నేటి కలెక్టరేట్ ఎదుట ధర్నాకు తరలి రావాలి..

- కాంగ్రెస్ మండల అధ్యక్షులుయాదవ రెడ్డి



**ప్రజావాణి, నెల్లికుదురు :** ఎలక్షన్ కమిషన్ తీరని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపులో భాగంగా నేడు ( సోమవారం)ఉ. 10:30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా జయప్రదం కోసం తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసిసి అధ్యక్షురాలు భూక్యా ఉమా మురళీనాయక్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా రేపు మహబూబాబాద్ తహశీల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్ద భారీ నిరసన, ర్యాలీ, దిష్టిబొమ్మ దహన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, జిల్లా నాయకులు, గ్రామ సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఆటపాటలతో సందడిగా గణేష్ యువసేన వేడుకలు

- ఉత్తునూర్ శివారులో యువత ఉత్సాహం..
- ప్రత్యేక కార్యక్రమాలతో అలరించిన గణేష్ యువసేన యూత్



**సదాశివనగర్ సెప్టెంబర్ 27 (జనంసాక్షి)** సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ గ్రామ శివారులో గణేష్ యువసేన యూత్ ఆధ్వర్యంలో ఆటపాటల కార్యక్రమాలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి వేడుకల సందర్భంగా యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా యువత నిర్వహించిన వివిధ ఆటలు, పాటలు, వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యువకులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. సంప్రదాయ భక్తి వాతావరణంతో పాటు యువతలో ఐక్యత, స్నేహభావం పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించారు. గణేష్ యువసేన యూత్ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు, యువత సహకారంతో వేడుకలు ఘనంగా కొనసాగాయి. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపిన యువకులు కార్యక్రమాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు భక్తితో పాటు యువతలో ఐక్యత, సామాజిక స్ఫూర్తిని పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు.

# కారుకొండ రామవరంలో బౌద్ధ గుహల వద్ద ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026








**లక్ష్మీదేవిపల్లి/మన ప్రజావాణి (సెప్టెంబర్ 27):** లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరం బౌద్ధ గుహల వద్ద ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026 వేడుకలు విజయవంతం గా నిర్వహించబడ్డాయి. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లా పర్యాటక నోడల్ అధికారి బి. అనూష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) డిఆర్డిఓ ఎం. విద్యా చందన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కారుకొండ రామవరం సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు లక్ష్మీదేవిపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధ్యతాయుతమైన పర్యాటకం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సుస్థిర పర్యాటకం ప్రాధాన్యతను ప్రధానంగా వివరించారు. కారుకొండ రామవరం బౌద్ధ గుహలు, అక్కడి బౌద్ధ సాంస్కృతిక నిర్మాణాల చారిత్రక ప్రాధాన్యత, వాటి పరిరక్షణ ఆవశ్యకతపై బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు అవగాహన కల్పించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. విద్యార్థులలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పర్యావరణహిత జీవన విధానం, బాధ్యతాయుత ప్రవర్తనపై అవగాహన కల్పించేలా స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టారు. పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా ఉంచడంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కీలకమని ఈ సందర్భంగా వివరించారు. పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు భద్రత, మార్గదర్శకత్వం అందిస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి నిరంతరం సేవలందిస్తున్న టూరిజం పోలీసులను జిల్లా పర్యాటక నోడల్ అధికారి బి. అనూష ఘనంగా సత్కరించి, వారి అంకితభావాన్ని అభినందించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలన్నింటినీ బాధ్యతాయుతమైన, పర్యావరణహితమైన, సుస్థిరమైన పర్యాటకాన్ని ప్రోత్సహించే విధంగా నిర్వహించారు. చారిత్రక, సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను కాపాడుతూ, పరిశుభ్రతను పాటిస్తూ, స్థానిక సమాజ భాగస్వామ్యంతో పర్యాటక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా తెలియజేశారు.

# అంగన్వాడీ పోస్టుల భర్తీలో స్థానికతపై సందేహాలు!

- గమ్మాపూర్ తండా నుంచి మసల్గా తండాకు వివాహమై వచ్చిన మహిళ దరఖాస్తుపై చర్చ.. ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం, స్థానికత అర్హతలపై సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్







**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, తానూర్ సెప్టెంబర్ 27:–** నిర్మల్ జిల్లాలో అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఎస్టీ రిజర్వేషన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కుల ధ్రువీకరణ పత్రాలు, స్థానికత అర్హతలపై సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కుంటాల మండలం గమ్మాపూర్ తండాకు చెందిన ఓ ఎస్టీ మహిళ వివాహం అనంతరం తానూర్ మండలం మొగ్లీ గ్రామపంచాయతీలో మసల్గా తండాకు వచ్చి, అక్కడి అంగన్వాడీ టీచర్ పోస్టుకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె దరఖాస్తు అర్హతలపై స్థానిక ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

మొగ్లీ గ్రామపంచాయతీలో మసల్గా తండాలోని అంగన్వాడీ టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న మహిళకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రం ఏ ప్రాంతం ఆధారంగా జారీ అయింది? వివాహం అనంతరం మరో గ్రామానికి వచ్చిన మహిళకు సంబంధిత అంగన్వాడీ కేంద్రం పరిధిలో దరఖాస్తు చేసుకునే అర్హత ఉందా? స్థానికతకు సంబంధించి నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలకు ఆమె అర్హతలు సరిపోతున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

**కుల ధ్రువీకరణ పత్రాలపై అధికారుల పరిశీలన అవసరం**

అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీలో స్థానిక మహిళా అభ్యర్థులకే అవకాశం కల్పించాలనే నిబంధన నేపథ్యంలో, అభ్యర్థుల నివాస వివరాలు, కుల ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. గమ్మాపూర్ తండా నుంచి మొగ్లీ గ్రామపంచాయతీలో మసల్గా తండాకు వివాహం ద్వారా వచ్చిన మహిళ దరఖాస్తు విషయంలోనూ నిబంధనల ప్రకారం అర్హతలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే, సదరు మహిళ కుల ధ్రువీకరణ పత్రం తప్పుగా జారీ అయిందని లేదా ఆమె దరఖాస్తు అనర్హమైనదని ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదు. కేవలం స్థానికంగా వ్యక్తమవుతున్న సందేహాల ఆధారంగా ఎలాంటి నిర్ణయానికి రాకుండా, సంబంధిత రెవెన్యూ రికార్డులు, కుల ధ్రువీకరణ పత్రం, స్థానికత ఆధారాలను పరిశీలించిన అనంతరం వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

**అర్హులైన గిరిజన మహిళలకు న్యాయం చేయాలి**

ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఎస్టీ మహిళలకు కేటాయించిన పోస్టుల భర్తీ సందర్భంగా అర్హతల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్థానికులు పేర్కొంటున్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ, అభ్యర్థుల స్థానికత, రిజర్వేషన్ నిబంధనల అమలుపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఐసీడీఎస్ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, గమ్మాపూర్ తండా నుంచి మొగ్లీ గ్రామపంచాయతీలో మసల్గా తండాకు వివాహమై వచ్చిన మహిళ దరఖాస్తుతో పాటు సంబంధిత ఎస్టీ రిజర్వేషన్ పోస్టులకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ నిబంధనల ప్రకారం పరిశీలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అర్హతలు నిర్ధారించిన తర్వాతే నియామకాలు చేపట్టి, నిజమైన అర్హులైన గిరిజన మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతున్నారు.



ఫోటో క్యాప్షన్
అంగన్వాడీ టీచర్ పోస్టు దరఖాస్తులో స్థానికత, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంపై సందేహాలున్నాయని స్థానిక యువకుడు జాదా రాజు ఆరోపించారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం అర్హులైన మహిళలకే అంగన్వాడీ టీచర్ పోస్టులు కేటాయించాలని కోరారు.

# పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్న బియ్యం పథకం సంతృప్తినిచ్చింది

- గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదు.
- స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి.






**హుజూర్నగర్ సెప్టెంబర్ 27 (ప్రజావాణి)** పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్న బియ్యం పథకం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర భారీ నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హుజుర్నగర్ వి వి ఎం స్కూల్ లో హుజుర్నగర్, మఠంపల్లి మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం తమ ప్రభుత్వమని అన్నారు. దేశంలో అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పథకం అమలు కాలేదన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క తెల్ల రేషన్ కార్డు ఇవ్వలేదని వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక 16.32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. తెలంగాణలో మొత్తం కలిపి 1,06,28,092 రేషన్ కార్డులు ఉన్నాయని, దీంతో 3,42,57,109 మంది నిరుపేదలు ఆహార భద్రత లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం కలిపి 3,72,658 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. హుజుర్నగర్ నియోజకవర్గంలో మొత్తం రేషన్ కార్డుల 1,08,011 ఉండగా ఈ రోజు కొత్తగా హుజుర్నగర్ మండలంలో 21,395, మఠంపల్లి మండలంలో 16,203 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని మంత్రి అన్నారు. సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలకు కడుపునిండా భోజనం పెడుతున్నామని గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన దొడ్డుబియ్యం కోళ్ల ఫారాలు, బీర్ల తయారీ, రైస్ మిల్లర్లు అక్రమ వ్యాపారానికి స్కామ్ గా ఉపయోగపడ్డాయని తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డు ఇచ్చి, ప్రతి ఒక్క మనిషికి 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందిస్తున్నామని రాష్ట్రంలో 85% మంది జనాభా కు కడుపునిండా అన్నం పెట్టే పథకం పెట్టడం చాలా సంతృప్తినిచ్చిందని అన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ అర్హులై ఉండి ఎవరికైనా కార్డు రాని వారు రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నచో కొత్త రేషన్ కార్డు ఇప్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో పేరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ కే నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా దేశ్ ముఖ్, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ బచ్చు రామారావు, హుజూర్ నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై తనిఖీలు

- ఉపాధి హామీ నిధులపై ఆరోపణలు.. రామాపురంలో అధికారుల తనిఖీలు
- దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ నాయకుడు వెర్పుల రాజేష్



**చిలుకూరు, సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** చిలుకూరు మండలం రామాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆదివారం మండల స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సోషల్ ఆడిట్ గ్రామసభ నిర్వహించి పనులు, జాబ్‌కార్డులు, నిధుల వినియోగంపై వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెర్పుల రాజేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని కొంతమంది నాయకులు పక్కదారి పట్టించి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒకే కుటుంబంలో మూడు జాబ్‌కార్డులు ఎలా ఉన్నాయని, ఒక వ్యక్తి పేరుతో ఉన్న జాబ్‌కార్డుపై రూ. 27 వేల వరకు ఎలా డ్రా చేశారని అధికారులను ప్రశ్నించారు. అంతేకాకుండా 23-24,24-25 సంవత్సరాల ఆడిట్ లో కూడా కార్యదర్శి, తనిఖీ అధికారుల ప్రమేయంతో విషయం బయటికి రాకుండా చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారి, ఈసీ ప్రసాద్ స్పందిస్తూ.. ఆరోపణలపై అధికార యంత్రాంగం సమగ్రంగా దర్యాప్తు నిర్వహిస్తుందని తెలిపారు. విచారణలో అవకతవకలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, సోషల్ ఆడిట్ డీఆర్పీ తేజశ్రీ, బీఆర్పీలు గోపమ్మ, ఈసీ ప్రసాద్, వార్డు సభ్యులు గన్న కోటేష్ వర్మ, వెర్పుల రాజేష్, వేమూరి కృష్ణయ్య, మీసాల కిషోర్, మాజీ సర్పంచ్ గంగా లింగయ్య, వీరయ్య, బాబా, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామంగా భూపతిపూర్ ను తీర్చి దిద్దుతాం





**రాయికల్ ;సెప్టెంబర్ 27 (ప్రజావాణి):** పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని భూపతిపూర్ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొల్లె చిన్నయ్య వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామస్థులు, విద్యార్థుల భాగస్వామ్యంతో ఆదివారం గ్రామంలోని ప్రధాన వీధులు, రహదారుల వెంట పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు "ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి – పర్యావరణాన్ని కాపాడండి", "ప్లాస్టిక్ రహిత గ్రామమే మన లక్ష్యం" అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికి తిరిగి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల భూమి సారవంతం దెబ్బతింటుందని, పశువుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, భావితరాలకు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉపాధ్యాయుడు బొల్లె చిన్నయ్య వివరించారు. ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గుర్రం భావన మహేందర్, ఉప సర్పంచ్ మూగల సంజీవచారి లాంఛనంగా ప్రారంభించారు. ఇటువంటి ఉపయోగకరమైన కార్యక్రమం చేపట్టినందుకు ఉపాధ్యాయుడు చిన్నయ్యను, విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కడకుంట్ల ఆదిత్యరాజ్, ఎస్ఎంసి మాజీ చైర్మన్ జక్కుల రాజేంద్ర ప్రసాద్, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్ అన్నవేణి వేణు, నాయకులు కొమురయ్య, సోమా రమేష్ రెడ్డి, మారంపెల్లి సత్యనారాయణ, కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, చెట్పల్లి మారుతీ, వేంకటాద్రి, అయోధ్య సర్పంచ్ గంగాధర్, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టార్గెట్‌ను మించి ఉల్లాస్ పరీక్షకు మహిళల స్పందన!

- నిర్మల్ జిల్లాలో 93 శాతం హాజరు.. 16,384 మందికి గాను 15,037 మంది పరీక్షకు హాజరు
- -- పలు కేంద్రాలను పరిశీలించిన డీఈవో భోజన్న





**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, సెప్టెంబర్ 27:--** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఉల్లాస్--నవ భారత సాక్షరతా కార్యక్రమం ( ఎఫ్. ఎల్. ఎన్--ఏ) పరీక్షకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం వయోజన విద్యాశాఖ, మెప్మా, డి ఆర్ డి ఏ.(సెర్ప్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షకు నిర్దేశించిన లక్ష్యానికి చేరువగా మహిళలు హాజరై తమలోని చదువుకోవాలనే ఆసక్తిని చాటుకున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 16,384 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, ఇప్పటివరకు 15,037 మంది హాజరయ్యారు. దీంతో 93 శాతం హాజరు నమోదైంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, సర్పంచ్ దూమల రాజు, వయోజన విద్యాశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి జి. శ్రీనివాస్‌రెడ్డి (నిజామాబాద్), డి ఆర్ డి ఏ. డి పి ఎం.శోభారాణి, సి ఎం ఓ, ఎన్. ప్రవీణ్‌కుమార్ నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్ మండలంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించారు. నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ నగర్, సాయినగర్ పరీక్షా కేంద్రాల్లో మైనారిటీ మహిళలు పెద్ద సంఖ్యలో పరీక్షకు హాజరయ్యారు. శాంతినగర్ కేంద్రంలోనూ నిర్దేశించిన లక్ష్యానికి మించి హాజరు నమోదైంది. నిర్మల్ రూరల్ మండలం కౌట్ల (కె) గ్రామంలో 145 మంది మహిళలు పరీక్ష రాయడం విశేషం. ఈ కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ దూమల రాజు మహిళలకు చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా డీఈవో భోజన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకొని అక్షరాస్యత సాధించాలని పిలుపునిచ్చారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేందుకు విద్య దోహదపడుతుందని తెలిపారు. చదువుపై ఆసక్తితో పరీక్షకు హాజరైన మహిళలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, అనంతరం ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. ఉల్లాస్ పరీక్ష విజయవంతానికి కృషి చేసిన ఏపి ఎం. అరుణ, టీ ఎం సి. సావిత్రి, ప్రధానోపాధ్యాయురాలు షాహీదా పర్వీన్‌తో పాటు వి ఓ ఏలు, మెప్మా, సెర్ప్ సిబ్బందిని డీఈవో భోజన్న అభినందించారు. జిల్లాలో వయోజన విద్యకు మహిళల నుంచి లభించిన స్పందన పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# పితృవియోగంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి

- వడ్డేమాన్ రామకృష్ణ ఆధ్వర్యంలో 60 మంది బిఆర్ఎస్ కార్యకర్తల హాజరు



**చిన్నంబావి ప్రజావాణి సెప్టెంబర్ 27** కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి పెద్దకర్మ కార్యక్రమానికి చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామం నుంచి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వడ్డేమాన్ రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. గ్రామానికి చెందిన వడ్డేమాన్ రామకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 60 మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రత్యేకంగా బయలుదేరి, పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. "కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన అనుబంధం" బీరం లక్ష్మారెడ్డి మృతితో తీవ్ర విషాదంలో ఉన్న బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, వారి దుఃఖంలో భాగస్వాములయ్యారు. కొప్పునూరు గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరై తమ అభిమానాన్ని, ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వడ్డేమాన్ రామకృష్ణ ఆధ్వర్యంలో తరలివెళ్లిన కార్యకర్తలు బీరం లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.కొప్పునూరు నుంచి 60 మంది కార్యకర్తలు వాహనలలో తరలివెళ్లడం స్థానికంగా ప్రత్యేకంగా నిలిచింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల పక్కనే 'మద్యం' షాపులు.. నిబంధనలు నీళ్లపాలు!

- బడులు, నివాసాల కూతవేటు దూరంలోనే వైన్స్ నిర్వహణ
- పక్కనే విచ్చలవిడిగా బెల్ట్ షావులకు అక్రమ మద్యం సరఫరా
- ఎక్సైజ్ కాగితాలకే పరిమి తమైన చట్టాలు.. పట్టించుకోని అధికారులు



**జైపూర్, సెప్టెంబర్ 27,ప్రజావాణి:**చట్టాలు, నిబంధనలు అనేవి కేవలం పుస్తకాలకే పరిమితమని నిరూపిస్తున్నాయి జైపూర్ మండలంలోని కొన్ని మద్యం షాపుల యాజమాన్యాలు. పాఠశాలలకు, ప్రజలు నివసించే ఇండ్లకు కూతవేటు దూరంలోనే నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ షాపులు నడుపుతున్నా అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు బడుల పక్కనే మద్యం విక్రయాలు సాగిస్తుండగా, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోని బెల్ట్ షాపులకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ విచ్చలవిడిగా దందా సాగిస్తున్నారు.

అసలు చట్టం, నిబంధనలు ఏం చెప్తున్నాయి?

తెలంగాణ ఎక్సైజ్ శాఖ నిబంధనలు, చట్టం ప్రకారం..

దూరం నిబంధన: పాఠశాలలు, కళాశాలలు, గుళ్ళు–గోపురాలు (దేవాలయాలు), ప్రార్థనా మందిరాలు మరియు బస్ స్టాండ్లకు కనీసం 100 మీటర్ల దూరంలో మద్యం షాపులు ఉండాలి.

నివాస ప్రాంతాలు : సాధారణ ప్రజానీకానికి, ముఖ్యంగా మహిళలకు ఇబ్బంది కలిగించేలా ప్రధాన రహదారుల పక్కన, ఇండ్ల మధ్యలో వైన్స్ షాపుల నిర్వహణ పూర్తిగా నిషేధం.

అక్రమ సరఫరా నేరం: వైన్స్ నిర్వాహకులు కేవలం షాపు వద్ద మాత్రమే మద్యం విక్రయించాలి. గ్రామాల్లోని బెల్ట్ షాపులకు లేదా ఇతర నిల్వ కేంద్రాలకు మద్యం బాటిళ్లను హోల్‌సేల్‌గా, అక్రమంగా సరఫరా చేయడం కఠినమైన నేరం. ఇలాంటి చర్యలకు పాల్పడితే వైన్స్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

చట్టం బొందపెట్టి.. వ్యాపారమే పరమావధిగా!

అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఈ చట్టాలన్నీ తుంగలో తొక్కేశారు. విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దుకునే పాఠశాలల పక్కనే వైన్స్ షాపులు వెలిశాయి. బడికి వెళ్లే చిన్న పిల్లల ముందే మందుబాబుల తాకిడి, అసభ్యకర ప్రవర్తన దర్శనమిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఇండ్ల మధ్యలోనే షాపులు నిర్వహిస్తుండటంతో నివాస ప్రాంతాల ప్రజలు, మహిళలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయాందోళనలకు గురవుతున్నారు.

ఊరూరా బెల్ట్ షాపులకు అక్రమ రవాణా!

ఇది చాలదన్నట్లు, వైన్స్ యజమానులు తమ అమ్మకాలు పెంచుకోవడమే లక్ష్యంగా మండలంలోని ప్రతి గ్రామానికి మద్యం సీసాలను యథేచ్ఛగా సరఫరా చేస్తున్నారు. రోజూ ఉదయాన్నే ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో బెల్ట్ షాపులకు అక్రమంగా మద్యం బాటిళ్లను చేరవేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కిరాణా కొట్లు, పాన్ డబ్బాలలో కూడా మద్యం విచ్చలవిడిగా లభ్యమయ్యేలా చేస్తూ గ్రామీణ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తూ పేదల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారు. చర్యలు ఏవి?

పాఠశాలలు, నివాస గృహాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వైన్స్ షాపులను తక్షణమే ఇక్కడి నుంచి తరలించాలని, గ్రామీణ ప్రాంతాలకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న వైన్స్ నిర్వాహకులపై, బెల్ట్ షాపుల నిర్వాహకులపై ఎక్సైజ్, పోలీస్ ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# పస్రాలో డ్రంక్ అండ్ డ్రైవ్ పై అవగాహన

- ఎస్ఐలు తాజుద్దీన్, అంజనేయులు.



**గోవిందరావుపేట సెప్టెంబరు 27 ( ప్రజావాణి)-:**ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా లో ఆదివారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, కలిగే నష్టాలపై వాహనదారులకు ఎస్ఐ లు తాజుద్దీన్ అంజనేయులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.మద్యం తాగి వాహనం నడపడం చట్టరీత్యా నేరం ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం సేవించి వాహనం నడపడమే– మీ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలకు కూడా ముప్పు.డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే కఠిన చర్యలు, జరిమానా, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి, హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు పోవాలి : మాజీ ఎమ్మెల్యే గండ్ర






**భూపాలపల్లి, సెప్టెంబర్ 27( మన ప్రజావాణి):**తెలంగాణ కార్మికులు, ముఖ్యంగా సింగరేణి బొగ్గు గని కార్మికుల సంక్షేమం కోసం గతంలో కేసీఆర్ నాయకత్వంలో అనేక కీలక నిర్ణయాలతో ఎంతో మంది కార్మికులకు మేలు జరిగిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు.శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ( టిబి జీకేస్) ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, సింగరేణి కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ... సింగరేణి సంస్థను పరిరక్షించడంతో పాటు కార్మికుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సింగరేణి భవిష్యత్తు బాగుండాలంటే కార్మికుల సమస్యలను బలంగా ప్రశ్నించే గుర్తింపు పొందిన కార్మిక సంఘం అవసరమని పేర్కొన్నారు.గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. ఎన్నికల నిర్వహణపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, కోర్టు తీర్పు అనంతరం ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.ఎన్నికలు ఎప్పుడు జరిగినా కార్మికుల సమస్యలపై పోరాడేందుకు టీ బి జి కే ఎస్ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. గత నెలల్లో మూడు సింగరేణి గనులలో కార్మికులను కలిసినప్పుడు వారు తమ సమస్యలను వివరిస్తూ, కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి, కార్మిక సంక్షేమం కోసం జరిగిన కార్యక్రమాలను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు.సింగరేణి సంస్థ బలోపేతం కావాలి, కార్మికుల హక్కులు కాపాడబడాలి, కార్మికుల భవిష్యత్తుకు భద్రత కల్పించాలి అనే లక్ష్యంతో టీ బి జీకేస్ కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో ప్రతి అర్హుడూ భాగస్వామి కావాలి - ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి పిలుపు



**జనగామ జిల్లా ప్రతినిధి, (పాలకుర్తి) సెప్టెంబర్ 27(ప్రజావాణి):** పాలకుర్తి నియోజకవర్గంలోని పట్టభద్రుల యువత, ఉద్యోగులు, విద్యావంతులందరూ నేటి నుంచి ప్రారంభమయ్యే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమంలో తప్పనిసరిగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.భారత ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 2027 మార్చిలో జరగనున్న వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియ సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభం కానుందన్నారు.ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇప్పటికే జాబితాలో పేరు ఉన్నవారు సైతం కొత్తగా ఫారం–18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత పత్రాలను జత చేయాలన్నారు.గడువులోగా పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ం

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్



**భూపాలపల్లి, సెప్టెంబర్ 27 ( ప్రజావాణి):**ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అన్నారు.ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆదివారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సేవ, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని అన్నారు. స్వాతంత్ర్యోద్యమంతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సమాజ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, ఆర్ఐ రత్నం, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు అర్పించారు.

# దేవాలయాల నిర్మాణాన్ని శెట్టి సురేష్ నాయుడు అడ్డుకోలేదు

- గతంలో చేసిన ఆరోపణలు అవాస్తవం.. బహిరంగంగా క్షమాపణ చెప్పిన ఆలయ నిర్వాహకుడు సాయిబాబు
- అక్రమ నిర్మాణమైన బ్రిడ్జిని అడ్డుకున్నాడు తప్ప దేవాలయాల నిర్మాణాన్ని కాదు...
- గ్రామస్థులు,మీడియాతో కూచిపూడి దేవాలయాల నిర్వాహకులు కందికొండ సాయిబాబు.





**కోదాడ (కూచిపూడి) సెప్టెంబర్ 27ప్రజావాణి):** దేవాలయాల నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారంటూ మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు, ఆయన వంశస్థులపై గతంలో తాను చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కూచిపూడి దేవాలయాల నిర్వాహకులు కందికొండ సాయిబాబు స్పష్టం చేశారు. వ్యక్తిగత దురుద్దేశంతోనే తాను ఆ ఆరోపణలు చేశానని, అందుకు శెట్టి సురేష్ నాయుడు, ఆయన వంశస్థులకు గ్రామస్థులు, మీడియా సమక్షంలో బహిరంగ క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపారు.కూచిపూడిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ.. అంతరగంగా వాగుపై పట్టాదారులైన శెట్టి వారి వంశస్థుల అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ బ్రిడ్జిని మాత్రమే వారు అడ్డుకున్నారని, దేవాలయాల నిర్మాణాన్ని మాత్రం ఎప్పుడూ వ్యతిరేకించలేదన్నారు. అయితే బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకోవడాన్ని దేవాలయాల నిర్మాణానికి అడ్డంకిగా భావించి తాను గతంలో తప్పుడు ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు.దేవాలయాలకు స్థలం వితరణ చేసింది కూడా శెట్టి వారి వంశస్థులేనని, అది వారి పట్టా భూమి అని తెలిపారు. ఆ భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అధికారులను ఆశ్రయించడం, శెట్టి వారి వంశస్థులపై తప్పుడు కేసులు పెట్టించడం, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడం తన తప్పేనని సాయిబాబు పేర్కొన్నారు.దేవాలయాల నిర్మాణం నిలిచిపోవడానికి సంబంధించి వాస్తవాలను తెలుసుకున్న అనంతరం ఆత్మపరిశీలన చేసుకున్నానని, ఎవరి ఒత్తిడి లేకుండా తన తప్పును అంగీకరిస్తున్నట్లు చెప్పారు. దేవాలయాలకు స్థలం ఇచ్చిన శెట్టి వారి వంశస్థులకు కృతజ్ఞతగా నూతన ఆలయాల వద్ద ఆర్చిని నిర్మించి వారి పేరు శాశ్వతంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే శెట్టి వారిని ఆలయ కమిటీ చైర్మన్‌గా చేయనున్నట్లు తెలిపారు.అనంతరం నూతన దేవాలయాల వద్ద నిర్మించనున్న ఆర్చికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల అక్షరాస్యత కోసం "ఉల్లాస్" కార్యక్రమం



**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి**మంథని మండలం కన్నాల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఈరోజు స్వయం సహాయక సంఘాల మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో "ఉల్లాస్" కార్యక్రమం నిర్వహించారు.మహిళా సంఘాల్లోని ప్రతి ఒక్క మహిళ అక్షరాస్యురాలిగా ఉన్నప్పుడే సంఘాలు మరింత అభివృద్ధి చెందుతాయని గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాయని తెలిపారు.ప్రతి ఒక్క మహిళ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని అక్షరాస్యులుగా మారాలని సర్పంచ్ సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్, సీఏ కోమలత, మహిళా సంఘ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

సోమవారం, సెప్టెంబర్ 28, 2026 | మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ | 15

# తాళ్లపేట ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**దండేపల్లి: సెప్టెంబర్ 27 ( ప్రజావాణి )** మండలంలోని తాళ్లపేట మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో తాళ్లపేటలో ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల దుర్గప్రసాద్ గారు కార్యక్రమంలో పాల్గొని మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల దుర్గప్రసాద్ మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కుట్టు మిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుట్టుపని ద్వారా ఉపాధి పొందాలని, తమ కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో మండల మైనారిటీ అధ్యక్షులు నిహాల్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనాలు

- 17 గ్రామ పంచాయతీల్లో 103 విగ్రహాల నిమజ్జనం.. పోలీసులపర్యవేక్షణ





**చిన్నంబావి, ప్రజావాణి సెప్టెంబర్ 27** చిన్నంబావి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన సుమారు 103 వినాయక విగ్రహాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిమజ్జనం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి, ఆయా గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 20 మంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొని నిమజ్జన కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించారు. నిమజ్జన ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎస్సై రామన్‌గౌడ్ తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు, మండల ప్రజలు పోలీసులకు అందించిన సహకారం అభినందనీయమన్నారు. నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎస్సై కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం..



**ప్రజావాణి,నెల్లికుదురు:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆలేరు హై స్కూల్లో 1985-86 విద్యా సంవత్సరంకు చెందిన 10వ, తరగతి పూర్వ విద్యార్థులు నర్సింహుల గూడెం శ్రీ కోరగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఆవరణంలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ బిజీ లైఫ్ ను పక్కన పెట్టి తాము విద్యాభ్యాసం చేసిన చదువులపల్లి హైస్కూల్ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అంతకుముందు వారు ఒకరినొకరు ఎక్కడెక్కడ ఉంటున్నారు? ఏమేం చేస్తున్నారు? పిల్లలు చదువుతున్నారా? ఉద్యోగం చేస్తున్నారా?ఆర్థిక,ఆరోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయి? అంటూ కుశల ప్రశ్నలు వేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధుల తో పాటు జీవిత పాఠాలు నేర్పిన నాటి గురువులు ఘట్టం లక్ష్మీ నరసయ్య,రమేష్ రెడ్డి ,మోహన్ రావు,రాజమౌళి,సంజీవరెడ్డి లను ఘనంగా సన్మానించి,పాద నమస్కారం చేశారు. అనంతరం ఉత్సాహభరితంగా ఆటపాటలు నిర్వహించుకొని,సామూహిక విందు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నర్సింహుల గూడెంకు చెందిన ప్రజా వైద్యులు ఆర్ఎంపి డా.చలమల్ల వెంకటేశ్వర్లు తో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాటి స్టూడెంట్స్ తాడూరు బాలకిషన్,కాలేరు లక్ష్మీనారాయణ,డా.కాలేరు సత్యనారాయణ,కానిస్టేబుల్ నిరంజన్,నరేందర్, రాములు, శంకరయ్య,వెంకన్న,శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీపురం సర్పంచ్ ప్రేమలీల,శ్రీదేవి, కట్టయ్య, రమాదేవి,పి వినోద తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్ల ఎంపికలో అవకతవకలు.

- పారదర్శకంగా విచారణ జరిపించాలని అభ్యర్థుల డిమాండ్.



**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** మంతని మండలం ఖాన్ సాయి పేట గ్రామానికి చెందిన మెరుగు ప్రసాద్ మాట్లాడుతూ మంథని నియోజకవర్గ పరిధిలో జరిగిన అంగన్వాడి టీచర్ల నియామకానికి నిర్వహించిన ఇంటర్వ్యూలో అవకతవకలు జరి గాయని అనుమానాలు ఉన్నాయి నా భార్య తోకల స్వరూప కు మెరిట్ మార్కులు ఉండగా (జనరల్) అదే గ్రామానికి చెందిన బీసీ వర్గానికి చెందిన మహిళకు మెరిట్ మార్కులు లేకున్నా నియామకం చేసినారు అర్హతలు మెరిట్ ఆధారంగా కాకుండా ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించలేదని కొంతమంది అభ్యర్థులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇంటర్వ్యూ ప్రక్రియలో పూర్తిస్థాయి విచారణ జరిపి అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను అంగన్వాడి టీచర్ల నియామకాలపై మంథని సిడిపిఓ ను వివరణ అడగగా అంగన్వాడి టీచర్ల నియమాకాలు పారదర్శకంగానే జరిగాయని ఏ లాంటిగా అవకతవకలు జరగలేదని అన్నారు

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు బహుజనులంతా ఐక్యంగా ఉద్యమించాలి



**భూపాలపల్లి, సెప్టెంబర్ 27 (ప్రజావాణి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ కొత్తూరి రవీందర్ మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించడం డాక్టర్ విశారదన్ మహారాజ్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. సమాజంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలంతా విశారదన్ మహారాజ్‌తో కలిసి నడిచి, తెలంగాణ రాష్ట్రాన్ని నూతన స్వర్గంగా తీర్చిదిద్దేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బహుజన రాజ్యాధికార సాధన కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలంతా ఐకమత్యంతో ఏకం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కనకం మల్లయ్య, బొయిని జగన్, మిట్టపల్లి కుమారస్వామి, గుడిపెల్లి జాన్సన్, జెరిపోతుల సనత్, బొగి బాపు, రేనుకుంట్ల మహేష్, పింగిలి వంశీ, బండారి దశరథం, బొయిని ప్రసాద్, మంద ప్రవీణ్, క్యాతం మహేందర్, అడ్డగట్ల శ్రీధర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించండి..

- బిఆర్ఎస్, బిజెపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టండి.
- కాంగ్రెస్ శ్రేణులకు డిసిసి అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న పిలుపు..





**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (సెప్టెంబర్ 27):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యుల సమావేశం కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో ఉన్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షత వహించిన తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రగతి కోసం, ప్రజల అభ్యున్నతి కోసం, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామ గ్రామాన ప్రతి ఇంటికి వివరించి, కాంగ్రెస్ పార్టీని మరింత అభివృద్ధి చేయాలని ప్రజా ప్రభుత్వంపై ఓర్వలేక బిఆర్ఎస్, బిజెపి చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఆళ్ళ మురళి మాట్లాడుతూ సర్ ప్రోగ్రాం పేరుతో దేశంలో రాష్ట్రంలో కోట్లాదిమంది ఓట్లు తొలగిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ ను పదవి నుండి తొలగించాలని, ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని రక్షించాలని, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సాగిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా 28వ తేదీ రోజు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఆఫీస్ ఇంచార్జీలకు, కార్యవర్గ సభ్యులకు, వివిధ మండలాల బాధ్యతలు అప్పగిస్తూ, పని విభజన చేశారు. ఈ సమావేశంలో డిసిసి అధికార ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ వ్యవస్థనే అబ్బురపరిచిన కవలలు!




**తెలంగాణ స్టేట్ బ్యూరో/మన ప్రజావాణి (సెప్టెంబర్ 28):** డిజిటల్ యుగంలో ప్రతి పౌరుడికీ 'ఆధార్' ప్రాథమిక గుర్తింపుగా మారింది. వేలిముద్రలు, కంటిపాప (ఐరిస్) స్కాన్ల ఆధారంగా డిజిటల్ సిస్టమ్ ప్రతి ఒక్కరినీ విడివిడిగా గుర్తిస్తుంది. అయితే, ప్రకృతి సృష్టించిన ఒక అరుదైన పోలిక ఆధార్ కి సవాలుగా నిలిచింది. ఉత్తర ప్రదేశ్ లోని రాంపూర్ కు చెందిన 10వ తరగతి కవలలు ఖిజ్రా జుబేర్, తూబా జుబేర్ల విషయంలో నమోదైన ఘటన సాంకేతిక నిపుణులను ప్రభుత్వ యంత్రాంగాన్ని విస్మయానికి గురిచేసింది. సాధారణంగా ఒకే రూపం ఉన్న కవలల్లో (ఐడెంటికల్ ట్విన్స్) సైతం వేలిముద్రలు లేదా కంటిపాప అమరికలో స్వల్ప తేడాలు ఉంటాయి. కానీ, రాంపూర్ కవలల విషయంలో వారి వేలిముద్రలు, ఐరిస్ స్కాన్లు 100 శాతం ఒకేలా సరిపోలాయి. దీంతో పదో తరగతి బోర్డు పరీక్షల రిజిస్ట్రేషన్ కోసం బయోమెట్రిక్ అప్డేట్ చేస్తుండగా, ఒకరి అప్డేట్ పూర్తవ్వగానే మరొకరి దరఖాస్తును యూఐడీఏఐ సిస్టమ్ డూప్లికేట్గా గుర్తిస్తూ తిరస్కరించింది. ఈ సమస్య మూలంగా విద్యార్థినుల విద్యా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పరిష్కారం లభించిందిలా..బాధిత కుటుంబం రాంపూర్ జిల్లా మేజిస్ట్రేట్ (డీఎం) అజయ్ కుమార్ ద్వివేదిని ఆశ్రయించింది. ఈ అరుదైన కేసును ప్రత్యేకమైనదిగా పరిగణించిన డీఎం వెంటనే స్పందించి యూఐడీఏఐ న్యూఢిల్లీ ప్రధాన కార్యాలయం, లఖ్‌నవూ ప్రాంతీయ కార్యాలయాల అధికారులతో సమన్వయం చేశారు. సంస్థ సాంకేతిక విభాగం ఈ ఘటనను లోతుగా పరిశీలించి ప్రత్యేక సాంకేతిక నిబంధనలు, మాన్యువల్ వెరిఫికేషన్ ప్రక్రియ ద్వారా దాదాపు మూడు నుంచి నాలుగు నెలల పాటు కృషి చేసి పాత రికార్డులను సరిదిద్ది ఇద్దరికీ వేర్వేరుగా ఆధార్ గుర్తింపులను కేటాయించింది. అత్యాధునిక బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ వ్యవస్థలు అత్యధిక శాతం పక్కాగా పనిచేసినప్పటికీ ఇటువంటి అత్యంత అరుదైన మినహాయింపులు సాంకేతిక వ్యవస్థ పరిమితులను తెలియజేస్తున్నాయి. సమయానుకూలమైన అడ్మినిస్ట్రేటివ్ జోక్యంతో సాంకేతిక సమస్యను అధిగమించి కవలల చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా అధికార యంత్రాంగం పరిష్కారం చూపడం అభినందనీయమని కొందరు చెబుతున్నారు.

# పస్రాలో పోలీసుల ప్రత్యేక తనిఖీలు

- సిఐ దయాకర్, ఎస్సైలు తాజుద్దీన్, అంజనేయులు.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-**ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. సాయంత్రం వేళ పస్రా ప్రధాన కూడలిలో ఈ తనిఖీలు నిర్వహించారు. సీఐ దయాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ తాజుద్దీన్, ఎస్ఐ అంజనేయులు తనిఖీలు చేశారు. ప్రయాణికులను తరలిస్తున్న గూడ్స్ క్యారియర్ వాహనాలను గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలన్నింటినీ సీజ్ చేశారు. అలాంటి వాహనాల డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడవద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు. అదే సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక దృష్టి పెట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను గుర్తించారు. తాగి ఉన్న డ్రైవర్లను వెంటనే వాహనం నడపకుండా ఆపారు. వారి స్థానంలో మత్తులో లేని ఇతర డ్రైవర్లను ఏర్పాటు చేశారు. మద్యం తాగి వాహనం నడపడం ప్రాణాలకు ముప్పు అని వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ తో వాహనాలు నడపవద్దని చెప్పారు. ఇలాంటి తనిఖీలు రోజూ కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పస్రా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగూడలో ఘనంగా 'అమ్మకు అక్షరమాల'..

- ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ



**కొత్తగూడ మండల ప్రతినిధి.:- సెప్టెంబర్ 27. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, గ్రామాలలోని మహిళలు, వయోధికులు అక్షరాస్యులు గా మారినప్పుడే సమగ్ర సమాజ వికాసం సాధ్యం అవుతుందని, కొత్తగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం తో చేపట్టిన, నవభారత్ సాక్షరతా కార్యక్రమం (ఉల్లాస్) లో భాగంగా, కొత్తగూడ పంచాయతీ పరిధిలోని మైలారం గ్రామంలో "అమ్మకు అక్షరమాల" ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, పెద్దలకు అక్షరాభ్యాసం చేయించి, చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ మాట్లాడుతూ.. అక్షర జ్ఞానం అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, వయస్సుతో నిమిత్తం లేకుండా చదువుకోవాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని పిలుపును ఇచ్చారు. గ్రామంలోని స్వయం సహాయక సంఘాల (పొదుపు సంఘాల) మహిళలు తమ సమావేశాలు నిర్వహించుకోవడానికి, ఆర్థిక లావాదేవీలు క్రమబద్ధీకరించుకోవడానికి వివో బిల్డింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వివో భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకువస్తామని, మహిళా సమాఖ్యల బలోపేతానికి పంచాయతీ నిధులు అలాగే సహకారం ఎల్లప్పుడూ ఉంటాయని ఆమె హామీ ఇచ్చారు. ?మహిళా సాధికారతే లక్ష్యం. ఇంటికి దీపం ఇల్లాలు అయితే, ఆ ఇల్లాలు చదువుకుంటే ఆ కుటుంబమంతా వెలుగుతుందన్నారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, పొదుపు సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి, వ్యాపార అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని, వారి సాధికారత కోసమే పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రతి ఇంట్లో నిర్మించుకున్న మరుగుదొడ్లను క్రమం తప్పకుండా వినియోగించాలని సర్పంచ్ భాగ్యమ్మ గ్రామస్తులను కోరారు. బహిరంగ మల విసర్జన వల్ల వచ్చే రోగాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం లో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని అన్నారు. ?ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ఉపాధ్యాయులు, నవభారత్ సాక్షరతా కార్యక్రమ సమన్వయకర్తలు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, వివో ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంఈఓ సలీం షరీఫ్‌కు ఘన సత్కారం

- స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ యజ్ఞం..




**కోదాడ, సెప్టెంబర్ 27/ ప్రజావాణి** ఉత్తమ రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కోదాడ మండల విద్యాధికారి (ఎంఈఓ) సలీం షరీఫ్‌ను స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విద్యా రంగంలో ఆయన అందిస్తున్న నిరంతర సేవలను గుర్తిస్తూ ఆదివారం పట్టణంలో ఈ చిరు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ చీఫ్ అడ్వైజర్ పైడిమర్రి సత్య బాబు, కోదాడ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పందిరి సత్యనారాయణ, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు రాయపూడి వెంకట నారాయణ, ట్రస్ట్ కోఆర్డినేటర్ వంగవీటి రంగారావు మాట్లాడుతూ.. సలీం షరీఫ్ సేవలు అభినందనీయమన్నారు. సమాజంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యతకార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ ప్రముఖుల చేతుల మీదుగా మొక్కలు నాటే యజ్ఞాన్ని చేపట్టారు. ట్రస్ట్ సభ్యులు స్వయంగా మొక్కలు నాటి, పచ్చదనాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ వేడుకలో ట్రస్టు సభ్యులు చిట్టిప్రోలు నారాయణ, అన్నం వరప్రసాద్, స్వామి శ్రీనివాస రావు సహా పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన పెద్దలందరికీ ట్రస్ట్ నిర్వాహకులు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# మూడో విడత ఇందిరమ్మ డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివసిస్తున్న పేదలకు న్యాయం చేయాలి-

**● సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి**

**జనగామ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27(ప్రజావాణి):** జనగామ పట్టణంలో మూడో విడత ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు కోల్పోయిన 72 మంది పేదలకు గత ప్రభుత్వం డ్రా ద్వారా డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించిందని, వారు అక్కడే నివాసం ఉంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి తెలిపారు.

జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణ కార్యదర్శి ఉద్యోగ ప్రకాష్ అధ్యక్షత వహించారు.

కనక రెడ్డి మాట్లాడుతూ

13 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం 1146 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది. సీపీఎం సహకారంతో వారు చిన్న ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో



కొన్ని స్థలాలు తీసుకొని జీం2 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. 2023లో స్థలం కోల్పోయిన 72 మందికి డ్రా ద్వారా ఆ ఇళ్లు కేటాయించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ అధికారులు గత కేటాయింపులు చెల్లవని చెప్పి, నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు మళ్లీ డ్రా తీసి ఇతరులకు కేటాయించడం సరికాదన్నారు. దీని వల్ల పేదల మధ్య ఘర్షణలు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

560 మంది చిన్న ఇళ్లు నిర్మించుకొని ఉంటున్న వారికి వెంటనే ఇంటి నంబర్లు వేసి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఈ సమస్యపై జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రెండుసార్లు కలిసి విన్నవించామని, రాష్ట్ర నాయకత్వం ద్వారా మెమోరాండం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా మంత్రి జోక్యం చేసుకొని పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు బాల్నే వెంకట మల్లయ్య, కళ్యాణం లింగం, పాము శ్రీకాంత్, పగిడిపల్లి బాలమణి, ఎర్ర రజిత, మునిసిపట్ల జయ, మాదాసి సుధాకర్, గంపల సురేష్, కొమ్మగళ్ల ఎల్లయ్య, రాజు, కుమార్ రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శాలు భావి తరాలకు మార్గదర్శకం: రవి పటేల్





**భూపాలపల్లి, సెప్టెంబర్ 27 (మన ప్రజావాణి):** తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలకు ఊపిరిపోసి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, చేనేత రంగానికి మహోన్నత సేవలు అందించిన అమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ... "స్వరాష్ట్ర సాధన కోసం, తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన మంత్రి పదవినే తృణప్రాయంగా త్యాగం చేసిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ. పదవుల కన్నా ప్రజల ఆకాంక్షలే ముఖ్యమని నిరూపించిన ఆయన త్యాగనిరతి, పోరాట పటిమ మనందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలు మరియు చేనేత కార్మికుల హక్కుల కోసం బాపూజీ చేసిన కృషి అపారమైనదని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాపూజీ చూపిన మార్గంలో పయనిస్తూ, సామాజిక న్యాయం సాధించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి

**● అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు - పెండింగ్ బిల్లులు వెంటనే విడుదలకు కృషి**

**ప్రజావాణి వార్త** సమాజంలో నాలుగో స్తంభంగా నిలిచి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (TWJF) మూడవ మహాసభలు, డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ముగిసిన అనంతరం ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను TWJF నాయకులు, జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ దీర్ఘకాలిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే...

జర్నలిస్టుల వినతిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి మాట్లాడుతూ, గతంలో ఇళ్లు మంజూరై నిర్మాణం పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడం



బాధాకరమని అన్నారు. అలాంటి వారికి వెంటనే బిల్లులు మంజూరు అయ్యేలా కలెక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన ప్రాసెస్ ఇప్పటికే ప్రారంభమైందని, త్వరలోనే శుభవార్త వింటారని తెలిపారు.

అలాగే ఇళ్లు నిర్మించుకున్న వారికి మున్సిపల్ అనుమతులు రాక ఇబ్బందులు పడుతున్నారని జర్నలిస్టులు చెప్పగా, వారికి కూడా వెంటనే అనుమతులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

కొత్త వారికి ప్లాట్లు, ఇందిరమ్మ ఇళ్లు...

నియోజకవర్గంలో కొత్తగా జర్నలిజంలోకి వచ్చి ఇప్పటి వరకు ఎలాంటి ప్రభుత్వ సహాయం పొందని అర్హులైన జర్నలిస్టులందరినీ గుర్తించాలని అన్నారు. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే వారికి ఉచితంగా స్థలాలు కేటాయించి, అందులో ఇందిరమ్మ ఇళు ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వ భూమి అందుబాటులో లేని పక్షంలో, జర్నలిస్టులు సొంతంగా ప్రైవేట్ స్థలం కొనుగోలు చేసుకున్నా, వారికి ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన...

ఇప్పటికే జర్నలిస్టులకు కేటాయించిన కాలనీలలో రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే, వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

జర్నలిస్టులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, తాను ఎల్లప్పుడూ జర్నలిస్టులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ సమావేశంలో ఆత్మ చైర్మన్ వినోద్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, TWJFజిల్లా, డివిజన్ నాయకులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన TWJF కార్యవర్గ సభ్యులందరినీ ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# తెలంగాణ ఉద్యమంలో కలికితురాయి కొండా లక్ష్మణ్ బాపూజీ.



**కోదాడ సెప్టెంబర్ 27(ప్రజావాణి):** తెలంగాణ ఉద్యమంలో కలిపితురాయి కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కోదాడ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు షేక్ నయీమ్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి పురస్కరించుకొని ఆదివారం కోదాడ పట్టణంలో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం మొత్తం పోరాటాలు, త్యాగాల సమాహారమని అన్నారు. తొలిదశ, మలి దశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ఆయన తెలంగాణ రాష్ట్రం రాక ముందే మరణించడం దురదృష్టకరమని అన్నారు. వెనుకబడిన తరగతుల, దళిత, గిరిజన ప్రజల హక్కుల కోసం ఆయన నిరంతరం శ్రమించారని, ముఖ్యంగా చేనేత కార్మికుల సంక్షేమం కోసం పద్మశాలీ సంఘాన్ని బలోపేతం చేసి, వారి ఆర్థికాభివృద్ధికి ఆప్కో సంస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యబాబు, కుక్కడపు బాబు, సంపేట ఉపేందర్, షేక్ కరీముల్లా, బత్తుల ఉపేందర్, చలిగంటి వెంకట్, కందుల శ్రీకాంత్, మణికంఠ కుమార్, సంగిశెట్టి గోపాల్, గొర్రె రాజేష్, జానీ తదితరులు పాల్గొన్నారు

# అస్మిత రగ్బీ బరిలో బాలికల సత్తా

**● ఆర్‌సీవో స్వప్న చేతుల మీదుగా అ స్మిత రగ్బీ ప్రారంభం**

**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** నల్గొండ పట్టణంలోని డాన్ బోస్కో హైస్కూల్‌లో కేలో ఇండియా అస్మిత రగ్బీ సిటీ టోర్నమెంట్‌కు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీ వెల్ఫేర్ ఆర్‌సీవో స్వప్న ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించగా, యు -15 బాలికలు ఉత్సాహంగా బరిలోకి దిగారు. ప్రేరణ స్కూల్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. నల్గొండ జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసరి పృథ్వీరాజ్ యాదవ్ అధ్యక్షతన టోర్నమెంట్ నిర్వహించారు. బాలికల్లో రగ్బీ ప్రతిభను గుర్తించి, రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడమే టోర్నమెంట్ ప్రధాన లక్ష్యమని



నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో స్వప్న మాట్లాడుతూ, బాలికలు క్రీడల్లో ముందుకు రావడం ఎంతో అభినందనీయమని అన్నారు. రగ్బీ కేవలం ఆట మాత్రమే కాదని, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే గొప్ప వేదిక అని పేర్కొన్నారు. ప్రతి బాలిక తన ప్రతిభను నిరూపించుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఓటమిని చూసి వెనుకడుగు వేయకుండా ప్రతి మ్యాచ్ ను ఒక కొత్త పాఠంగా తీసుకుని మరింత పట్టుదలతో సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాన్ బోస్కో డైరెక్టర్ ఫాదర్ బాలశౌరెడ్డి, ప్రిన్సిపల్ ఫాదర్ ప్రవీణ్ కుమార్, ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ముల్కా నాగిరెడ్డి, టోర్నమెంట్ అబ్జర్వర్ శేషు, సూర్యాపేట జిల్లా కార్యదర్శి తరుణ్ రెడ్డి, యాదాద్రి జిల్లా కార్యదర్శి రేణుక, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ దేవదాస్, ఫిజియో మౌనిక, రిఫరీలు నిహారిక, చంద్రకళ, ఆకాశ్, రాము, రవి, వినోద్, శ్రీకాంత్, చందు, కోచ్‌లు, మేనేజర్లు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు





**ప్రజావాణి సెప్టెంబర్ 27** కమలాపూర్ మండల్ మర్రిపల్లిగూడెం గ్రామంలో తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు స్వతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను మర్రిపల్లి గూడెం గ్రామ బస్టాండ్ ఆవరణంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి పండ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు అనంతరం కేకు కట్ చేసి కొండా బాపూజీకి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ మాజీ సర్పంచులు వార్డు సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ములుగు జిల్లా -- పల్లె పల్లెకు ఆట కేంద్రం 3 పతకాలు సాధన




**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్--2026 పోటీలు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో హనుమకొండలోని JNS స్టేడియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో ములుగు జిల్లా పల్లె పల్లెకు ఆట కేంద్రం క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 3 పతకాలు సాధించారు. మహిళల విభాగంలో Y. నందిని రెండు పతకాలు సాధించి జిల్లాకు పేరు తెచ్చింది. డిస్కస్ త్రో విభాగంలో వెండి పతకం, షాట్‌పుట్ విభాగంలో మరో వెండి పతకం సాధించింది. అలాగే మహిళల విభాగంలో ఇూ. భవాని జావెలిన్ త్రోలో కాంస్య పతకం సాధించింది. ఇద్దరు క్రీడాకారిణులు రాష్ట్రస్థాయిలో ములుగు జిల్లా ఖ్యాతిని చాటారు. వీరికి శిక్షణ అందించిన కోచ్‌లు P. కుమారస్వామి, K. భావనలను పలువురు అభినందించారు. పల్లె పల్లెకు ఆట కేంద్రం ద్వారా గ్రామీణ క్రీడాకారులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. జిల్లా క్రీడా అధికారులు, క్రీడాభిమానులు విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# కోటగిరి,పోతంగల్ మండలాల్లో ప్రశాంతంగా ముగిసిన గణేష్ ఉత్సవాలు

- ఉమ్మడి మండలాలలో శోభాయమానంగా 135 గణేష్ విగ్రహాల నిమజ్జనం.
- అన్ని వర్గాల సహకారంతోనే విజయవంతమైన గణేష్ వేడుకలు.
- పోలీస్ శాఖకు అండగా నిలిచిన మండలి సభ్యులు, ప్రజలకు కృతజ్ఞతలు.
- అందరి భాగస్వామ్యం,సమిష్టి కృషితోనే గణేష్ ఉత్సవాల ఘన విజయం.
- ఎస్సై శ్రీనివాస్ యాదవ్.

**కోటగిరి/ప్రజావాణి:-** కోటగిరి,పోతంగల్ మండలాల పరిధిలో గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన నుండి నిమజ్జనం వరకు పండుగ ఉత్సవాలన్నీ ప్రజలందరి సహకారంతో అత్యంత ప్రశాంతంగ,శాంతియుత



వాతావరణంలో ముగిసినట్లు కోటగిరి ఎస్సై తెలిపారు. కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 135 గణేష్ విగ్రహాలను ప్రతిష్టించగా భక్తులు 9,11 రోజుల పాటు మండపాలలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిం చి నిమజ్జనం పూర్తి చేశారని పేర్కొన్నారు. నిమజ్జన కార్య క్రమం కోసం ప్రత్యేకంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ వేడుకలు విజయవంతం కావడానికి అన్ని మతాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు,మసీద్ కమిటీలు,అన్ని వర్గాల ప్రజలు పోలీస్ శాఖకు సంపూర్ణ సహకారం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ వేడుకల నిర్వహణలో తమ సేవలను అందించిన రెవెన్యూ శాఖ,గ్రామ పంచాయతీ, విద్యుత్ శాఖల అధికారులు సిబ్బంది గజ ఈతగాళ్లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోటగిరి,పోతంగల్ మండలాల సర్పంచ్‌లు,వివిధ పార్టీల నాయకులు,ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పత్రికా ప్రతినిధులు అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఉత్సవాల విజయవంతానికి భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# బాధిత కుటుంబానికి మాజీ ఎంపీ కవిత పరామర్శ..



**ప్రజావాణి,ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రానికి నికి చెందిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కేసముద్రం పి ఎస్ ఎస్ మాజీ చైర్మన్ దీకొండ వెంకన్న గౌడ్ సోదరి కక్కర్ల నీలమ్మ ఇటీవల కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీ మాలోతు కవిత ఆదివారం స్వర్గీయ నీలమ్మ ఇంటికి చేరుకొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నీలమ్మ కన్నుమూత బాధాకరమని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్య వచనాలు చెప్పారు. మాజీ ఎంపీ వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బేతమల్ల చంద్రయ్య, సిపి ఎంనేత పెరుమాండ్ల తిలక్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 111 వ జయంతి వేడుకలు





**హుజురాబాద్ సెప్టెంబర్ : 27 ( ప్రజావాణి )** తెలంగాణ ఉద్యమ ప్రాతఃస్మరణీయలు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, పద్మ విభూషణ్ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపుజీ 111వ జయంతి వేడుకలను పురస్కరించుకుని పద్మశాలి సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ రోడ్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపుజీ విగ్రహానికి వారు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు వేముల యాదగిరి మాట్లాడుతూ పద్మశాలి ముద్దుబిడ్డ గా జన్మించిన పద్మశాలి కులభందువులందరికి గర్వకారణం మరియు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం పరితపించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపుజీ అని కొనియాడారు. మంత్రి పదవిని సైతం లెక్కచేయకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసమే తన పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన గొప్ప త్యాగశీలి అని గుర్తుచేశారు. బహుజన వర్గాల అభ్యున్నతికి, చేనేత కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. బాబూజీ చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాపుజీ విగ్రహానికి నివాళులర్పించారు.

## మన సమగ్ర ప్రజావాణి వార్తకు స్పందన - చండూర్ వాటర్ ట్యాంక్ సెంటర్ లో కృష్ణా వాటర్ లీకేజీ కి మరమ్మతులు



RNI NO:TGTEL/25/A5443

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

గత మూడు నెలలుగా వాటర్ ట్యాంక్ సెంటర్ లో కృష్ణ వాటర్ పైప్ లైన్ లీకేజీ



**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి**చండూర్ పట్టణంలోని వాటర్ ట్యాంక్ సెంటర్ లో గత మూడు నెలలుగా కృష్ణా వాటర్ పైప్ లైన్ లీకేజీ అయి మురికి నీటిలో కృష్ణమ్మ నీరు కలిసిపోతుందని, దోమల బెడదతో డెంగ్యూ, విష జ్వరాల భయంతో ప్రజలు వణికిపోతున్నారని మన సమగ్ర ప్రజావాణి పత్రికలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. మన సమగ్ర ప్రజావాణి పత్రికలో వార్త రావడంతో కృష్ణా వాటర్ అధికారులు, చండూర్ మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించారు. హుటాహుటిన సిబ్బందిని పంపి లీకేజీని అరికట్టేందుకు మరమ్మతు పనులు చేపట్టారు. మూడు నెలలుగా పట్టించుకోని అధికారులు పత్రికలో వార్త రాగానే స్పందించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మన సమగ్ర ప్రజావాణి పత్రిక ప్రజల పక్షాన నిలబడి సమస్యను వెలుగులోకి తెచ్చిందని ప్రశంసిస్తున్నారు. అయితే తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, పైప్ లైన్ మొత్తం మార్చి ఇలాంటి లీకేజీలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# కల్తీ. కల్తీ.. కల్తీ...

- బాబోయ్ రెస్టారెంట్ లో ఆహారం తినలేం...
- రెస్టారెంట్ లో ఆహార భద్రతపై నిఘా పెంచాలి..
- గడువు ముగిసిన ఆహార పదార్థా లు, మాంసం నిల్వపై ప్రత్యేక తనిఖీలు అవసరం
- వంట నూనె పునర్వినియోగం, పరిశుభ్రతపై అధికారులు దృష్టి సారించాలి..



**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (సెప్టెంబర్ 28):** రెస్టారెంట్ లో ఆహార నాణ్యత, పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానంపై అధికారులు నిరంతరం నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. వినియోగదారులకు అందించే ఆహారం నాణ్యమైనదిగా, సురక్షితంగా ఉండేలా సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. ఇటీవలి తనిఖీల్లో కొన్ని ఆహార సంస్థల్లో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, సరైన లేబులింగ్ లేని పదార్థాలు, నిల్వకు సంబంధించిన లోపాలు, పునర్వినియోగించిన వంట నూనె వంటి అంశాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించిన నేపథ్యంలో రెస్టారెంట్ పై పర్యవేక్షణ మరింత పెంచాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రెస్టారెంట్ లో చికెన్, మటన్, గుడ్లు వంటి మాంసాహార పదార్థాలను ఎలా నిల్వ చేస్తున్నారు, వాటి తాజాదనం, గడువు, ఫ్రీజర్ల నిర్వహణ, వంటగది పరిశుభ్రత వంటి అంశాలను అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు. అదేవిధంగా వంట నూనెను పదేపదే వినియోగిస్తున్నారా, ఆహార పదార్థాలను సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేస్తున్నారా, గడువు ముగిసిన పదార్థాలను వంటలో ఉపయోగిస్తున్నారా, ప్యాక్ చేసిన పదార్థాలకు అవసరమైన లేబులింగ్ ఉందా అనే అంశాలపై తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదులపై పరిశీలన రెస్టారెంట్ లో ఆహార నాణ్యతకు సంబంధించి, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి, అవసరమైన సందర్భాల్లో ఆహార నమూనాలను సేకరించి, పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. పరీక్షలు, అధికారిక నివేదికల ద్వారా ఉల్లంఘనలు నిర్ధారణ అయినట్లయితే వర్తించే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి, ప్రధాన పట్టణాలు, జిల్లా కేంద్రాల్లోని రెస్టారెంట్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, వంటగదులు, మాంసం నిల్వ ప్రాంతాలు, ఫ్రీజర్లు, వంట నూనె వినియోగం, ఆహార పదార్థాల గడువు, పరిశుభ్రత వంటి అంశాలను అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో రెస్టారెంట్ లో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నిబంధనలు పాటించేలా యాజమాన్యాలకు అవగాహన కల్పించడంతో పాటు ఉల్లంఘనలు అధికారికంగా నిర్ధారణ అయినప్పుడు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. తప్పుడు లేదా నిర్ధారించని రెస్టారెంట్ పేర్లు, సంఖ్యలు, అధికారులు చెప్పారని నిర్ధారించలేని వివరాలు త్వరలో...

## అస్మిత రగ్బీ బరిలో బాలికల సత్తా

- ఆర్సీవో స్వప్న చేతుల మీదుగా అస్మిత రగ్బీ ప్రారంభం



**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** నల్గొండ పట్టణంలోని డాన్ బోస్కో హైస్కూల్‌లో కేలో ఇండియా అస్మిత రగ్బీ సిటీ టోర్నమెంట్‌కు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీ వెల్ఫేర్ ఆర్సీవో స్వప్న ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించగా, యు-15 బాలికలు ఉత్సాహంగా బరిలోకి దిగారు. ప్రేరణ స్కూల్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. నల్గొండ జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసరి పృథ్విరాజ్ యాదవ్ అధ్యక్షతన టోర్నమెంట్ నిర్వహించారు. బాలికల్లో రగ్బీ ప్రతిభను గుర్తించి, రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడమే టోర్నమెంట్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్సీవో స్వప్న మాట్లాడుతూ, బాలికలు క్రీడల్లో ముందుకు రావడం ఎంతో అభినందనీయమని అన్నారు. రగ్బీ కేవలం ఆట మాత్రమే కాదని, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే గొప్ప వేదిక అని పేర్కొన్నారు. ప్రతి బాలిక తన ప్రతిభను నిరూపించుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఓటమిని చూసి వెనుకడుగు వేయకుండా ప్రతి మ్యాచ్ ను ఒక కొత్త పాఠంగా తీసుకుని మరింత పట్టుదలతో సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాన్ బోస్కో డైరెక్టర్ ఫాదర్ బాలశౌరెడ్డి, ప్రిన్సిపల్ ఫాదర్ ప్రవీణ్ కుమార్, ఎస్జీఎఫ్ అండర్-19 కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ముల్కా నాగిరెడ్డి, టోర్నమెంట్ అబ్జర్వర్ శేషు, సూర్యాపేట జిల్లా కార్యదర్శి తరుణ్ రెడ్డి, యాదాద్రి జిల్లా కార్యదర్శి రేణుక, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ దేవదాస్, ఫిజియో మౌనిక, రిఫరీలు నిహారిక, చంద్రకళ, ఆకాశ్, రాము, రవి, వినోద్, శ్రీకాంత్, చందు, కోచ్‌లు, మేనేజర్లు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజా కలలను, సాంస్కృతిని ఎత్తి పడదాం..

- కుల-మత విద్వేష సంస్కృతిని ఓడిద్దాము
- జనశక్తి రాష్ట్ర నేత కర్నాకుల.ఆంజనేయులు





**పలాస ప్రజావాణి ప్రతినిధి** తెలంగాణ రాష్ట్రంలోఈ నెల 26, 27, 28 తేదీలలో జరుగుతున్న అరుణోదయ 52 ఏళ్లలో 50 సంవత్సరాలు విమలక్క ప్రస్థానం అనే కార్యక్రమంలో రెండవ రోజు (ఆదివారం) ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పాల్గొని, మాట్లాడుతూ ప్రధానంగా విమలక్క తన చిన్నతనం నుంచే ఆట పాటలతో ఉద్యమాలలో పాల్గొని, నడిపిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అనేక రాజ్యహింస కేసులు, దాడులు, నిర్బంధాలు ఎదుర్కొంటూ పోరాటాలు కొనసాగిస్తున్నదని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో ప్రత్యేక హోదా కోసం జన చైతన్య యాత్రలో పాల్గొని రాష్ట్రమంతా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించిందని,కార్మిక, కర్షక హక్కుల కోసం, మహిళలపై దాడులను ఖండిస్తూ, భూ పోరాటాలలో పాల్గొని తనదైన శైలిని ప్రదర్శించిందని ఆయన కొనియాడారు. ఈ పోరాటాలలో అరుణోదయ ఎనలేని కృషి చేసిందని ఆయన కొనియాడారు.ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా జనశక్తి రాష్ట్ర నేత కోనేరు రమేష్ వివరాలు తెలిపారు..

## నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్: మంత్రి సవిత

- 85 మంది లబ్ధిదారులకు రూ.95 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

**అనంత పురం సెప్టెంబర్ 27 మన ప్రజా వాణి** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేదలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. పెనుకొండ నియోజకవర్గం లోని ఐదు మండలాలకు చెందిన 85 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.95 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను మంత్రి సవిత పెనుకొండ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వైద్య చికిత్సలు, ఇతర అత్యవసర అవసరాల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు పెనుకొండ నియోజకవర్గంలో 1,391 మంది లబ్ధిదారులకు రూ. 15.09 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామని మంత్రి సవిత తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు అవార్డుల దరఖాస్తులు అక్టోబర్ 05 వ తేదీ వరకు పొడిగింపు

- జర్నలిస్టుల ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం
- 2025 ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం -- 12 విభాగాల్లో పురస్కారాలు
- రూ.2 లక్షల నుంచి రూ.1 లక్ష వరకు నగదు పురస్కారాలు
- రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్



**అనంత పురం బ్యూరో సెప్టెంబరు 27, మన ప్రజా వాణి** జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.ముందు తెలిపిన విధంగా సెప్టెంబర్ 28 లోగా ఉన్న గడువును 2026 అక్టోబర్ 05 వ తేదీ కి పొడిగించడం జరిగింది. అర్హత కలిగిన జర్నలిస్టులు తమ దరఖాస్తులను 2026 అక్టోబర్ 05 వ తేదీ సాయంత్రం 5.00 గంటలలోగా కింది చిరునామాకు పంపాలి.డైరెక్టర్,సమాచార పౌరసంబంధాల శాఖ,2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం,పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ -- 520013.
కమిటీ విచక్షణాధికారంతో ఎంపిక చేసే పురస్కారాలులి కింది మూడు పురస్కారాలకు జర్నలిస్టుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించకుండా, ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో పురస్కార గ్రహీతలను ఎంపిక చేస్తుంది. 1. వి.ఆర్. నార్ల జీవిత సాఫల్య పురస్కారం. 2. కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు 3. మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట రాష్ట్రంలోని చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డు.దరఖాస్తుల ఆధారంగా కమిటీ ఎంపిక చేసే అవార్డులులి 1. కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డు నగదు పురస్కారం: రూ. 2 లక్షలుఅర్హతలు: జర్నలిజం వృత్తిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగి, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పూర్తికాలపు జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న పేరొందిన తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలు లేదా పీరియాడికల్స్ కోసం ఆంధ్రప్రదేశ్‌లో లేదా రాష్ట్రం వెలుపల పనిచేస్తున్న జర్నలిస్టులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 2. ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులుగ్రామీణ జర్నలిజంలో విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు జర్నలిస్టులకు ప్రముఖ పాత్రికేయుల పేర్లతో మూడు అవార్డులు అందజేస్తారు.- ఖాసా సుబ్బారావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు-ముట్నూరి కృష్ణారావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు.మద్దుకూరి చంద్రశేఖరరావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు
ఒక్కో అవార్డు నగదు పురస్కారం: రూ. 1 లక్ష
అర్హతలు:ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న తెలుగు, ఆంగ్ల దినపత్రికల్లో గ్రామీణ ప్రాంతాల్లో కనీసం 3 సంవత్సరాల అనుభవం కలిగిన పాత్రికేయులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. గ్రామీణ రిపోర్టింగ్‌లో విశేష అనుభవం గడించిన మాజీ జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 3. సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ. 1 లక్ష
అర్హతలు:రాష్ట్రంలో వెలువడే తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలు లేదా పీరియాడికల్స్‌లో పనిచేస్తున్న మహిళా రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
4. ఉత్తమ కార్టూనిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ. 1 లక్ష
అర్హతలు:ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న తెలుగు, ఆంగ్ల దినపత్రికల్లో పనిచేస్తున్న కార్టూనిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. 5. అబుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ. 1 లక్ష
అర్హతలు:ఉర్దూ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తూ కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉర్దూ జర్నలిజానికి అందించిన సేవలు, గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై చేసిన రిపోర్టింగ్, మొత్తం వృత్తిపరమైన పనితీరును ప్రామాణికంగా తీసుకుని అవార్డు గ్రహీతను ఎంపిక చేస్తారు. 6. ఉత్తమ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ. 1 లక్ష
అర్హతలు:
కనీసం 5 సంవత్సరాల అనుభవం కలిగి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రసారమయ్యే ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లలో పనిచేస్తున్న జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చు. దూరదర్శన్, రేడియోలో పనిచేస్తున్న జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. 7. ఉత్తమ వీడియో జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ. 1 లక్ష
అర్హతలు:కనీసం 5 సంవత్సరాల అనుభవం కలిగి, ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లలో పనిచేస్తున్న వీడియో జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చు.దరఖాస్తు విధానం -- ముఖ్య నిబంధనలులి జర్నలిస్టులు తాము పనిచేస్తున్న సంస్థ, ఉద్యోగ వివరాలు, తమ అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలతో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలి.లి దరఖాస్తుతో పాటు కనీసం 5 వ్యాసాలు, వార్తా కథనాలు, ఫొటోలు, కార్టూన్లు లేదా వీడియో క్లిప్పింగ్స్ జతచేయాలి. అవి 2025 క్యాలెండర్ సంవత్సరంలో (01-01-2025 నుంచి 31-12-2025 వరకు) ప్రచురితమైనవి/ప్రసారమైనవి అయి ఉండాలి.లి వ్యాసాలు, వార్తా కథనాలు తదితర ఆర్టికల్స్‌ను ఫొటోకాపీల రూపంలో కూడా దాఖలు చేయవచ్చు.లి అవార్డు గ్రహీతల ఎంపికకు సంబంధించి ఎంపిక కమిటీదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు అనుమతించబడవు.లి ఏదైనా విభాగంలో తగిన సంఖ్యలో లేదా తగిన ప్రమాణాలతో దరఖాస్తులు అందలేదని కమిటీ భావించినట్లయితే, సంబంధిత అవార్డును ప్రకటించకుండా నిలిపివేసే అధికారం ఎంపిక కమిటీకి ఉంటుంది. ఉత్తమ జర్నలిస్టు పురస్కారాలకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలోని మీడియా రిలేషన్స్ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చు: (https://mediarelations.ap.gov.in/media)

# శ్రీనివాసరావు సేవలు మరువలేనివి

- సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్



**ప్రజావాణి ప్రతినిధికూనవరం మండలం సెప్టెంబర్ 27**పోలవరం జిల్లా చింతూరు డివిజన్- కూనవరం మండలం: గొమ్ము అయ్యవారిగూడెం గ్రామం సీపీఎం మండల కమిటీ సభ్యులు కర్నాటి శ్రీనివాసరావు పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తగా అందరికీ స్ఫూర్తిగా నిలిచారని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. ఇటీవల మృతి చెందిన కర్నాటి శ్రీనివాసరావు దశదిన కర్మ కార్యక్రమం కూనవరం మండలంలోని గొమ్ము అయ్యవారిగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికిజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు మొదట పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరంజిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు కుమారులు మోహన్,ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. బాబు బొర్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు హాజరై శ్రీనివాసరావుకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ శ్రీనివాసరావు సీపీఎం పార్టీ కార్యక్రమాల్లో నిరంతరం చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని తెలిపారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ముందుండేవారని, ముఖ్యంగా ప్రజా సమస్యలపై నిర్వహించే కార్యక్రమాలకు ప్రజలను సమీకరించడంలో కీలక పాత్ర పోషించేవారని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పార్టీ నిర్వహించే పోరాటాల్లో శ్రీనివాసరావు క్రియాశీలకంగా వ్యవహరించారని అన్నారు. పార్టీని గ్రామస్థాయిలో విస్తరించడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. కార్యకర్తగా, పార్టీ నాయకత్వంపై విశ్వాసంతో పనిచేస్తూ సహచరులతో స్నేహపూర్వకంగా మెలిగేవారని గుర్తు చేశారు.శ్రీనివాసరావు అకాల మృతి సీపీఎం పార్టీకి, పార్టీ శ్రేణులకు, ఆయన కుటుంబ సభ్యులకు తీరని లోటని బొప్పెన కిరణ్ అన్నారు. ఆయన లేని లోటును పూడ్చలేనప్పటికీ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు శ్రీనివాసరావు సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, లోతా రామారావు, న్యాయవాది రవితేజ పల్లపు వెంకట్, సీసం. సురేష్, పూనెం ప్రదీప్,పులి సంతోష్, పాయం సీతారామయ్య, కొమరం పెంటయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, తమ్మయ్య, ఐ. వెంకటేశ్వరావు,నాగమణి,అమ్మాజి, జయసుధ పాయం సత్యనారాయణ , కుమారురు మోహన్, సందీప్, సోదరుడు నారాయణరావు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

- ఈనెల 28వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ
- సోమవారం ఉదయం 10 గంటల నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..
- రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.



**అనంతపురం, సెప్టెంబర్ 27 మన ప్రజా వాణి** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.ఈనెల 28వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :ఈనెల 28వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 10:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 10:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 10:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# బస్సులు తగ్గించి చార్జీలు పెంచుతున్న కాంగ్రెస్ సర్కార్

- ఆడవాళ్ల ప్రయాణాలను తగ్గించేలా ఎక్స్‌ప్రెస్‌లు తీసేసిండ్లు
- భద్రాచలం...హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లను పునరుద్ధరించాలే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 27, ప్రజావాణి:**మానిఫెస్టో రాసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ మహాలక్ష్మి పథకం పేరుతో మహిళా లోకాన్ని మోసం చేశాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం మంథని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, దగా అని, వాళ్లు అధికారంలోకి రాకముందు ఒకరకంగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక రకంగా ఉంటారనేది స్పష్టంగా కన్పిస్తోందన్నారు. ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎక్కువగా మోసపోయింది మహిళలు, ఆర్టీసీ ఉద్యోగులు, ఆటో కార్మికులేననే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఆనాడు మానిఫెస్టో కమిటి చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ మానిఫెస్టోలో మహాలక్ష్మి పథకం పెట్టి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితమని చెప్పారని, ఈనాడు ఈ పథకాన్ని సక్రమంగా నడిపించకుండా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. మహలక్ష్మి అని గొప్ప పేరు పెట్టి బస్సులను తగ్గించి ఎక్స్‌ప్రెస్‌లను తీసివేసి వాటికి డీలక్స్ అని పేరు రాసి డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆయన వివరించారు. ఆడవాళ్ల ప్రయాణం తగ్గించి వారి అవసరాలకు ఆర్టీసీ బస్సులు దొరకకుండా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. మంథని నుంచి హైదరాబాద్‌కు అనేక ఏండ్లు బస్సులు నడిచేవని, కానీ ఈనాడు హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్, మియా పూర్ బస్సును రద్దు చేసి కేవలం సిద్దిపేట వరకు నడిపిస్తున్నారని, ఆ బస్సు సిద్దిపేట నుంచి కరీంనగర్ వరకు మూడు ట్రిప్పులు కొట్టి మంథనికి వస్తుందన్నారు. హైదరాబాద్‌కు మహిళలు వెళ్లకుండా చేశారని, ఆడవాళ్లు వెళ్లకుండా కేవలం మగవాళ్లు మాత్రమే వెళ్లేలా బస్సులు నడిపిస్తూ చార్జీలు పెంచి వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు మంథని నుంచి సిద్దిపేటకు బస్సును ప్రత్యేకంగా నడిపించిన దాఖలాలు లేవని, అది ఎవరికి అవసరం లేదన్నారు. కానీ కొత్తగా సిద్దిపేటకు బస్సు నడిపించడం వెనుక పెద్ద కుట్ర ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఈనాడు మంథని నుంచి కరీంనగర్ వరకు సమయానికి బస్సులు నడిపించడం లేదని, భద్రాచలం వరకు ఎక్స్‌ప్రెస్ నడిపించే వారని, దానిని లగ్జరీగా మార్చి అక్కడకు మహిళలకు వెళ్లకుండా చేశారన్నారు. మహిళల కోసం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి ఆ బడ్జెట్ కేటాయించకుండా ఈ బడ్జెట్ మీరే తీసుకురావాలంటూ డీఎంలు కండక్టర్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నారని, దీంతో మహిళలను తగ్గించి మగవాళ్లను బస్సుల్లో ఎక్కించుకుని ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఫ్రీబస్ పెట్టి కండక్టర్‌లను ఎక్కువ వసూలు చేయమంటే ఎలా చేస్తారో కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలన్నారు. ఈ పథకం పెట్టినప్పటి నుంచి ఇటు కండక్టర్‌లు, అటు డ్రైవర్‌లను అనే విధాలుగా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కండక్టర్‌లను ఎక్కువ డబ్బులు తీసుకురావాలని, డ్రైవర్‌లను మైలేజీ రావాలంటూ వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మంథని డిపోలో 360మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 190మంది మాత్రమే ఉన్నారని, దీంతో మహిళా ఉద్యోగులు రాత్రి పది గంటల వరకు డ్యూటీ చేసి ఇబ్బందులు పడుతున్నారని ఆయన వాపోయారు. కుటుంబసభ్యులు ఎవరైనా చనిపోయినా లీవ్ ఇవ్వడం లేదని, ఏరియర్స్ కూడా ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. ఉద్యోగులు మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేసిన దుద్దిళ్ల...

- బస్సులు తగ్గించి చార్జీలు పెంచుతున్న కాంగ్రెస్ సర్కార్
- ఆడవాళ్ల ప్రయాణాలను తగ్గించేలా ఎక్స్‌ప్రెస్‌లు తీసేసిండ్లు
- మహిళలు హైదరాబాద్ వెళ్లకుండా చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే
- తండ్రి తెచ్చిండని చెప్పుకునే బస్టాండ్..డిపోల దుస్థితి ఇదేనా
- భద్రాచలం...హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లను పునరుద్ధరించాలే
- మానీఫెస్టో అమలు కోసం ప్రజల పక్షాన పోరాటం చేసేది బీఆర్ఎస్సే

– మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మానీఫెస్టో రాసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ మహాలక్ష్మి పథకం పేరుతో మహిళా లోకాన్ని మోసం చేశాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం మంథని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంటేను మోసం, దగా అని, వాళ్లు అధికారంలోకి రాకముందు ఒకరకంగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక రకంగా ఉంటారనేది స్పష్టంగా కన్పిస్తోందన్నారు. ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎక్కువగా మోసపోయింది మహిళలు, ఆర్టీసీ ఉద్యోగులు, ఆటో కార్మికులేననే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఆనాడు మానీఫెస్టో కమిటి చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ మానీఫెస్టోలో మహాలక్ష్మి పథకం పెట్టి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితమని చెప్పారని, ఈనాడు ఈ పథకాన్ని సక్రమంగా నడిపించకుండా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. మహలక్ష్మి అని గొప్ప పేరు పెట్టి బస్సులను తగ్గించి ఎక్స్‌ప్రెస్‌లను తీసివేసి వాటికి డీలక్స్ అని పేరు రాసి డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆయన వివరించారు. ఆడవాళ్ల ప్రయాణం తగ్గించి వారి అవసరాలకు ఆర్టీసీ బస్సులు దొరకకుండా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. మంథని నుంచి హైదరాబాద్‌కు అనేక ఏండ్లు బస్సులు నడిచేవని, కానీ ఈనాడు హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్, మియా పూర్ బస్సును రద్దు చేసి కేవలం సిద్దిపేట వరకు నడిపిస్తున్నారని, ఆ బస్సు సిద్దిపేట నుంచి కరీంనగర్ వరకు మూడు ట్రిప్పులు కొట్టి మంథనికి వస్తుందన్నారు. హైదరాబాద్‌కు మహిళలు వెళ్లకుండా చేశారని, ఆడవాళ్లు వెళ్లకుండా కేవలం మగవాళ్లు మాత్రమే వెళ్లేలా బస్సులు నడిపిస్తూ చార్జీలు పెంచి వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు మంథని నుంచి సిద్దిపేటకు బస్సును ప్రత్యేకంగా నడిపించిన దాఖలాలు లేవని, అది ఎవరికి అవసరం లేదన్నారు. కానీ కొత్తగా సిద్దిపేటకు బస్సు నడిపించడం వెనుక పెద్ద కుట్ర ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఈనాడు మంథని నుంచి కరీంనగర్ వరకు సమయానికి బస్సులు నడిపించడం లేదని, భద్రాచలం వరకు ఎక్స్‌ప్రెస్ నడిపించే వారని, దానిని లగ్జరీగా మార్చి అక్కడకు మహిళలకు వెళ్లకుండా చేశారన్నారు. మహిళల కోసం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి ఆ బడ్జెట్ కేటాయించకుండా ఈ బడ్జెట్ మీరే తీసుకురావాలంటూ డీఎంలు కండక్టర్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నారని, దీంతో మహిళలను తగ్గించి మగవాళ్లను బస్సుల్లో ఎక్కించుకుని ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఫ్రీబస్ పెట్టి కండక్టర్‌లను ఎక్కువ వసూలు చేయమంటే ఎలా చేస్తారో కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలన్నారు. ఈ పథకం పెట్టినప్పటి నుంచి ఇటు కండక్టర్‌లు, అటు డ్రైవర్‌లను అనే విధాలుగా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కండక్టర్‌లను ఎక్కువ డబ్బులు తీసుకురావాలని, డ్రైవర్‌లను మైలేజీ రావాలంటూ వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మంథని డిపోలో 360మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 190మంది మాత్రమే ఉన్నారని, దీంతో మహిళా ఉద్యోగులు రాత్రి పది గంటల వరకు డ్యూటీ చేసి ఇబ్బందులు పడుతున్నారని ఆయన వాపోయారు. కుటుంబసభ్యులు ఎవరైనా చనిపోయినా లీవ్ ఇవ్వడం లేదని, ఏరియల్స్ కూడా ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. ఉద్యోగులు ఏరియల్స్ అడిగితే రిటైర్ట్ అయ్యే వరకు వేచి చూడాలని చెప్తున్నారని ఆయన విమర్శించారు. రిటైర్ట్ అయిన ఉద్యోగులు రోజుకు ఐదు వేల మంది చొప్పున హైదరాబాద్‌లో ధర్నాలు చేసిన స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మంథని ఆర్టీసీబస్టాండ్ దుస్థితి గురించి చెప్తే మంత్రి హుటాహుటీన వచ్చి ఓ పెద్ద ఫౌండేషన్ వేసి వెళ్లిపోయాడే తప్ప ఇక్కడ ఏ మార్పు జరుగడం లేదన్నారు. ఆనాడు తాము అదికారంలో ఉన్నప్పుడు బస్టాండ్‌లో మట్టి పోయించి చదును చేసి అభివృద్ధి చేశామని ఆయన గుర్తు చేశారు. ఇక డిపో పరిస్థితి చూస్తే చిన్న వర్షం పడినా బురదమయమై నడవలేని పరిస్థితి ఉంటుందన్నారు. బస్టాండ్, డిపో తన తండ్రి తీసుకువచ్చాడని పదే పదే చెప్పే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ వాటి అభివృద్ధి గురంచి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విఫలం అయిందని, ఏదీ అడిగినా మానీఫెస్టో చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ దేనికి జవాబు చెప్పడని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లలు, మహిళలు, విద్యార్థుల గురించి ఏనాడు ఆలోచన చేయని దుద్దిళ్ల శ్రీధర్ పోలీస్ పహారాలో ముందు పది, వెనుక పది కార్లతో వచ్చి వెళ్తుంటాడని, ఎవరైనా అడిగితే వాల్లను పోలీసులతో నోరుమూయించి బెదిరింపులకు గురి చేస్తాడని అన్నారు. మానీఫెస్టో రాసి ఇంత పెద్ద మహిళా లోకాన్ని మోసం చేసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ వెంటనే కళ్లు తెరిచి మహాలక్ష్మి పథకం ద్వారా హైదరాబాద్, మియాపూర్ దిల్‌సుఖ్‌నగర్‌కు ఎక్స్‌ప్రెస్‌లు నడిపించాలని ఆయన డిమాండ్ చేశారు. డ్రైవర్లు, కండక్లర్‌లను ఇబ్బంది పెట్టే డీఎంకు పనిస్మెంట్ తప్పదని, ప్రజలకు ఆర్టీసీ బస్సులు లేకుండా చేసి ఇబ్బందిపెడితే సహించేది లేదన్నారు. మానీఫెస్టో అమలు కోసం ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని, మంథని ఎమ్మెల్యే ఇప్పటికైనా హైదరాబాద్, భద్రచలం వరక ఎక్స్‌ప్రెస్‌లు నడింపించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అడిగితే రిటైర్ట్ అయ్యే వరకు వేచి చూడాలని చెప్తున్నారని ఆయన విమర్శించారు. రిటైర్ట్ అయిన ఉద్యోగులు రోజుకు ఐదు వేల మంది చొప్పున హైదరాబాద్‌లో ధర్నాలు చేసిన స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మంథని ఆర్టీసీబస్టాండ్ దుస్థితి గురించి చెప్తే మంత్రి హుటాహుటీన వచ్చి ఓ పెద్ద ఫౌండేషన్ వేసి వెళ్లిపోయాడే తప్ప ఇక్కడ ఏ మార్పు జరుగడం లేదన్నారు. ఆనాడు తాము అదికారంలో ఉన్నప్పుడు బస్టాండ్‌లో మట్టి పోయించి చదును చేసి అభివృద్ధి చేశామని ఆయన గుర్తు చేశారు. ఇక డిపో పరిస్థితి చూస్తే చిన్న వర్షం పడినా బురదమయమై నడవలేని పరిస్థితి ఉంటుందన్నారు. బస్టాండ్, డిపో తన తండ్రి తీసుకువచ్చాడని పదే పదే చెప్పే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ వాటి అభివృద్ధి గురంచి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విఫలం అయిందని, ఏదీ అడిగినా మానీఫెస్టో చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ దేనికి జవాబు చెప్పడని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లలు, మహిళలు, విద్యార్థుల గురించి ఏనాడు ఆలోచన చేయని దుద్దిళ్ల శ్రీధర్ పోలీస్ పహారాలో ముందు పది, వెనుక పది కార్లతో వచ్చి వెళ్తుంటాడని, ఎవరైనా అడిగితే వాల్లను పోలీసులతో నోరుమూయించి బెదిరింపులకు గురి చేస్తాడని అన్నారు. మానీఫెస్టో రాసి ఇంత పెద్ద మహిళా లోకాన్ని మోసం చేసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ వెంటనే కళ్లు తెరిచి మహాలక్ష్మి పథకం ద్వారా హైదరాబాద్, మియాపూర్ దిల్‌సుఖ్‌నగర్‌కు ఎక్స్‌ప్రెస్‌లు నడిపించాలని ఆయన డిమాండ్ చేశారు. డ్రైవర్లు, కండక్లర్‌లను ఇబ్బంది పెట్టే డీఎంకు పనిస్మెంట్ తప్పదని, ప్రజలకు ఆర్టీసీ బస్సులు లేకుండా చేసి ఇబ్బందిపెడితే సహించేది లేదన్నారు. మానీఫెస్టో అమలు కోసం ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని, మంథని ఎమ్మెల్యే ఇప్పటికైనా హైదరాబాద్, భద్రచలం వరక ఎక్స్‌ప్రెస్‌లు నడింపించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# వినాయక దేవుని ప్రసాద మైనా లడ్డూ వేలం పాటలో

- రూ.1,02,000 లకు లడ్డూ కైవసం చేసుకున్న బళ్ల ఆనంద్ దంపతులు.



**పలాస, ప్రజావాణి ప్రతినిధి** పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని పురుషోత్తపురం లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో ఆదివారం లడ్డూ వేలం పాటను నిర్వహించారు.భక్తుల కోలాహలం, భక్తి ఉత్సాహం నడుమ జరిగిన ఈ వేలం పాటలో పలువురు భక్తులు పోటీపడ్డారు. చివరకు పలాస–కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బళ్ల గిరిబాబు సోదరుడు బళ్ల ఆనంద్, ఆయన సతీమణి సుజాత దంపతులు రూ.1,02,000లకు లడ్డూను సొంతం చేసుకున్నారు.లడ్డూను దక్కించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని,స్వామి వారి కృపతో తమ కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామని ఈ సందర్భంగా బళ్ల ఆనంద్ దంపతులు తెలిపారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించి, లడ్డూను అందజేశారు.ఈ కార్యక్రమంలో పురుషోత్తపురం వీధి యువకులు,ఉత్సవ కమిటీ సభ్యులు, వీధి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే గౌతు శిరీష..





**పలాస ప్రజావాణి ప్రతినిధి** పలాస నియోజకవర్గంలోని పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ, వజ్రపుకొత్తూరు మండలం, పలాస మండలంలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం పరామర్శించారు. ఆయా కుటుంబాలను స్వయంగా కలిసి, మృతుల పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే, జరిగిన విషాదం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆప్తులను కోల్పోయిన బాధను మాటల్లో చెప్పలేమని, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# గుత్తి కోటను అభివృద్ధి చేయడమే లక్ష్యం

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ





**అనంతపురం సెప్టెంబర్ 27 ప్రజా వాణి** నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని చారిత్రక గుత్తికోట వద్ద ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, గుత్తి కోట పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎం పి అంబికా లక్ష్మీనారాయణ పాల్గొనడం జరిగింది.శతాబ్దాల చరిత్రకు, అనేక రాజవంశాల పాలనకు సాక్ష్యంగా నిలిచిన గుత్తికోట మన అనంతపురం జిల్లాకు గర్వకారణం. 101 బావులు, 14 ముఖద్వారాలు, సుమారు 16 కిలోమీటర్ల ప్రహరీ, 968 ఎకరాల విస్తీర్ణం, సముద్ర మట్టానికి సుమారు 680 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ అద్భుతమైన కోట మన గొప్ప చారిత్రక వారసత్వానికి ప్రతీక.ఈ సందర్భంగా పురాతన నాణేల ప్రదర్శన, నృత్యాలు, పాటలు, కర్రసాము, కరాటే తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే గుత్తికోట చరిత్రపై పుస్తకాన్ని ఆవిష్కరించడం ప్రత్యేకంగా ఆనందాన్ని కలిగించింది ఎం పి అంబికా తెలియజేశారు.గుత్తికోటకు మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవసరమైన నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నాను. గుత్తికోటపై పార్లమెంటులో ప్రస్తావించి, త్వరలోనే ఈ చారిత్రక కోటకు ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదలయ్యేలా ప్రభుత్వం తరపున ప్రయత్నాలు కొనసాగిస్తున్నాను.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, గుత్తి కోట పరిరక్షణ సమితి సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రజలు, మహిళలు, విద్యార్థులు పాఠశాలల చిన్నారులకు అభినందనలు తెలిపారు.

# గంగమ్మ సేవలో బియాపా ప్లానింగ్ సెక్రటరీ మహేష్



**మన ప్రజావాణి చౌడేపల్లి**ప్రసిద్ధ శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ అమ్మవారిని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఏరియా అథారిటీ (బియాపా) ప్లానింగ్ సెక్రటరీ డి.వి. మహేష్ కుమార్ ఆదివారం మిత్రులతో కలిసి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషవస్త్రం కప్పి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు.అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ విశేషాలను అధికారులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్‌తో పాటు రెడ్డి ప్రసాద్, రాజన్న, మంజన్న, శంకరగౌడ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో యువత భవితకు భరోసా కార్యక్రమం

- పాల్గొన్న అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ..







**అనంత పురం సెప్టెంబరు 27 మన ప్రజా వాణి** అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డు నందు గల శ్రీ సాయి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం యువత భవితకులి భరోసాలి కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గైనిక్ డాక్టర్ బాల కుమారి, కళాశాల ప్రిన్సిపాల్ అమృత, ఏవో రామకృష్ణ, కళాశాల నర్సింగ్ విద్యార్థులు, లెక్చరర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నర్సింగ్ కళాశాలలో డిప్లమా మరియు డిగ్రీ నర్సింగ్ విద్యను అభ్యసించి నేటి సమాజంలో ఉత్తమ సేవా రంగంలో గుర్తింపు పొందడానికి ఎన్నో అవకాశాలున్నాయని తెలిపారు. భారతదేశంలో మదర్ తెరిసా చేసిన సేవలకు ఎంతో గుర్తింపు వచ్చిందని, సేవ రంగంలో ఇలాంటి గుర్తింపు ఉంటుందన్నారు. స్టాఫ్ నర్స్ గా స్కిల్స్ బాగా నేర్చుకుని పట్టణాలలో, నగరాలలో, ఇతర దేశాల్లో కూడా ఎన్నో అవకాశాలు మెడికల్ విద్యార్థులకు లభిస్తున్నాయని తెలియజేశారు. కార్పొరేటర్ హాస్పిటల్స్ విస్తరిస్తున్నాయి, వాటికి తగ్గట్టుగా మెలకువలు నేర్చుకొని ఉన్నత శిఖరాలు చేరాలని తెలియజేశారు. తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేయాలన్నారు. విద్యార్థులు చిన్నవయసులోనే మత్తు మరియు డ్రగ్స్ వాటికి దూరంగా ఉండాలని, బాలికలు అవగాహన కలిగి ఉండాలని, మహిళల సంబంధించినటువంటి యాప్ లో అప్డేట్ గా ఉండాలని తెలియజేశారు.

# ఖమ్మం జిల్లాలో "ప్రజావాణి" ప్రకంపనలు...?

- ముదిగొండ "మల్లారం" జిపిఓపై వెల్లువెత్తుతున్న విమర్శలు...?
- వైరాలో రేషన్ కార్డు.. అపై దర్జాగా రేషన్ బియ్యం...?
- ఇటీవల రేషన్ కార్డు తొలగించినట్లు అనుమానం...?
- జిల్లాలో మసకబారుతున్న రెవెన్యూ శాఖ ప్రతిష్ట...?
- ప్రజావాణి కథనాలపై తెగ ఆరాలు తీస్తున్న కొందరు...?

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి

ఖమ్మం జిల్లా రెవెన్యూ శాఖలో ఓ జి పి ఓ నిర్లక్ష్యం అధికార దుర్వినియోగం ప్రకంపనలు సృష్టిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ రాయితీలు పొందుతున్నట్లు ఆ మేరకు వైరా లో రేషన్ కార్డు నెంబర్ 36 54 68 8 292 ప్రకారం రేషన్ కార్డును కలిగి 22 43 0 0 7 రేషన్ షాపు నందు ఇటీవల మూడు నెలల బియ్యం పొందినట్లు మన ప్రజావాణి ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో కొందరు ఫిర్యాదు చేశారు. కాగా ఇటీవల ఖమ్మం జిల్లా ముదిగొండ మల్లారం జిపిఓ పనితీరుపై


మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ

RNI NO:TGTEL/25/A5443

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

Date of Publish : 24 September 2026, 8:21 am | Digital Edition : PRAJA VANI

## నిధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్...?

రెవెన్యూలో సమస్యలేనా.. పరిష్కారాలుండవా?

నిధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్...?

*నెలల కొద్ది పెండింగ్ పెడుతూ ఇబ్బందులు పెడుతున్న వైనం..?

*జాప్యానికి మారుపేరుగా ఆ రెవెన్యూ ఇన్స్పెక్టర్ 2..?

*ధ్రువీకరణలు పెండింగ్ పై బాధితుల అసహనం

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి

ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో ప్రజలకు కులం ఆదాయం ఇతర సర్టిఫికెట్లు సకాలంలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు విమర్శలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా మండలంలో రెండవ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పెండింగ్లో పెట్టడంతో అప్రూవల్ ఇవ్వకపోవడంతో బాధితులు మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతూ పడి కాపులు కాస్తున్నట్లు సమాచారం. సదరు రెవిన్ ఇన్స్పెక్టర్ పై ఇటీవల కాలంలో కూడా అనేక ఆరోపణలు విమర్శలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కూడా అనేక పోస్టులు చక్కర్లు కొట్టినట్లు తెలిసింది. కాగా సర్ ప్రక్రియలో మార్పులు చేర్పులతో గాను లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందినందుకు ధృవీకరణలు తప్పనిసరి కావడంతో ఇటీవల ప్రభుత్వం రెవెన్యూ యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. క్షేత్రస్థాయిలో జిపిఓ ను దాటుకొని రెవిన్యూ ఇన్స్పెక్టర్కు సంబంధిత దరఖాస్తులు చేరినప్పటికీ పెండింగ్లో పెట్టడం పట్ల పలువురు మండల ప్రజలు బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మన ప్రజావాణి ఖమ్మం బ్యూరో ప్రతినిధి సంబంధిత రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఏకవీరను వివరణ కోరగా ఇటీవల సోషల్ మీడియాలో వచ్చినట్లు సమాచారం అందడంతో వెంటనే స్పందించినట్లు తన వద్దకు వచ్చిన సర్టిఫికెట్లకు వెంటనే అప్రూవల్ ఇస్తున్నట్లు చెప్పారు.

GOVERNMENT OF TELANGANA
MeeSeva Portal

కాగా పందిళ్ళపల్లి వివరాలను గురించి ప్రస్తావించగా అటువంటిది ఏమీ లేదంటూ నీళ్ళు నమిలారు. సదరు రెవెన్యూ ఇన్స్పెక్టర్ కస్టర్ పరిధిలో కొన్ని దరఖాస్తులు నెలలు కొద్దీ మగ్గుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు కలెక్టర్ స్పందించి ఎటువంటి జాప్యం లేకుండా ధ్రువీకరణ పత్రాలు మండల వ్యాప్తంగా అందేందుకు చర్యలు తీసుకోవాలని సదరు రెవిన్యూ ఇన్స్పెక్టర్ పై విచారణ చేయాలని పలువురు బాధితులు మండల ప్రజలు కోరుతున్నారు.

మరికొన్ని సమగ్ర వివరాలతో.. రెండవ కథనంలో...!

Copyright © 2026 prajavaani.net. All rights reserved.

వ్యవహరించాల్సిన సదరు జిపిఓ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ కార్డును కలిగి ప్రభుత్వ లబ్ధి పొందుతున్నట్లు కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఓ మహిళకు చెందిన ధృవీకరణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం. దీంతో సదరు

వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇతర అవసరాల కోసం ప్రజలు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించిన నేపథ్యంలో పెండింగ్లో పెడుతున్నట్లు కొందరు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. దీంతో ఖమ్మం జిల్లాలో ప్రధానంగా ముదిగొండ చింతకాని




[redacted]

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 83 | 365410688216 (NA) (JWF385517337643) | FSC | Bollepogu Nagarathnam(UID:xxxxxxxxxxxx) | 4 | | Si |
| 84 | 365410688203 (NA) (JHY460389528883) | FSC | Bollepogu Thirumalamma(UID:xxxxxxxxxxxx) | 3 | | Si |
| 85 | 365410688160 (NA) (JOR635232931208) | FSC | Bollepogu Thirumalamma(UID:xxxxxxxxxxxx) | 2 | | Si |
| 86 | 365410779981 (NA) (JGF878218247556) | FSC | Bollepogu Triveni(UID:xxxxxxxxxxxx) | 4 | | |
| 87 | 365410688292 (NA) (JDW995977220238) | FSC | Bollepogu Vijeta(UID:xxxxxxxxxxxx) | 4 | | |
| 88 | 365410688493 (NA) (JYI601710510903) | FSC | Bollipogu Seetha(UID:xxxxxxxxxxxx) | 3 | | Si |
| 89 | 365410688049 (NA) (JOS379425746091) | FSC | Bonasi Kamalamma(UID:xxxxxxxxxxxx) | 2 | | Si |
| 90 | 365410754498 (NA) (JRS602118888897) | FSC | Bonasi Mariyamma(UID:xxxxxxxxxxxx) | 3 | | Si |
| 91 | 365410688383 (NA) (JKG100322810894) | FSC | Bonasi Padma(UID:xxxxxxxxxxxx) | 4 | | Si |
| 92 | 365410790606 (NA) (JML105640213421) | FSC | Bonasi Rathna(UID:xxxxxxxxxxxx) | 3 | | |
| 93 | 365410688375 (NA) (JSB341048057893) | FSC | Bonasi Sowjanya(UID:xxxxxxxxxxxx) | 3 | | |
| 94 | 365410688394 (NA) (JDY767729218354) | FSC | Bosu Thulasamma(UID:xxxxxxxxxxxx) | 1 | | Si |
| 95 | 365410688486 (NA) (JDW808872698184) | FSC | Challa Basavamma(UID:xxxxxxxxxxxx) | 3 | | Si |

[redacted]

# మల్లారం జీపీఓ ఇష్టారాజ్యం

- సర్టిఫికెట్ల జారీలో"నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనం...?
- అనుకూలంగా ఉన్నవారికే ధ్రువపత్రాలా
- ధ్రువీకరణ పత్రాలు అడిగితే లోకల్ నాన్ లోకల్ అంటూ నిర్లక్ష్యం....?
- పైసలిస్తే పనులవుతాయా..? లేకుంటే పెండింగ్ లోనేనా...!







ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని ముదిగొండ మండలం మల్లారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీ వ్యవహారంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుకూలంగా ఉన్న వ్యక్తులకు ధ్రువపత్రాలు సులభంగా జారీ చేస్తున్నారని, ఇతరులు సర్టిఫికెట్ కోసం వెళ్తే మాత్రం నిబంధనల పేరుతో తిప్పి పంపుతున్నారని కొందరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీ తీరు చర్చనీయాంశంగా మారింది.

అడిగితే ఓ తీరు.. అనుకూలమైతే మరో తీరు

సర్టిఫికెట్ కోసం కార్యాలయానికి వెళ్లే కొందరితో 'మీది ఇక్కడ కాదు' అన్నట్లుగా వ్యవహరిస్తూ వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అవసరమైన ఆధారాలు ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని బాధితులు వాపోతున్నారు. అదే సమయంలో తమకు అనుకూలంగా ఉన్నవారి దరఖాస్తులు మాత్రం త్వరగా పరిష్కరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

అమౌంట్ ఇస్తేనే పని' అంటూ ఆరోపణలు...?

సర్టిఫికెట్ల జారీకి సంబంధించి డబ్బులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే వీటిపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవమెంత? నిబంధనల ప్రకారమే సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతోందా...?

గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీపై ఇంతగా ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏ మేరకు ఉంది? ఈ వ్యవహారం వారి దృష్టికి వచ్చిందా? తెలిసినా చర్యలు ఎందుకు లేవు? అనే ప్రశ్నలు గ్రామస్థుల్లో వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ విషయంపై రెవెన్యూ అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలతో పాటు ఓటర్ల నమోదు ప్రక్రియలో చాలా కీలకంగా మారినప్పటికీ కొంతమంది అధికారుల తీరు వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిన అధికారులు ఆ దిశగా వ్యవహరించడం లేదని ఆరోపణలు నియోజకవర్గ వ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

అధికారుల వివరణతో రేపటి కథనం...2లో

కొందరు బహిరంగంగా విమర్శలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా అనేక ఆరోపణలు చేసిన నేపథ్యంలో మన ప్రజావాణి తెలుగు దినపత్రిక సమగ్ర వివరాలతో సంచలన కథనం అందించిన సంగతి ఉమ్మడి ఖమ్మం జిల్లా పాఠకులకు అధికార యంత్రాంగానికి తెలిసిందే. ఈ వార్త కథనం పట్ల పలువురు ఆరా తీసినట్లు సమాచారం. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలుగా కొందరు క్రియేట్ చేసి సోషల్ మీడియా వేదికగా గ్రూపుల్లో షేర్ చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం

బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తూ ఇటీవల ముదిగొండ తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందించినట్లు తెలిసింది. కాగా మధిర నియోజకవర్గ పరిధిలోని ముదిగొండ మల్లారం తో పాటు చింతకాని మండలం రెండవ రెవెన్యూ ఇన్స్పెక్టర్ పై పలు ఆరోపణలు విమర్శలు ఇటీవల వినిపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో ప్రధానంగా మధిర నియోజకవర్గం లోని ముదిగొండ చింతకాని మండలాలలో కొందరు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ విధుల పట్ల నిర్లక్ష్యంగా

మండలాలలో రెవెన్యూ శాఖ అధికారుల తీరుపై పలు విమర్శలు ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. కాగా చింతకాని రెండవ రెవెన్యూ ఇన్స్పెక్టర్ దరఖాస్తుదారులనే కాకుండా కింద స్థాయి ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తున్నట్లు సమాచారం.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రభుత్వం సంబంధిత అధికారులు దృష్టి కేంద్రీకరించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి వాస్తవాలను నిగ్గు తేల్చి సంబంధిత రెవెన్యూ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ముదిగొండ చింతకాని మండలాల ప్రజలు బాధితులు ఒక ప్రకటనలో కోరుతున్నారు.

కాగా మల్లారం జిపిఓ పరిధిలోని కొందరు రంగ ప్రవేశం చేసి పనితీరు బాగానే ఉన్నది డబ్బులు డిమాండ్ చేయలేదు అంటూ కొంతమందిని సంప్రదించినట్లు సమాచారం. ఇటీవల రేషన్ తీసుకున్న సదరు జిపిఓ రేషన్ కార్డులో మార్పులు చేర్పులు చేసినట్లు సమాచారం. ప్రజావాణి కథనాలకు ముదిగొండ మండలంలో సోషల్ మీడియా గ్రూపుల్లో వార్త కథనాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిసింది.

**మరి కొన్ని సమగ్ర వివరాలతో పాటు అధికారుల వివరణలతో రేపటి కథనం...3లో వేచి చూడండి...!**

## కెరీర్ పీక్‌లో ఉండగానే ప్రమాదం.. ఎనిమిది నెలలపాటు మంచానికే పరిమితం



తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేని కథానాయికల్లో స్నేహ ఒకరు. సహజమైన అందం, చక్కటి అభినయం, కుటుంబ కథా చిత్రాల్లో ఒదిగిపోయే నటనతో ఆమె తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో మంచి పేరు సంపాదించారు. స్నేహ అసలు పేరు సుహాసిని. తమిళ సినిమాలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారథి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారథి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల్లో స్నేహకు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. అయితే స్నేహ కెరీర్‌లో జరిగిన ఓ సంఘటన ఆమెను కుంగదీసిందట. కెరీర్ మంచి స్థాయిలో

## ప్యారడైజ్ సినిమా చూసిన కేటీఆర్.. కేసీఆర్ పాత్ర గురించి ఏమన్నారంటే



హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది పారడైజ్' సినిమాను పార్టీ సభ్యులతో కలిసి వీక్షించారు కేటీఆర్ . చాలా ఏళ్ల తర్వాత థియేటర్‌లో సినిమా చూశానని ఎక్స్‌లో వెల్లడించారు. సినిమా చాలా బాగుందని, దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారని, నాని నటన ఆకట్టుకుందని కేటీఆర్ ప్రశంసించారు. ఎమ్మెల్యే శంకరన్న పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువేనని, ఆ పాత్ర స్ఫూర్తి ఏమిటో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. కేటీఆర్ రాకతో థియేటర్ వద్ద అభిమానులు, ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. చాలా ఏళ్ల తర్వాత థియేటర్‌లో సినిమా చూసేందుకు వచ్చినట్లు ఎక్స్ ( ట్విట్టర్) ద్వారా వెల్లడించిన కేటీఆర్.నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన "ది పారడైజ్" చిత్రాన్ని చూశారు కేటీఆర్. తనకు ఇష్టమైన నటుడు నాని సినిమాను చూసేందుకు శనివారం రాత్రి థియేటర్‌కు వెళ్లారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. సినిమాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హావభావాలు, స్టైలింగ్‌ను పోలి ఉండే "శంకరన్న" (ప్రియదర్శి) పాత్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేటీఆర్ రాకతో థియేటర్ ఆవరణకు భారీగా ప్రేక్షకులు, అభిమానులు చేరుకున్నారు. .సినిమా చూసిన తర్వాత కేటీఆర్ మాట్లాడుతూ.. ది పారడైజ్ సినిమా చాలా బాగుంది. సామాజిక అంశాన్ని బలంగా తెరపై ఆవిష్కరించారు. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. కథ, పాత్రలు, సన్నివేశాలను ప్రభావవంతంగా చూపించారు. నాని అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. పాత్రకు పూర్తిగా న్యాయం చేశారని కేటీఆర్ అన్నారు. అలాగే మీఞూ శంకరన్న పాత్ర ప్రత్యేక ఆకర్షణ, ఆ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. సినిమాలోని సామాజిక అంశాలు, పాత్రల సంఘర్షణ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయని అన్నారు కేటీఆర్. అభినందించారు.

## ఆ కండిషన్‌తోనే బిగ్ బాస్ కు వెళ్లా.. ఒక్క రూపాయి కూడా రాలేదు.



బాలీవుడ్‌లో తన డాన్స్, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నోరా ఫతేహి.. ప్రస్తుతం భారతీయ సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు. కెనడాకు చెందిన ఈ ముద్దుగుమ్మ డాన్స్ పెర్ఫార్మెన్స్‌తో పాటు మ్యూజిక్ ఆల్బమ్స్, సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ ద్వారా భారీ క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే నేడు స్టార్‌గా కొనసాగుతున్న నోరా ప్రయాణం అంత సులభంగా సాగలేదు. కెరీర్ ప్రారంభంలో ఆర్థిక ఇబ్బందులు, అవకాశాల కోసం ఎదురుచూపులు, పారితోషికం చెల్లింపుల విషయంలో ఎదురైన సమస్యలను ఆమె స్వయంగా వెల్లడించారు.

ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నోరా ఫతేహి తన కెరీర్ ప్రారంభ దశకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కొన్ని ప్రాజెక్టులు, పాటల్లో పనిచేసినప్పటికీ తనకు రావాల్సిన పారితోషికం పూర్తిగా అందలేదని ఆమె తెలిపారు. తాను పనిచేసిన ప్రాజెక్టులకు సంబంధించిన చెల్లింపులు ఏజెన్సీలకు చేశామని కొందరు నిర్మాతలు చెప్పేవారని, అయితే చివరకు తన చేతికి మాత్రం డబ్బులు వచ్చేవి కావని నోరా పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆమెకు 'బిగ్ బాస్' నుంచి అవకాశం వచ్చిందని చెప్పారు.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నోరా ఫతేహి తన కెరీర్ ప్రారంభ దశకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కొన్ని ప్రాజెక్టులు, పాటల్లో పనిచేసినప్పటికీ తనకు రావాల్సిన పారితోషికం పూర్తిగా అందలేదని ఆమె తెలిపారు. తాను పనిచేసిన ప్రాజెక్టులకు సంబంధించిన చెల్లింపులు ఏజెన్సీలకు చేశామని కొందరు నిర్మాతలు చెప్పేవారని, అయితే చివరకు తన చేతికి మాత్రం డబ్బులు వచ్చేవి కావని నోరా పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆమెకు 'బిగ్ బాస్' నుంచి అవకాశం వచ్చిందని చెప్పారు.తొలినాళ్లలో రియాలిటీ షోలపై తనకు పెద్దగా ఆసక్తి ఉండేది కాదని నోరా వెల్లడించారు. అందుకే బిగ్ బాస్ నిర్వాహకులు సంప్రదించినప్పుడు మొదట తాను ఆ ఆఫర్‌ను తిరస్కరించానని చెప్పారు. అయితే షో ద్వారా లభించే పారితోషికం గురించి తెలుసుకున్న తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు నోరా తెలిపారు. అదే సమయంలో బిగ్ బాస్ వంటి భారీ

## బిగ్‌బాస్ 10 మూడో వారం ఎలిమినేషన్‌ఊహించని కంటెస్టెంట్ బయటకు నిరాశలో ఫ్యాన్స్





బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 ఆసక్తికరంగా, రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే ఈ సీజన్ లో విజయవంతంగా రెండు వారాలు పూర్తయ్యాయి. ఇప్పుడు మూడో వారం కూడా ఎండింగ్ కు వచ్చేసింది. దీంతో ఎప్పటిలాగే ఎలిమినేషన్ ఎవరన్నది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే వీకెండ్ ఎపిసోడ్స్ లో భాగంగా నాగార్జున ఎంట్రీ ఇచ్చి కంటెస్టెంట్లతో మాట్లాడుతున్నారు. తప్పులు చేసిన వారితో తనదైన శైలిలో ఆడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మూడో వారం ఎవరు బిగ్ బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు చాలా మంది ఓటింగ్ లో అట్టడుగున ఉన్న యాంకర్ వర్షిణీ హౌస్ నుంచి బయటకు వస్తుందనుకుంటున్నారు. అయితే ఇక్కడే ఓ ట్విస్ట్ ఇచ్చాడు బిగ్ బాస్. ఎవరూ ఊహించని విధంగా ఓ టాప్ మేల్ కంటెస్టెంట్ బిగ్ బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అయ్యి బయటకు రానున్నాడని సమాచారం. మూడో వారం ఎలిమినేషన్స్ కు సంబంధించి బిగ్ బాస్ 10 నామినేషన్స్ లో త్రిగుణ్, సుధీర్ రెడ్డి, అమన్, చరణ్, వంశీ, షాలిని, వర్షిణి, సింగర్ ఝాన్సీ ఉన్నారు. ప్రస్తుతమున్న ఓటింగ్ ట్రెండస్ ప్రకారం త్రిగుణ్ టాప్‌లో కొనసాగుతున్నాడు. ఎవరూ ఊహించని విధంగా గత రెండు వారాలు బాటమ్ లో ఉన్న సుధీర్ రెడ్డి ఇప్పుడు ఏకంగా టాప్ 2కి దూసుకొచ్చాడు. ఇక చరణ్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.ఇక టాప్-4 ప్లేస్ లో అమన్ ఉండగా, వంశీ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆరో ప్లేస్ లో వర్షిణీ ఉండగా, ఏడో ప్లేసులో షాలినీ, ఎనిమిదో స్థానంలో సింగర్ ఝాన్సీ ఉన్నారు. అయితే సింగర్ ఝాన్సీకి సోషల్ మీడియాలోనూ ఫుల్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. పైగా ఆమెకు రైతు బిడ్డ ట్యాగ్ కూడా ఉంది. దీంతో ఆమె ఎలిమినేట్ అయ్యే ఛాన్స్ లేదు. ఇక షాలినీ కూడా గేమ్ బాగా ఆడుతోంది. సామాజిక మాధ్యమాల్లోనూ ఆమెకు మంచి సపోర్ట్ ఉంటోంది. ఇక మిగిలింది యాంకర్ వర్షిణీ, టెంపర్ వంశీ. ప్రస్తుతం వీరిద్దరి మధ్యనే ఎలిమినేషన్ ప్రాసెస్ జరుగుతోంది. అయితే ఎలిమినేషన్ కు సంబంధించి వర్షిణి జస్ట్ లో మిస్ అయ్యిందని, వంశీ

## నాని 'ది ప్యారడైజ్' సక్సెస్ మీట్.. మరోసారి గొప్ప మనసు చాటుకున్న మోహన్ బాబు



ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో 'ది ప్యారడైజ్' సినిమా ఫీవర్ నడుస్తోంది. ఎక్కడ చూసినా ఈ సినిమా పేరే వినిపిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో అయితే ఈ మూవీ పేరు తెగ మార్మోగుతుంది. స్వయంగా మాజీ మంత్రి, బీఆర్ ఎస్ అగ్రనేత కేటీఆర్ సైతం ది ప్యారడైజ్ సినిమాను చూసేందుకు థియేటర్ కు వెళుతున్నాననడం ఆసక్తికరంగా మారింది. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ పీరియాడికల్ యాక్షన్ ఎంటర్ టైనర్ లో జడల్ అనే పాత్రలో నాని అదరగొట్టాడు. హీరోయిన్ గా కయాదు లోహర్ అందంగా కనిపించింది. ఇక శికంజా మాలిక్ అనే క్రూరమైన విలన్ పాత్రలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు అదరగొట్టారు. కొన్ని సీన్లలో అయితే మోహన్ బాబు నట విశ్వరూపం చూపించారని క్రిటిక్స్ చెబుతున్నారు. ఇక సినిమాకు మొదటి రోజే మిక్స్ డ్ టాక్ వచ్చినా కలెక్షన్లు మాత్రం ఓ రేంజ్ లో వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు రెండు రోజుల్లో కలిపి రూ. 114 కోట్ల వసూళ్లు వచ్చినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది .ఈ నేపథ్యంలో ది ప్యారడైజ్ చిత్ర బృందం శనివారం (సెప్టెంబర్ 26) సక్సెస్ మీట్ నిర్వహించింది. నాని, శ్రీకాంత్ ఓదెల, మోహన్ బాబుతో సహా చిత్ర బృందమంతా ఈ కార్యక్రమానికి హాజరైంది. ఈ సందర్భంగా మాట్లాడిన మోహన్ బాబు చాలా ఎమోషనల్ అయ్యారు.ఈ సందర్భంగా తనకు తమ్ముడిలాంటి గద్దర్‌ను గుర్తుచేసుకున్నారు మోహన్ బాబు. గద్దర్ కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని చెబుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'నాకు తమ్ముడి లాంటి వారు గద్దర్. ఆయన పిల్లలు మా స్కూల్‌లోనే చదువుకున్నారు. రచయితలు అంటే నాకు చాలా ఇష్టం' అని ఎమోషనల్ అయ్యారాయన. ఈ సందర్భంగా ఓ రచయిత మృతి చెందిన విషయం తనకు తెలిసిందని గుర్తుచేసుకున్న మోహన్‌బాబు.. ఆయన కుమారుడిని వేదికపైకి పిలిపించి మాట్లాడారు. అతడు ప్రస్తుతం ఏం

## నాని 'ది ప్యారడైజ్' సినిమాను రిజెక్ట్ చేసిన స్టార్ హీరోయిన్ ఎవరో తెలుసా



నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ది ప్యారడైజ్ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతోంది. మొదటి షోకే మిక్స్ డ్ టాక్ వచ్చినప్పటికీ ఈ సినిమాకు రికార్డు కలెక్షన్లు వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమా రెండు రోజులకు కలిపి ఏకంగా 114 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్లు చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నాని జడల్ అనే పాత్రలో అద్భుతంగా నటించాడు. అలాగే హీరోయిన్ గా కయాదు లోహర్ సుబ్బు అనే పాత్రలో క్యూట్ గా కనిపించింది. వీరితో పాటు మోహన్ బాబు, రాఘవ్ జుయెల్, సంపూర్ణేష్ బాబు, సోనాల్ కులకర్ణి తదితరులు ఈ మూవీలో ప్రధాన పాత్రలు పోషించారు. ఇదిలా ఉంటే రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోన్న ది ప్యారడైజ్ సినిమా గురించి ఒక ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అదేంటంటే.. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం ముందుగా కయాదు లోహర్ ను ఎంపిక చేయలేదట. వేరొ స్టార్ హీరోయిన్ ఈ సినిమాని రిజెక్ట్ చేయడంతో తిరిగి చిత్ర నిర్మాతలు కయాదును ఎంపిక చేశారని తెలుస్తోంది. మరి మొదటగా సుబ్బు పాత్ర కోసం దర్శక నిర్మాతలు అనుకున్న స్టార్ హీరోయిన్ ఎవరో తెలుసా?దేవర సినిమా తో తెలుగు సినిమా ఇండస్ట్రీకి పరిచయమైంది బాలీవుడ్ క్రేజీ హీరోయిన్ జాన్వీ కపూర్. ఈ సినిమా తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న ఆమె రామ్ చరణ్ పెద్ది

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com